

- మధ్యతరగతికి జీఎస్టీ ఊరట
- నేటి నుంచి కుదింపు శ్లాబుల అమలు
- తగ్గనున్న వాహన, గృహోపకరణాల ధరలు
- నిత్యావసరాలు, ఇతర వస్తువులపైనా పన్ను మార్పుతో అన్ని వర్గాలకు ఉపశమనం
- దసరా, దీపావళి పండుగలకు పెరగనున్న కొనుగోళ్లు... వ్యాపారుల్లో ఆశాభావం

పన్ను దన్ను!

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వస్తు సేవల పన్ను (జీఎస్టీ) శ్లాబ్‌ల మార్పు సోమవారం నుంచి అమలులోకి రానుంది. ఇప్పటివరకు 5, 12, 18, 28 శాతం శ్లాబులు ఉండగా వాటిని ఇక నుంచి 5, 18 శాతంగా కేంద్రం అమలు చేయనుంది. ఈనెల తొలివారంలో జరిగిన జీఎస్టీ కౌన్సిల్‌లో ఆ మేరకు నిర్ణయించింది. ఈ మార్పుతో సామాన్య, మధ్యతరగతికి మేలు జరగనుంది. కొనుగోళ్లు పెరిగి వ్యాపారులకూ ఆదాయం సమకూరనుంది.

ఒంగోలు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఇప్పటిదాకా లగ్జరీ వస్తువులుగా భావించే కార్లు, ద్విచక్ర ఇతర వాహనాలు, ఏసీలు, ఫ్రిజ్‌లు, టీవీలు, ఎలక్ట్రానిక్ గృహోపకరణాలు, నిర్మాణ రంగంలో కీలకమైన సిమెంట్ వంటి వాటిపై 28 శాతం జీఎస్టీ వసూలు చేస్తోంది. దానిని 18 శాతం మేర తగ్గించింది. అంటే సుమారు రూ.10 లక్షల ఖరీదైన కారుపై ఇప్పటి వరకు 28 శాతం ప్రకారం రూ.2.80 లక్షలు జీఎస్టీ వసూలు చేస్తుండగా ప్రస్తుతం తగ్గింపుతో లక్ష రూపాయల మేర ఊరట కలగనుంది. రూ.50వేల ఖరీదు ఉండే టీవీ, ఏసీ, వాషింగ్ మిషన్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులపై ఇప్పటి వరకు 28 శాతం ప్రకారం రూ.14వేల వరకు పన్ను ఉండేది. ఇక నుంచి రూ.5వేలు తగ్గనుంది. బైకులు, స్కూటీలు ఇతర ద్విచక్ర వాహనాలపై కూడా రూ.10వేల నుంచి రూ.15వేల వరకు ఊరట లభిస్తుంది. నిత్యం ప్రజానీకం వాడే వివిధ రకాల ఆహార, కాస్మెటిక్ వస్తువులు, మందులు, ఔషధాలు వంటి వాటి ధరలు కూడా తగ్గనున్నాయి. వ్యవసాయంలో రైతులు వాడే ట్రాక్టర్లు, వాటి విడిభాగాలు, పంట కోతల యంత్రాలు, స్ప్రింక్లర్లు ఇతర వాటిపైనా కేంద్రం జీఎస్టీ తగ్గించింది. మొత్తం 81 రకాల విభాగాలకు చెందిన వస్తువులపై ఇలా భారీగా జీఎస్టీ తగ్గించినట్లు సమాచారం. ఇప్పటివరకు గరిష్ఠంగా 28 శాతం ఉన్న జీఎస్టీని ఇకనుంచి 18శాతానికి పరిమితం చేసింది. ఐదుశాతం ఉన్న కొన్ని వస్తువులపై జీఎస్టీ పూర్తిగా రద్దు చేసింది.

18శాతం పన్ను ఉన్న వస్తువులలో అధిక భాగం వస్తువులను 12 శాతం శ్లాబ్ పరిధిలోకి, 12శాతం పరిధిలో ఉన్న వాటిని 5 శాతం పరిధిలోకి తీసుకొచ్చింది. అలా పన్ను శ్లాబ్‌ల తగ్గింపు వల్ల ఆయా రంగాల వస్తువులను ప్రజానీకం కొనుగోలు చేసే అవకాశాలు పెరగనున్నాయి. జీఎస్టీ శ్లాబ్‌ల తగ్గింపుతో దసరా, దీపావళి పండుగలకు కొనుగోళ్లు మరింతగా పెరుగుతాయని వ్యాపార వర్గాలు కూడా ఆనంద పడుతున్నాయి. సాధారణంగా గృహోపకరణాలు, వాహనాల కొనుగోలు పండుగ సమయంలో అధికంగా ఉంటుంది. వినియోగదారులను ఆకర్షించేందుకు పలు రకాల ఆఫర్లను కూడా ప్రకటిస్తుంటారు. ఈసారి కూడా ప్రధాన దుకాణాలు అలా ఆఫర్లు కూడా ఇచ్చాయి. ఇలాంటి సమయంలో జీఎస్టీ తగ్గింపుతో ఆయా రకాల వస్తువుల ధరలు మరింతగా తగ్గుతాయి. మొత్తం మీద జీఎస్టీ తగ్గింపు ప్రభావం అన్ని వర్గాలకు ఎంతో కొంత ఉపకరించనుండగా మధ్యతరగతి ప్రజానీకానికి బాగా ఊరటగానే చెప్పాలి.


సీసీ రోడ్ల శిలాఫలకం ప్రారంభంలో పాల్గొన్న మంత్రులు అనిత, స్వామి, రవికుమార్

పల్లెల ప్రగతే ప్రభుత్వ లక్ష్యం

- హోంమంత్రి వంగలపూడి అనిత
- రూ.11 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం
- పాల్గొన్న మంత్రులు డోలా, గొట్టిపాటి, ఎమ్మెల్యేలు

తూర్పునాయుడుపాలెం (సింగరాయకొండ) సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పల్లెసీమలను ప్రగతి పథంలో నడిపించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో ఆదివారం మంత్రులు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య, పలువురు ఎమ్మెల్యేలతో కలిసి అనిత పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత జాతీయ రహదారి పక్కనే ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, స్వర్గీయ ఎన్టీఆర్, దామచర్ల విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్సీ కాలనీల్లో రూ.2కోట్ల వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీరోడ్లు, సైడుకాలువల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తదుపరి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.50 లక్షలతో నిర్మించిన ప్రహరీని ప్రారంభించారు. తదనంతరం గ్రామంలో రూ.4.5 కోట్ల వ్యయంతో నిర్మించిన 33-11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ఇరువురు మంత్రులతో కలిసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించిన డ్రైనేజీ, రూ.3.35 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్ల శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లెసీమలే దేశానికి పట్టుగొమ్మలని అన్నారు. అందుకే గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందని చెప్పారు. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్‌ను ప్రజలకు అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ కొండపి నియోజకవర్గంలో అభివృద్ధిని పరిచయం చేసిన మహోన్నత వ్యక్తి మాజీమంత్రి వర్యులు దామచర్ల అంజనేయులు అని కొనియాడారు. తూర్పు నాయుడుపాలెంలో సుమారు రూ.11 కోట్లతో పూర్తిచేసిన అభివృద్ధి పనులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఎంఎం కొండయ్య, ఇంటూరి నాగేశ్వరరావు, టూరిజం బోర్డు చైర్మన్ బాలాజీ, దర్శి, ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జిలు గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్ బాబు, మేయర్ సుజాత, టీడీపీ నియోజక వర్గ పరిశీలకులు అడకా స్వాములు పాల్గొన్నారు.



ఊరు పరిశుభ్రంగా..

- చెత్తసేకరణపై ప్రత్యేక దృష్టి
- 250 పంచాయతీల్లో ఇంటింటికీ రెండు బుట్టలు
- 200 గృహాలకు ఒక క్లాప్ మిత్ర
- ఐవీఆర్‌ఎస్ ద్వారా ఎప్పటికప్పుడు ప్రజల నుంచి సమాచారం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రభుత్వం సంకల్పించింది. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించింది. అందుకోసం పలు చర్యలు చేపట్టింది. పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఆదేశాలతో జిల్లాలోని 250 స్వచ్ఛ గ్రామ పంచాయతీల్లో ప్రతి గృహం నుంచి తడి, పొడి చెత్త సేకరణ కోసం ఇంటింటికీ రెండు బుట్టలను అధికారులు ఇవ్వనున్నారు. ప్రతి 200 గృహాలకు క్లాప్ మిత్రను నియమించనున్నారు. స్వచ్ఛ గ్రామాల్లో చెత్త సేకరణపై ఐవీఆర్‌ఎస్ కాల్స్ ద్వారా ప్రజల నుంచి ప్రభుత్వం సమాచారాన్ని సేకరించే ప్రక్రియను చేపట్టింది. ఇది వచ్చేనెల 2వతేదీ వరకు కొనసాగనుంది.

పంచాయతీల ఆర్థిక బలోపేతానికి చర్యలు

పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఆయా

మిగతా 6లో...

పశ్చిమాన పరవళ్లు

- పొంగిపొర్లుతున్న వాగులు
- జిల్లావ్యాప్తంగా వర్షాలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ
- కంభం చెరువుకు చేరుతున్న నీరు
- ముమ్మరం కానున్న పంటల సాగు
- అక్కడక్కడా తప్పని అవస్థలు


గిద్దలూరులో ఉధృతంగా ప్రవహిస్తున్న సగిలేరు


ఒంగోలు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఐదు రోజులుగా వాన జోరు కొనసాగుతోంది. ఆదివారం తెల్లవారు జామున కూడా పలు ప్రాంతాల్లో భారీగా కురిసింది. నల్లమలలోనూ కుండపోతగా పడింది. దీంతో పశ్చిమప్రాంతంలో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. గుండ్లకమ్మ పరవళ్లు తొక్కుతోంది. కంభం చెరువుకు భారీగా వర్షపు నీరు చేరుతోంది. ఈనెల తొలిపక్షంలో జిల్లాలో బెట్టవాతావరణం నెలకొని పంటలు వాడుముఖం పట్టగా రెండో పక్షం ఆరంభం నుంచి వర్షాలు ప్రారంభమయ్యాయి. అలా ఐదు రోజులుగా నిత్యం వర్షం కురుస్తోంది. ఈ ఐదు రోజుల్లో జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 82 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా సుమారు 81 మి.మీ వర్షపాతం నమోదైంది. అందులో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం లోపు 28 మి.మీ కురిసింది. నల్లమల అటవీ ప్రాంతంలోనూ భారీ వర్షాలు పడుతుండటంతో పశ్చిమప్రాంతంలోని పలు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. గిద్దలూరు, అర్ధవీడు ప్రాంతంలో గుండ్లకమ్మ పరవళ్లు తొక్కుతోంది. సగిలేరు, జంపలేరులో భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. ఆ నీరు పెద్దఎత్తున కంభం చెరువుకు చేరుతోంది. పెద్దారవీడు చెరువుకు భారీగా వర్షపు నీరు వస్తోంది. పుల్లలచెరువు మండలం తెల్లగట్లలో భారీ వర్షం కురిసి చెరువుకు నీరు వెళ్లే కాలువ తెగి పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. దర్శి ప్రాంతంలోనూ విస్తారంగా వానలు కురుస్తున్నాయి. ముండ్లమూరు మండలం వేంపాడు సమీపంలోని చిలకలేరు పొంగి ప్రవహిస్తోంది. దీంతో దర్శి-అద్దంకి మార్గంలో రాకపోకలకు అంతరాయం కలిగింది. దర్శి పట్టణంలోని పలు కాలనీల్లోకి వర్షపు నీరు చేరింది.


మార్కాపురం వద్ద నిండుగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మ


పుల్లలచెరువు మండలం తెల్లగట్ల వద్ద తెగిపోయిన సప్లయ్ చానల్

మిర్చి, పొగాకు నాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధం

తాజా వర్షాలు పొలంలో ఉన్న పైర్లకు ఉపకరించడంతోపాటు ముమ్మరంగా పంటల సాగుకు వీలుకలగనుంది. ప్రధానంగా వరి, మొక్కజొన్న, మినుము, మిర్చి సాగుకు... పశ్చిమ ప్రాంతంలో పొగనాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాలలో ఉన్న పండ్ల తోటలకు, పశుగ్రాస పంటలకు కూడా వర్షాలు మేలు చేశాయి. అక్కడక్కడా పొలాల్లో నీరు చేరడంతో పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా ఆదివారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో 28.0 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. హనుమంతునిపాడు మండలంలో అత్యధికంగా 69.0 మి.మీ కురిసింది. అత్యల్పంగా పీసీపల్లి మండలంలో 1.2మి.మీ పడింది.



ఒంగోలు గంటాపాలెంలోని పార్వతమ్మ గుడి వద్ద విద్యుత్ దీపాల అలంకరణ

జగన్మాతా.. జయములీయమ్మా!

- నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు
- ఈ ఏడాది అమ్మవారికి పది అవతారాలు
- తిథి ఎక్కువ రావటమే కారణం
- ఘనంగా నిర్వహించటానికి ఏర్పాట్లు పూర్తి

7లో...



సమరశీల పోరాటాలు సాగించాలి

- ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి
- అంగన్‌వాడీ యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సింధు పిలుపు

7

భిక్షాటనతో భక్తి ‘మార్గం’

- వచ్చిన సొమ్ముతో ఆలయానికి సేవ చేస్తున్న సాధువు
- ఏ గుడివద్ద భిక్షమెత్తితే అక్కడ వసతుల కల్పనకు కృషి
- త్రిపురాంతకం ఆలయంలో క్యూలైన్ ఏర్పాటు
- మరో రూ.10 లక్షలతో ఆర్చి నిర్మించటానికి శివరాములు తలంపు

వివరాలు మెయిన్‌లో



ఇంద్రకీలాద్రికి దసరా శోభ

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

- ఈఏడాది 20 లక్షలమంది భక్తులు వస్తారని అంచనా
- 29న దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి స్నపనాది క్రతువు నిర్వహిస్తారు. తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిస్తారు. ఉదయం 8-8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది దేశం నలుమూలల నుంచి ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల కోసం స్లాట్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల వరకు కల్పిస్తారు. ఈ ఏడాది భక్తుల కోసం 20 లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా ఇంద్రకీలాద్రి విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా వెలుగుతోంది. 29వ తేదీ మూలానక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపులు

శరన్నవరాత్రులు ముగిసే వరకు అమలు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై సోమవారం నుంచి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల కారణంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

- హైదరాబాద్-విజయవాడ-హైదరాబాద్-విశాఖపట్నం మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగి హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి వాహనాలు చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి నల్లకుంట వద్ద దిగి హైదరాబాద్ మార్గంలోకి వెళ్లాలి.
- హైదరాబాద్ - మచిలీపట్నం-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగాలి. కేసరపల్లి మీదుగా మచిలీపట్నం చేరుకోవాలి. ఇటు నుంచి వెళ్లే వాహనాలు కేసరపల్లి వద్ద నుంచి చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కాలి.
- హైదరాబాద్-చెన్నై-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా గుంటూరు చేరుకుని అక్కడి నుంచి చెన్నై వెళ్లాలి. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.
- చెన్నై-విశాఖపట్నం-చెన్నై మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఒంగోలు, త్రోవగుంట, చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ బైపాస్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి చెన్నై వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.

నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభంకానున్నాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, కంకణపూజ, కంకణధారణ తదితర పూజలు నిర్వహించనున్నారు. భ్రమరాంబికాదేవి అమ్మవారు సోమవారం శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ నిర్వహించనున్నారు.

ఉత్తరాంధ్రకు వాయు'గండం'

- పిడుగులతో భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక
- బెజవాడలో 13 సెంటీమీటర్ల వర్షం.. నేడు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్రకు వాయుగుండం పొంచి ఉంది. ఈ నెల 26న వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం 27న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు ఎక్కువగా ఉంటుందని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోమవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీంతో సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్రలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 25న తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. మూడు రోజుల వ్యవధిలో ఏర్పడనున్న రెండు అల్పపీడనాల ప్రభావంతో ఈనెల 24 నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు, కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. విజయవాడ సింగ్‌నగర్‌లో 13, చిత్తూరు జిల్లాలోని కాగితలో 8.3, ఏలూరు జిల్లా కాకర్లమూడిలో 8, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 6.9, చిత్తూరులోని యాదమర్రిలో 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, ఒకట్రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని నిపుణుడొకరు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్ర నాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణ చేసిన అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను జ్ఞాపికగా అందజేశారు.

నేటి నుంచి విశాఖలో 28వ జాతీయ ఈ గవర్నెన్స్ కాన్ఫరెన్స్

- ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుంది
- కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి

విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌ను ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి వి.శ్రీనివాస్ వెల్లడించారు. విశాఖలో ఆదివారం మాట్లాడుతూ.. వికసిత్ భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో సదస్సు ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తారన్నారు. ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుందని, ప్రస్తు తం 738 రకాలు సేవలు అందిస్తున్నారని, దీనిని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా అభివర్ణించారు. విశాఖ డిక్లరేషన్‌లో దీనిని భాగం చేసి దేశమంతా అమలు చేసేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారన్నారు. అత్యుత్తమ కార్యక్రమాలు నిర్వహించిన వారికి ఈ గవర్నెన్స్- 2025 అవార్డులు అందిస్తామన్నారు.

కూటమి నేతలపై అనుచిత పోస్టులు

- వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు



వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో అంజాద్ ఖాన్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. కదిరి పట్టణానికి చెంది న కొలేపల్లి అంజాద్‌ఖాన్ అలియాస్ మెగా అంజాద్ వైసీపీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తుండేవాడు. రెండ్రోజుల క్రితం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు.

27లోపు డిమాండ్లు పరిష్కరించాలి

- లేదంటే పెన్షన్ పంపిణీని నిలిపేస్తాం
- ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ

పెనమలూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27 లోపు తమ డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్చలకు పిలవని పక్షంలో అక్టోబరు 1 నుంచి పెన్షన్ పంపిణీని నిలుపుదల చేసేందుకు వెనుకాడబోమని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ హెచ్చరించింది. పోరంకిలో ఆదివారం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బగ్గా జగదీష్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కలెక్టర్లకు, ఇతర అధికారులకు జేఏసీ తరఫున నోటీసులు అందజేస్తామన్నా రు. 26, 27 తేదీల్లో ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న అఫిషియల్ వాట్సాప్ గ్రూపుల నుంచి ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా వైదొలుగుతారన్నారు. 28న రాయలసీమ వేదికగా కర్నూలు జిల్లాలో ప్రాంతీయ సమావేశం ఏర్పాటుచేసి తదుపరి కార్యాచరణను విడుదల చేస్తామని తెలిపారు.

తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలకు రేపు అంకురార్పణ

- ఎల్లుండి ధ్వజారోహణంతో ఉత్సవాలు ఆరంభం

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలను ప్రారంభించడానికి మంగళవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలో సేనాధిపతిని అలంకరించి విశేష సమర్పణ గావిస్తారు. అనంతరం తిరుచ్చిపై ఆశీనులు చేస్తారు. రాత్రి ఏడు గంటలకు ఆలయం నుంచి బయల్దేరి నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత ఆలయానికి చేరుకున్న అనంతరం రంగనాయకమండపంలో ఆస్థానం జరుగుతుంది. యాగశాలలో అర్చకస్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ(బీజవాపం) కార్యక్రమం నిర్వహిస్తారు. 24వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయి.

తప్పుడు వార్తలను నమ్మకండి

- కపిలతీర్థంలో ఎలాంటి తొక్కిసలాట జరగలేదు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొక్కిసలాట జరిగిందని, కపిలతీర్థంలో ఏర్పాట్లు చేయలేదని సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు వార్తలను భక్తులు నమ్మవద్దంటూ టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. 'మహాలయ అమావాస్య సందర్భంగా తిరుపతి కపిలతీర్థం ఆలయం బయట ప్రైవేట్ వ్యక్తులు పితృతర్పణాల కార్యక్రమం చేసుకోవడం ఆనవాయితీ. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌ను టీటీడీ ఏర్పాట్లు చేసింది. రద్దీ నేపథ్యంలో భద్రతాపరంగా పటిష్ఠ చర్యలు తీసుకున్నాం. ఎస్పీ వాహనం, పోలీస్ వాహనం రావడంతో తొక్కిసలాట జరిగినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తిరుమలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా ఇక్కడ తొక్కిసలాట అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కొంతమంది టీటీడీని లక్ష్యం చేసుకుని దుష్ప్రచారం చేయడం సరికాదు. టీటీడీ ప్రతిష్ఠను పలుచన చేయడాలని చూడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. ఇలాంటి వార్తలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అంటూ టీటీడీ తన సోషల్ మీడియా ద్వారా పేర్కొంది.

విజ్ఞాన్ వర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు విద్య, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్ మాట్లాడుతూ ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశ్వనాథన్ ఆనంద్, హరికృష్ణ, హంపి, హరిదాసన్, ప్రగ్నానంద లాంటి ప్రతిభావంతులు దేశానికి ఎనలేని కీర్తి తెచ్చారని అశోక్ కొనియాడారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మొదటగా ఒక ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ లాల్‌త మునా, చీఫ్ ఆర్బిటర్ అనంత రామన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.సురేష్, చీఫ్ అడ్వయిజర్ కేవీవీ శర్మ, సెక్రటరీ కే.జగదీష్, గుంటూరు చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రవీంద్ర రాజు, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం

- సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసిన మంత్రి రవికుమార్
- ఏడాదిలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.400 కోట్ల సాయం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న మంత్రి రవికుమార్

అద్దంకి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. అద్దంకి నియోజకవర్గంలో పలు గ్రామాలకు చెందిన 120 మంది అనారోగ్యంతో బాధపడుతూ కార్పొరేట్ వైద్యశాలలో వైద్యం చేయించుకోగా, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను ఆదివారం చిలకలూరిపేటలో మంత్రి రవికుమార్ అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాది కాలంలోనే రా ష్ట్ర వ్యాప్తంగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 400 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించామన్నారు.

అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

అద్దంకి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో అమవాస్య సందర్భంగా ఆదివారం స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో అన్నదానం చేశారు. ఆకుల సత్యనారాయణ, స్వరాజ్యలక్ష్మి కుటుంబసభ్యుల సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు వాసు గురుస్వామి, పెద్దన్న గురుస్వామి, తిరుపతిరెడ్డి గురుస్వామి, అమరా శ్రీను, మంగమూరి సతీష్, మంచిళ్ల సుబ్రహ్మణ్యం, కురిచేటి వెంకటసుబ్బారావు(చిన్ని), వడ్డవల్లి పూర్ణచంద్రరావు, ఉండవల్లి శ్రీను, వేదాంత్, తవ్వా రవికుమార్, తేలుకుట్ల శ్రీకాంత్, పెదలంక హనుమంతరావు, ఉడత్తు ఆదినారాయణ, శిఖాకొల్లి కారుణ్య తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండలో దశ సహస్ర కదళీఫలార్చన

అద్దంకి, సెప్టెంబరు 21 (ఆంధ్ర జ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో అమవాస్య సందర్భంగా ఆదివారం పది వేల అరటిపండ్లతో దశసహస్ర కదళీఫలార్చన నిర్వహించారు. ఉదయం నిత్యపూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేదపండితులు హరి శంకరావధాని, ప్రధాన పూజారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పూజ నిర్వహించి, అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.



అరటి పండ్లతో ప్రసన్నాంజనేయస్వామి అలంకరణ

పారిశ్రామిక రంగానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట

ఎన్‌టీఆర్ ఆటోనగర్ పారిశ్రామికవేత్తల సర్వసభ్య సమావేశం



సమావేశంలో ఆటోనగర్ కమిటీ ప్రతినిధులు

ఈపూరుపాలెం(చీరాల), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక రంగానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఈపూరుపాలెం ఎన్టీఆర్ ఆటోనగర్ అసోసియేషన్ స్థలాల కొనుగోలుదారులు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కమిటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆదివారం అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆటోనగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటోనగర్‌లో ఇండస్ట్రీయల్స్ ఏర్పాటుతో వేల మందికి ఉపాధి అవకాశాలు అందుతాయని వివరించారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు కొనుగోలుకు, వినియోగ సమయంలో విద్యుత్ రాయితీలు, బ్యాంకు రుణాలు వంటివి సులభతరం చేసినట్లు చెప్పారు. ఏపీ ఐఐసీ స్పష్టమైన మార్గాలతో నిర్వహణ సాగిస్తున్నట్లు వివరించారు. అలాగే అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షులుగా రామరాజు, సెక్రటరీగా శ్యాంప్రసాద్, ఉపాధ్యక్షులు గోవింద్, కోశాధికారిగా శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా హనుమంతురావు, తదితర సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో రెండు రాష్ట్రాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

అధ్వానంగా పర్చూరు-నాగులపాలెం రహదారి



గోతులతో నిండిన రహదారి

పర్చూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఉన్న పర్చూరు-నాగులపాలెం రోడ్డు అధ్వానంగా తయారైంది. పెద్ద పెద్ద గుంతలతో ఈ రోడ్డు నిండి ఉంది. ఈ రోడ్డు అభివృద్ధి తమ పని కాదని వివిధ శాఖల అధికారులు వ్యవహరిస్తున్నారు. పర్చూరు ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలోని ఈ రోడ్డులో నిత్యం ప్రభుత్వ వాహనాలు ప్రయాణిస్తునే ఉంటాయి. కొత్త రోడ్డు సంగతి పక్కన పెడితే కనీసం గుంతలు అభివృద్ధి చేస్తున్న దాఖలాలు కూడా కనిపించడం లేదు. దీంతో గుంతల్లో నీరు నిండుతోంది. ఇది గుర్తించలేని వాహన దారులు ప్రమాదాల బారిన పడాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్డు మరమ్మతులు చేయించాలని వాహన దారులు, ప్రజలు కోరుతున్నారు.

పొంగిపొర్లుతున్న వాగులు, చెరువులు

వాగులను తలపిస్తున్న నేలవంతెనలు



చెన్నుపల్లి కొండాయపాలెం నేలచప్టా వద్ద చేపలను పడుతున్న స్థానికులు

బల్లికురవ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) :మండలంలోని పలుగ్రామాలలో గత మూడురోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో పలు వాగులు, చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. రోడ్లన్నీ జలమయమయ్యాయి. చెన్నుపల్లి కొండాయపాలెం గ్రామాల మధ్య ఉన్న నేలవంతెనపై పెద్దఎత్తున వర్షపునీరు వాగులా ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలుకు కూడా తీవ్ర ఇబ్బంది ఎదురైంది. చెన్నుపల్లి చెరువు నుంచి అలుగు ద్వారా నీరు రావడంతో బల్లికురవ వీర్లచెరువులో ఉన్న చేపలు పైకి ఎగబాగడంతో పొలాలుపై చేపలు వచ్చాయని తెలిసి పలు గ్రామాల ప్రజలు కర్రలు తీసుకొని చేపలను పట్టుకున్నారు. కొందరైతే వలలను వేసి పెద్ద పెద్ద చేపలను పట్టుకుపోయారు. వాతావరణం చల్లబడటంతో ఎటు చూసినా నీరు కనిపించడంతో పంట భూములు కళకళలాడుతున్నాయి. అలానే గ్రామాల్లో ఉన్న సాగునీటి చెరువులు నీటితో కళకళ లాడుతున్నాయి.

అపరిచిత కాల్స్‌తో సైబర్ మోసాలు

ఇంకొల్లు, సెప్టెంబరు 21,(ఆంధ్రజ్యోతి) : అపరిచిత కాల్స్‌కు స్పందించి, సైబర్ మోసాలకు బాధితులు కావద్దని ఇంకొల్లు ఎస్సై సురేష్ అన్నారు. ఇటీవల పెరిగిన సైబర్ మోసాలపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఆదివారం ఆయన ఓ వీడియో ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కలిగించారు. తెలియని నంబర్ల నుంచి కానీ, తెలియని వ్యక్తుల నుంచి వాట్సాప్‌కాల్స్ ద్వారా వచ్చే బెదిరింపులకు భయపడవద్దన్నారు. వారి మాయమాటల్లో పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మీ ఆధార్ నంబరుకానీ, బ్యాంకుఖాతా వివరాలు, ఓటీపీ నంబర్లు ఎవరికీ తెలియజేయకూడదన్నారు. మీకు అనుమానిత నంబర్ల నుంచి కాల్స్ వస్తే 1903 నంబరుకు కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని చెప్పారు. సైబర్ నేరాలు పెరిగిన నేపథ్యంలో ప్రజలు చైతన్యవంతులై పక్కవారిని కూడా చైతన్య పరచాలన్నారు.

మహిళా సాధికారత చేతల్లో చూపాలి



మాట్లాడుతున్న శ్రీనివాసులు

పొదిలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారత మాటల్లోకాదు చేతుల్లో చూపాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు చెప్పారు. ఆదివారం సాయిబాలాజీ కల్యాణ మండపంలో జరిగిన జిల్లా మహిళా ఉపాధ్యాయ చైతన్య సదస్సు జిల్లా అధ్యక్షురాలు ఉమామహేశ్వరి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారతపై నాటి నుంచి నేటి వరకు పాలకులు ఇచ్చిన హామీలు నెరవేరడం లేదన్నారు. ఉపాధ్యాయులు, యూటీఎఫ్ కార్యకర్తలు పాఠశాలలకు వెళ్లినప్పుడు కుల, మత భేదం లేకుండా మంచి బోధన అందించాలని కోరారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం 11వ పీఆర్సీ, డీఏ బకాయిలు, సరెండర్ లీవ్‌లు, ఏపీజీఎల్ఐ, జడ్పీపీఎఫ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు గ్రాట్యుటీ బకాయిల విడుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా చిన్నబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌హై, ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, గౌరవ అధ్యక్షుడు రవి, రామిరెడ్డి, చిన్నస్వామి, జిల్లా కార్యదర్శి బాలవెంకటేశ్వర్లు, బుజ్జిబాబు పాల్గొన్నారు.

ఊరు పరిశుభ్రంగా..

(5వపేజీ తరువాయి)

పంచాయతీల్లో సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించి వర్మీకంపోస్టు తయారు చేయాలని ఆదేశించింది. తద్వారా ఆదాయం లభించనుంది. జిల్లాలోని 453 గ్రామ పంచాయతీల్లో 1.07 లక్షల ఎల్‌ఈడీ లైట్లు అమర్చారు. మిగిలిన పంచాయతీల్లో కూడా వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు ఇంటి పన్ను వసూళ్లపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో బకాయిలు రూ.14.37 కోట్లు ఉన్నాయి. అందులో 17 పంచాయతీల్లో రూ.7.49కోట్లు పేరుకుపోవడంతో ఆ పంచాయతీలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈనెలాఖరు లోపు వాటిని వసూలు చేయాలని కమిషనర్ ఆదేశించడంతో తదనుగుణంగా జిల్లాలో చర్యలు తీసుకున్నారు.

నేటి నుంచి ప్రైవేటు డిగ్రీ కళాశాలలు మూసివేత

ఒంగోలు విద్య, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయనందుకు నిరసనగా సోమవారం నుంచి ప్రైవేటు డిగ్రీ కళాశాలలను మూసివేయాలని కళాశాలల యాజమాన్యాలు నిర్ణయించాయి. ఈ మేరకు ఏపీ ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తికి, ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డీవీఆర్ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబులకు వినతిపత్రాలను అందజేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకపోతే కళాశాలలను నిరవధికంగా మూసివేస్తామని అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కే గుండారెడ్డి, రాష్ట్రప్రధాన కార్యదర్శి పి.పెద్దిరాజు, జిల్లా అధ్యక్షుడు రాంబాబులు తెలిపారు. ఏకేయూ పరిధిలోని 88 ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు గత 15నెలలుగా ఫీజురీయింబర్స్‌మెంట్ సుమారు రూ.100 కోట్ల బకాయి ఉంది. వీటి పరిధిలోని కళాశాలల్లో సుమారు 27వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో అధ్యాపకులకు జీతాలు కళాశాలల నిర్వహణ భారంగా మారిందన్నారు.

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

ఈ ఏడాది అమ్మవారికి పది అవతారాలు

తిథి ఎక్కువ రావటమే కారణం

ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి

జగన్మాతా.. జయములీయమ్మా!

ఒంగోలు కల్చరల్, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి) : హిందువుల పండుగల్లో అత్యంత ప్రాముఖ్యమైనది దసరా. ఈ పండుగకు తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. శరదృతువు ప్రవేశించే సమయంలో ప్రారంభమయ్యే దసరా నవరాత్రులను శరన్నవరాత్రులుగా పిలుస్తారు. ఈ ఉత్సవాలు ఆశ్వయుజ శుద్ధపాడ్యమి మొదలు నవమి వరకు జరుగుతాయి. మరుసటి రోజైన దశమిని విజయదశమిగా, దసరా పండుగ్గా జరుపుకోవటం ఆనవాయితీ. ప్రస్తుతం శ్రీ విశ్వావసు నామ సంవత్సర శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కాబోతున్నాయి. ఈ ఉత్సవాలు వచ్చే నెల 1వ తేదీ వరకు జరుగుతాయి. 2వ తేదీన దసరా పండుగను ప్రజలు జరుపుకోనున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో ప్రతి రోజూ అమ్మవారికి రోజుకు ఒక విశేషమైన అవతారాన్ని ధరింపజేసి పూజిస్తారు. అయితే ఈ ఏడాది ఈ ఉత్సవాలు పది రోజులు జరగనుండగా, అమ్మవారు పది అవతారాలలో దర్శనమివ్వనున్నారు. అధిక తిథి రావటమే ఇందుకు కారణం. ప్రతి తొమ్మిది సంవత్సరాలకు ఒకసారి ఇలా అధిక తిథి వస్తుంది. దీంతో ఈ సంవత్సరం అదనంగా అమ్మవారు కాత్యాయనీదేవి అవతారంలో కూడా దర్శనమివ్వనున్నారు.

● మహిషాసురుడి అంతంతో విజయదశమి

స్త్రీని అబలగా భావించిన మహిషాసురుడనే రాక్షసుడు, తనను ఏ స్త్రీ సంహరించలేదని భావించి తనకు స్త్రీ చేతిలో మరణం సంభవించే విధంగా బ్రహ్మదేవుని నుంచి వరం పొందుతాడు. ఆ వర గర్వంతో మహిషాసురుడు దేవతలపై దండెత్తి, జయించి ఇంద్రపదవిని ఆక్రమిస్తాడు. దీంతో దేవతలు త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను వేడుకుంటే వారి ముగ్గురి శక్తులతో, 18 చేతులతో, ఒక స్త్రీ రూపంగా ఉద్భవించి, శివుడి నుంచి శూలాన్ని, విష్ణువు నుంచి చక్రాన్ని, ఇంద్రుడి నుంచి వజ్రాయుధాన్ని, వరుణుడి నుంచి పాశాన్ని, బ్రహ్మదేవుని నుంచి అక్షమాలను, హిమవంతుడి నుంచి సింహవాహనాన్ని పొంది 9 రాత్రులు మహిషాసురుడి సైన్యంతో భీకరమైన యుద్ధం చేసి ఓడించింది. అందుకే ఆమెకు మహిషాసురమర్దని అనే పేరువచ్చిందని పురాణాలు చెబుతున్నాయి. ఈ విజయానికి చిహ్నంగా పదో రోజైన ఆశ్వయుజ దశమిని విజయదశమిగా జరుపుకోవటం ఆనవాయితీ.

● రోజుకొక అలంకారంలో అమ్మవారు..

ఈఏడాది శరన్నవరాత్రి పది రోజులు నిర్వహించనుండగా వివిధ దేవాలయాల్లో అమ్మవారిని పది రూపాల్లో అలంకరించి పూజించనున్నారు. తొలిరోజు బాలత్రిపురసుందరి, రెండోరోజు గాయత్రీదేవిగా, మూడోరోజు అన్నపూర్ణాదేవి, నాల్గో రోజు కాత్యాయని దేవి, ఐదో రోజు శ్రీమహాలక్ష్మి దేవి, ఆరోరోజు శ్రీలలిత త్రిపురసుందరి దేవి, ఏడోరోజు శ్రీ మహాచండీ దేవి, ఎనిమిదోరోజు శ్రీమహాసరస్వతి దేవి, తొమ్మిదోరోజు శ్రీవిజయ దుర్గ దేవిగా, పదోరోజు శ్రీ మహిషాసురమర్థని దేవిగా అమ్మవారిని అలంకరించి పూజిస్తారు. ఇక వచ్చే నెల 2వ తేదీన దసరా పండుగ సందర్భంగా అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిస్తారు. ఇందులో సరస్వతిదేవి అలంకారానికి ఎంతో ప్రాశస్త్యం ఉంది. సరస్వతీదేవి పుట్టిన మూలా నక్షత్రం రోజున ఈ అలంకారాన్ని జరపటం వలన ఆ రోజు అనేకమంది తమ పిల్లలకు 'అక్షరాభ్యాసాన్ని' సైతం నిర్వహిస్తారు.

● శరన్నవరాత్రి ఏర్పాట్లు పూర్తి

ఒంగోలు నగరంతో పాటు వల్లూరమ్మ దేవస్థానం, పెళ్లూరు జ్వాలాముఖీ అమ్మవారి దేవస్థానం, త్రిపురాతంకం శ్రీ బాలాత్రిపుర సుందరి ఆలయం, ఇలా జిల్లాలోని పలు అమ్మవారి దేవస్థానాలలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. విద్యుద్దీపాలతో దేవాలయాలను అలంకరించారు. ఇక ఒంగోలు నగరంలో జరిగే కళారాల ఊరేగింపుకు, జమ్మిచెట్టు పూజకు, పార్వేట ఉత్సవ నిర్వహణకు కూడా ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా అమ్మవారి 'కళారాల'ను నగరోత్సవం చేయటం, 'పారువేట' నిర్వహించటం ప్రత్యేకంగా నగరంలోనే జరగటం విశేషం.



పశ్చిమవాసులకు అన్యాయం చేసిన వైసీపీ

సుమారు 15లక్షలకుగాను కేవలం 3 లక్షల 60వేల చదరపు అడుగులే నిర్మాణం

త్వరలో ప్రారంభించి మెరుగైన వైద్యం అందిస్తాం

2026కి వెలిగొండను పూర్తి చేస్తాం

ఎమ్మెల్యే నారాయణరెడ్డి



అసంపూర్తిగా ఉన్న మెడికల్ కాలేజీ భవనాలను చూపించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల

అటు వెలిగొండ, ఇటు మెడికల్ కాలేజీ నిర్మాణం..

ప్రజల చెవిలో పూలు పెట్టిన జగన్

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అటు వెలిగొండ ప్రాజెక్టును పూర్తికాకుండానే జాతికి అంకితం చేశారు.. ఇటు మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తికాకుండానే చేశామని వైసీపీ అధినేత జగన్ చెప్పి పశ్చిమ ప్రాంత ప్రజల చెవుల్లో మరోమారు పూలు పెట్టారని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఎద్దేవా చేశారు. మండలంలోని రాయవరం వద్ద నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీని ఆదివారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే కందుల మీడియాకు ఆ వివరాలను వెల్లడించారు. మెడికల్ కాలేజీ నిర్మాణంపై వైసీపీ నాయకులు ప్రజలకు అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటన్నారు. గత వైసీపీ పాలనలో 14లక్షల85వేల అడుగుల భవనాలను నిర్మించాల్సి ఉండగా, కేవలం 3 లక్షల 60వేల చదరపు అడుగులు మాత్రమే పూర్తి చేసి మెడికల్ కాలేజీని పూర్తి చేశామని ప్రజలకు తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. మెడికల్ కాలేజీలో కీలకమైన అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ ల్యాబ్‌ల బిల్డింగ్‌లు పూర్తి కాలేదన్నారు. 2024 జూన్‌లో నేషనల్ కౌన్సిల్ ప్రతినిధులు ఈ కాలేజీని సందర్శించి నవ్వి ఇక్కడ ఏమి నిర్మాణాలు ఉన్నాయని తరగతులు ప్రారంభించాలని ప్రశ్నించి వెళ్లిపోయారని కందుల గుర్తు చేశారు. అప్పట్లో 17 మెడకల్ కాలేజీల నిర్మాణానికి రూ.8,450కోట్లు అంచనాలు వేసిన వైసీపీ కేవలం రూ.1,350కోట్లు మాత్రమే ఇచ్చిందని, వాటి నిర్మాణం కోసం తీసుకున్న రూ.13వేల కోట్ల రుణం ఏం చేసిందో చెప్పాలని కందుల ప్రశ్నించారు. అలాగే వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండా ప్రారంభించిన జగన్‌రెడ్డి మోసాన్ని ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఇటు మెడికల్ కాలేజీ, అటు వెలిగొండ విషయంలో జగన్‌రెడ్డి ప్రజల చెవిలో పూలు పెట్టారని కందుల అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో మెడికల్ కళాశాలను ఏడాదిలో పూర్తి చేసి పశ్చిమ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తామని కందుల స్పష్టం చేశారు. అలాగే 2026 వెలిగొండ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్తి చేస్తారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం మార్కాపురం జిల్లా, మెడికల్ కాలేజీ, వెలిగొండను పూర్తి చేస్తామని కందుల తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు కందుల రామిరెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కాకర్ల శ్రీనివాసులు, మార్కాపురం సొసైటీ అధ్యక్షుడు జవ్వాజి రామాంజులరెడ్డి, టీడీపీ నాయకులు వక్కడగడ్డ మల్లికార్జున, మౌలాలి, హర్షిత బాబి, బీజేపీ నాయకులు కృష్ణారావు పాల్గొన్నారు.

ప్రజానాయకులు ఎన్టీఆర్, దామచర్ల, పరిటాల

● హోం మంత్రి వంగలపూడి అనిత

● మర్లపాడులో విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రులు



విగ్రహాలను ఆవిష్కరించిన అనంతరం మంత్రులు అనిత, స్వామి, రవికుమార్, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు, మారిటైం బోర్డు చైర్మన్ సత్య తదితరులు

కొండపి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నీతి, నిజాయితీగా పనిచేసి ప్రజల్లో గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న నేతలు దివంగత ఎన్టీఆర్, ఈ ప్రాంతంలో దామచర్ల ఆంజనేయులు, రాయలసీమ ప్రాంతంలో పరిటాల రవి అని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత కొనియాడారు. దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులు 18వ వర్ధంతి సందర్భంగా ఆదివారం టంగుటూరు మండలంలోని మర్లపాడులో దివంగత నాయకులు ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు, పరిటాల రవి విగ్రహాలను ఆమె రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవి, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిలతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభలో అనిత మాట్లాడుతూ ఎన్టీఆర్ ప్రజల చెంతకు రాజకీయాలను తీసుకెళ్లారని, రాజకీయాలకు అనేక వర్గాలు దూరంగా ఉన్న రోజుల్లో సామాన్యులను రాజకీయాల్లోకి తెచ్చి అగ్రనేతలుగా తీర్చిదిద్దారని చెప్పారు. మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, మహిళలకు స్వయం ఉపాధి, చట్ట సభల్లో స్థానం ఎన్టీఆర్ కల్పించారన్నారు. ఆ బాటలోనే సీఎం చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాల్లో నాలుగు పథకాలను మహిళల కోసమే రూపొందించి నెరవేర్చారని చెప్పారు. ఈ ప్రాంతంలో దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులు నీతి, నిజాయితీగా ఈ ప్రాంత అభివృద్ధికి పనిచేసి ప్రజల్లో చెరగని ముద్రవేశారన్నారు. పరిటాల రవి ప్రజానాయకుడిగా పేదల అభ్యున్నతికోసం పనిచేశారన్నారు. సభాధ్యక్షుడు ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ కొండపి నియోజకవర్గంలోని పోలీస్ స్టేషన్లకు విశాలమైన స్థలాలున్నా భవన వసతులు లేవన్నారు. భవన వసతులు కల్పించాలని కోరారు. టంగుటూరు మండలంలోని రాయవారిపాలెంలో గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు చేసిన దాడిలో మరణించిన మహిళ కుటుంబానికి న్యాయం చేయాలని, ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించాలని కోరారు. హోంమంత్రి సానుకూలంగా స్పందించి రెండు సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. మంత్రులు రవికుమార్, స్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీలు మాట్లాడుతూ దామచర్ల ఆంజనేయులు మంచి నేతగా ఈప్రాంతంలో గుర్తింపు పొందారన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ తన తాతకు చెడ్డపేరు రాకుండా ఆయన ఆశయ సాధనకు పనిచేస్తున్నామన్నారు. పర్చూరు, చీరాల, కందుకూరు, గిద్దలూరు ఎమ్మెల్యేలు సాంబశివరావు, ఎం.ఎం. కొండయ్య, ఇంటూరి నాగేశ్వరరావు, అశోక్‌రెడ్డి, దర్శి, వైపాలెం టీడీపీ ఇన్‌చార్జులు గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్‌బాబు, ఒంగోలు మేయర్ సుజాత, టంగుటూరు, కొండపి మండలాల పార్టీ అధ్యక్షులు చంద్రశేఖర్, కొర్రపాటి వసంతరాయుడు, టంగుటూరు మండల నాయకులు బెల్లం జయంత్‌బాబు, కామని విజయ్‌కుమార్, బెజవాడ వెంకటేశ్వర్లు మల్లవరప్పాడు గ్రామ టీడీపీ నాయకులు హరిబాబు, వేణు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ' రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బేబిరాణి, కారుసాల సుబ్బరావమ్మ

89 మందితో రాష్ట్ర కమిటీ ఏర్పాటు, 22 మంది ఆఫీస్ బేరర్ల ఎన్నిక



సుబ్బరావమ్మ, బేబిరాణి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నూతన రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బేబిరాణి, కారుసాల సుబ్బరావమ్మలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు రోజులుగా ఒంగోలులో జరుగుతున్న యూనియన్ రాష్ట్ర మహాసభల్లో ఆదివారం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. 89 మంది రాష్ట్ర కమిటీ ఏర్పాటుతో పాటు 33 మందిఆఫీసు బేరర్లను ఎన్నుకున్నారు. అధ్యక్షవర్గంగా వ్యవహరించిన ఈ మహాసభలోల సంఘం ఈ మూడేళ్ళ కాలంలో చేపట్టిన ఉద్యమాలు, రానున్న కాలంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై మహాసభలో చర్చించారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఆమోదించారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 164 అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలని, అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని, అంగన్‌వాడీల బలోపేతం కోసం ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి సంస్థాగతం చేయాలని, ఐదేళ్లలోపు పిల్లందరికి అంగన్‌వాడీలకు పంపేలా చట్టం చేయాలని, అంగన్‌వాడీ పిల్లలకు తల్లికివందనం అమలు చేయాలని, యాప్‌ల భారం తొలగించాలని, రాష్ట్రంలో మిగిలిన 1810 మినీ అంగన్‌వాడీలను మెయిన్ సెంటర్లుగామార్చి సిబ్బందిని నియమించాలని మహాసభలో తీర్మానించారు.

28.0 మి.మీ సగటు వర్షపాతం



ఒంగోలులో వర్షపునీరు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా శనివారం రాత్రి ఒక మోస్తరు వర్షం కురిసింది. ఆదివారం ఉదయానికి 24 గంటల వ్యవధిలో 28.0 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. హనుమంతునిపాడు మండలంలో అత్యధికంగా 69.0 మి.మీ కురిసింది. అత్యల్పంగా పీసీపల్లి మండలంలో 1.2మి.మీ పడింది. తాళ్లూరు మండలంలో 66.0, పుల్లలచెరువులో 60.4, తర్లుపాడులో 64.2, దర్శిలో 46.2, టంగుటూరులో 46.2, చీమకుర్తిలో 45.0, త్రిపురాంతకంలో39.4, పెద్దారవీడులో 38.6, కనిగిరిలో 34.0, మర్రిపూడిలో 32.8, జరుగుమల్లిలో 32.4, ఒంగోలు రూరల్‌లో 30.6, ఒంగోలు అర్బన్‌లో 30.6, అర్ధవీడులో 30.4, కొమరోలులో 29.8, కొత్తపట్నంలో 28.8 మి.మీ వర్షపాతం నమోదైంది. సీఎస్‌పురంలో 28.0, కొండపిలో 27.6, బేస్తవారిపేటలో 27.4, మార్కాపురంలో 27.2, గిద్దలూరులో 27.0, కొనకనమిట్లలో 23.0, కంభంలో 22.6, కురిచేడులో 20.2, సింగరాయకొండలో 20.0, దోర్నాలలో 18.4, రాచర్లలో 18.4, దొనకొండలో 18.2, వైపాలెంలో 16.6, మద్దిపాడులో 15.6, ముండ్లమూరు లో 15.4, వెలిగండ్లలో 14.4, వెలిగండ్లలో 14.4 మి.మీ కురిసింది.

సమరశీల పోరాటాలు సాగించాలి

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

'అంగన్‌వాడీ' యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సింధు పిలుపు



మాట్లాడుతున్న ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి సింధు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు అంగన్‌వాడీలు ఐక్య ఉద్యమాలు చేపట్టాలని ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఏఆర్ సింధు పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ అసోసియేషన్ రాష్ట్ర మహాసభల సందర్భంగా ఆదివారం రాత్రి స్థానిక కొత్తకూరగాయల మార్కెట్ సెంటర్ వద్ద జరిగిన బహిరంగ సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు జీ బేబిరాణి అధ్యక్షతన జరిగిన సభలో సింధు మాట్లాడుతూ తనకు తాను విశ్వగురుగా ప్రకటించుకున్న మోదీ.. దేశం వికసిత్ భారత్‌గా వెలిగిపోతోందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రం స్వర్ణాంధ్రగా వికసిస్తుందని చెప్పుకుంటుండగా.. అదేస్థాయిలో పేదలు చాలామంది పోషకాహారం అందక రక్తహీనతకు గురవుతున్నారన్నారు. ప్రతి రోజూ పోష్టికాహారం లోపంతో మరణిస్తున్న 70వేల పసికందులపై జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా పేదలకు పోషకాహారం అందిస్తూ సామాజిక బాధ్యతగా సేవ చేస్తున్న అంగన్‌వాడీలకు కనీస వేతనంతో పాటు తగిన గౌరవం దక్కాలంటే ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. వేతనాల అమలులో ఒక్కొక్క రాష్ట్రం ఒక తీరుగా చెల్లిస్తున్నారని విమర్శించారు. గుజరాత్‌లో కార్యకర్తలకు రూ. 24800, హెల్పర్లకు రూ.20వేలు కోర్టు ద్వారా సాధించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం అక్టోబరు నెలలో కేంద్రమంత్రుల నివాసాల వద్ద పది రోజుల పాటు ఆందోళన చేపట్టాలని పిలుపునిచ్చారు. ఎస్మావంటి నిర్బంధాలు ఎదిరించి ఎన్నో విజయాలు సాధించిన ఉద్యమ స్ఫూర్తితో అంగన్‌వాడీలు, స్కీమ్‌వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలు సాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సీహెచ్ నరసింగరావు, ఉమామహేశ్వరరావు, కారుసాల సుబ్బరావమ్మ, జీవీ కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, వీ రోజా, ఎం. రమేష్, సత్యవతి, జి. శ్రీనివాసులు తదితరులు ఉన్నారు. అంతకు ముందు ఒంగోలులో భారీ బహిరంగ సభ నిర్వహించారు. నెల్లూరు బస్టాండు నుంచి కొత్తమార్కెట్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు.



చీమకుర్తిలో కేక్ కటింగ్ చేస్తున్న నేతలు, శ్రేణులు

ఘనంగా ఎమ్మెల్యే బీఎన్ జన్మదిన వేడుకలు

నియోజకవర్గం అంతటా కేక్ కటింగ్‌లు

పలు చోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించిన టీడీపీ శ్రేణులు

ఒంగోలు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సంతనూతలపాడు శాసనసభ్యుడు బీఎన్ విజయకుమార్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. నియోజకవర్గం అంతటా టీడీపీ శ్రేణులు, బీఎన్ అభిమానులు ఉత్సాహంగా వేడుకలను నిర్వహించారు. సహజంగా.. పుట్టిన రోజు వేడుకలకు ఆయన దూరంగా ఉంటుంటారు. అధికారంలో ఉన్నా లేకున్నా ఆ ఆనవాయితీ పాటిస్తారు. ఈసారి కూడా అందుబాటులో లేరు. అయినప్పటికీ నియోజకవర్గంలో పెద్దఎత్తున ఆయన జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈసారి ఎమ్మెల్యే అయ్యాక గతం కన్నా ఎక్కువగా ప్రజలతో మమేకమయ్యేందుకు ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనికి తోడు ఇటు పార్టీ పరంగా గ్రామ, మండలాలకు కొత్త కమిటీలు నియామకం, అటు ప్రభుత్వ పరంగా ఏఎంసీ, సాగునీటి సంఘాలు, పీఎసీఎస్‌లు ఇతరత్రా పలు రకాల పదవుల భర్తీ చేశారు. వాటి ఎంపికలోనూ పలువురు నేతల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఒంగోలులోని బీఎన్ కార్యాలయంలో అర్ధరాత్రి ముఖ్యనేతలు కేక్ కట్ చేయగా ఆదివారం పలు గ్రామాల్లో కేక్ కటింగ్‌లు నిర్వహించారు. పేదలకు ఆహారం ఇతర వస్తువులు పంపిణీ, రక్తదానం, మొక్కలు పంపిణీ వంటి పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు.



చదలవాడలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


గురజాడ, భీమన్నలకు నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

ఘనంగా గురజాడ, బోయి భీమన్న జయంతి

ఒంగోలు కల్చరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):సంఘ సంస్కర్తలు గురజాడ అప్పారావు, బోయి భీమన్నల జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కళామిత్ర మండలి తెలుగు లోగిలి ఆధ్వర్యంలో స్థానిక మంగమూరు రోడ్డు రాజ్యలక్ష్మి నిలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు గురజాడ, బోయి భీమన్నల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ నూనె అంకమ్మ రావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ జాతీయ భావాలను గుండెనిండా నిపుకున్న నవ్యమార్గ నిర్దేశికులు, మానవతావాదులు గురజాడ అప్పారావు, బోయి భీమన్నలని అన్నారు. ముఖ్యఅతిథి డాక్టర్ నాగభైరవ కోటేశ్వర రావు మాట్లాడుతూ కాలంతోపాటు కదులుతూ జీవితాన్ని, సమాజాన్ని నిశితంగా పరిశీలించి, భాషలోను, భావంలోను విప్లవాన్ని ప్రతిపాదించిన ఆధునిక సాహితీభాస్కరులు గురజాడ, బోయి భీమన్న అని అన్నారు. నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ కుర్రా ప్రసాద్ బాబు, సింహాద్రి జ్యోతిర్మయి, ఎం.సూర్యకుమారి, రత్నం, కేవీస్వీ ప్రసాద్, గుంటూరు సత్యనారాయణ, బీరం అరుణ, నాళం నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో..

స్థానిక సాయిరాం బాలికల జూనియర్ కళాశాలలో గురజాడ 164వ జయంతిని నిర్వహించారు. తొలుత కళాశాల విద్యార్థినులు, అధ్యాపకులు, జేవీవీ నాయకులు గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు జయప్రకాశ్, వెంకటేష్ తదితరులు మాట్లాడగా కళాశాల ప్రిన్సిపాల్ రాఘవ, లెక్చరర్లు ఫణీంద్ర, అంజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


కలెక్టర్ రాజాబాబును సత్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కలెక్టర్‌ను సన్మానించిన వివిధ సంఘాల నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పీ రాజాబాబును ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు శాలువతో సత్కరించి అభినందించారు. ఆల్ ఇండియా బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ అజీజ్ ఆధ్వర్యంలో ఆయా సంఘాల నాయకులు కలెక్టర్‌ను కలిసి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ధరణికోట లక్ష్మీనారాయణ, తాటిపర్తి వెంకటస్వామి, చావల సుధాకర్, పేరయ్య, తాతపూడి ప్రభుదాస్, జిలకర సుబ్బారావు, గుంటూరు మస్తాన్‌రావు, కరవది సుబ్బారావు, అంగలకుర్తి ప్రసాద్ తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న మంచికంటి వెంకటేశ్వర రెడ్డి

ఉత్సాహంగా 'చదవడం మాకిష్టం' కార్యక్రమం

ఒంగోలు కల్చరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జ్ డిప్యూటీ లైబ్రేరియన్ సంపూర్ణ కాళహస్తి నిర్వాహకురాలిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా మరో గ్రంథాలయ ఉద్యమ వ్యవస్థాపకులు మంచికంటి వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదివినప్పుడే పాఠ్యాంశాలు సులభంగా ఆకళింపు చేసుకోగలుగుతారని, అదేవిధంగా విద్యార్థులు సెలవుదినాల్లో గ్రంథాలయానికి రావటం అలవాటు చేసుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు జాలాది మోహన్, కోటేశ్వర రావు, వెంకటరావులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు కళారంగం పట్ల ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. అనంతరం కెసోని బృందం విద్యార్థులతో పలు ఆటలు ఆడించారు. అనంతరం గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా వారు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.


పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

పేదలకు దుప్పట్ల పంపిణీ

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని వచ్చేనెల 2వతేదీ వరకు జరగనున్న సేవా పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం ఒంగోలులో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. బీజేపీ మహిళా నాయకురాలు జిల్లెళ్లమూడి రమాదేవి ఆధ్వర్యంలో స్థానిక శివాలయం వద్ద, విష్ణుఆలయం సమీపంలోని సీవీఎన్ రీడింగ్ రూము వద్ద ఉన్న పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీజేఆర్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

హోం మంత్రి అనిత

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమాజ సేవా కార్యక్రమాలు అభినందనీయం అని, పేదలకోసం అన్ని విధాలుగా అండగా ఉండేందుకు ఏర్పాటు చేసిన ట్రస్ట్ సేవలు మరింత విస్తృతం కావాలని ఆకాంక్షిస్తున్నట్లు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. మాజీ మంత్రి స్వర్గీయ దామచర్ల అంజనేయులు 18వ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం పార్టీ కార్యాలయంలో డీజేఆర్ ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వికలాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ట్రస్ట్ ప్రతినిధులు దామచర్ల నాగసత్యలత, దామచర్ల అనీషా లక్ష్మి అధ్యక్షత వహించగా, హోం మంత్రి వంగలపూడి అనిత, విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి హాజరయ్యారు ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ జిల్లాకు తెలుగుదేశం పార్టీ కంచుకోటలాంటిదన్నారు.

గత వైసీపీ హయాంలోనూ నాలుగు ఎమ్మెల్యే స్థానాల్లో గెలిచిన ఘనత ఉందన్నారు. ముఖ్యంగా అందరు పెద్దాయనగా పిలుచుకునే స్వర్గీయ దామచర్ల ఆంజనేయులు రాజకీయాలలో ప్రత్యేక గుర్తింపు పొందమే కాకుండా సేవా కార్యక్రమాల్లోనూ ఆయన మంచి పేరు సంపాదించారన్నారు. ఆయన బాటలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ సారథ్యంలో వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన డీజేఆర్ ట్రస్ట్ సేవలు నిరుపేదలకు మరింత ప్రయోజనకరంగా ఉన్నాయన్నారు. ట్రస్ట్ ద్వారా ఉచితంగా వీధి వ్యాపారులకు గొడుగులు, తోపుడు బండ్లు, అలాగే ఉచిత విద్యను అందించడం, వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేయడం ప్రశంసనీయం అన్నారు. అదేవిధంగా రూ.10లక్షల విలువైన ట్రై సైకిళ్లు ఉచితంగా అందించడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం కావాలని ఆకాంక్షించారు. ట్రస్ట్ ప్రతినిధులు దామచర్ల నాగసత్యలత, దామచర్ల అనీషా లక్ష్మి మాట్లాడుతూ డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమాజ సేవలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని తెలిపారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలోని స్వర్గీయ ఎన్టీరామారావు, స్వర్గీయ దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ముత్తమల అశోక్ రెడ్డి, ఎంఎం కొండయ్య, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, దర్శి, వై.పాలెం ఇన్‌చార్జులు గొట్టిపాటి లక్ష్మి, గూడూరి ఎరిక్షన్ బాబు, మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్మన్ షేక్ రియాజ్, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, జనసేన నాయకులు కంది రవిశంకర్‌తో పాటు, రోటరీ క్లబ్ అధ్యక్షులు రావిపాటి శ్రీనివాసరావు, సెక్రటరీ కల్లూరి శ్రీనివాస్, కోశాధికారి ఆర్ల శ్రీరామమూర్తి, పలువురు పాల్గొన్నారు.


డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న హోం మంత్రి వంగలపూడి అనిత, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే జనార్ధన్

హోం మంత్రికి సత్కారం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను జనసేన పార్టీ నాయకులు శాలువతో సత్కరించారు. ఒంగోలు శాసన సభ్యుడు దామచర్ల జనార్ధన్ నివాసంలో ఆదివారం జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఒడా చైర్మన్ షేక్ రియాజ్, జనసేన పార్టీ నాయకుడు కంది రవిశంకర్‌లు హోంమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనితను శాలువతో సత్కరించి బోకే ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఆమెతో మాట్లాడారు.


హోం మంత్రిని సత్కరిస్తున్న జనసేన నేతలు

అట్టహాసంగా విజయ్‌కుమార్ పుట్టినరోజు వేడుకలు

నియోజకవర్గంలో పలు సేవాకార్యక్రమాలు

చీమకుర్తి,సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు శాసనసభ్యుడు బీఎన్ విజయ్‌కుమార్ పుట్టినరోజు వేడుకలను చీమకుర్తి పట్టణంలో తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.తొలుత భారీ కేక్‌కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.అభిమానులు పెద్దఎత్తున రక్తదానాన్ని చేశారు.ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఎస్‌కేఆర్ దివ్యాంగుల పాఠశాలలో స్వీట్లు,పండ్లు,అన్నదానాన్ని జరిపారు.ఈ కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్,పట్టణపార్టీ అధ్యక్షుడు ముప్పూరి చలమయ్య, సొసైటీ చైర్మన్ పూనాటి వెంకట్రావు, కందిమళ్ల గంగాధరరావు,గొల్లపూడి కోటేశ్వరరావు, యడ్లపల్లి రామబ్రహ్మం, రావిపాటి రాంబాబు,గొట్టిపాటి రాఘవరావు, కాట్రగడ్డ రమణయ్య, లోకేష్, గంగుల శివపార్వతి, భువనగిరి వెంకాయమ్మ, నర్రా నాగరాజు, జనసేన నాయకులు నాగరాజు,రామకృష్ణారెడ్డి, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు మండల పరిధిలో..

నాగులుప్పలపాడు : ఎంఎల్ఏ బీఎన్ విజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను మండల పరిధిలోని పలు గ్రామాల్లో కూటమి శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. చదలవాడ గ్రామంలోని కుంభకర్ణ హోటల్ వద్ద తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇన్‌చార్జ్ ఆళ్ల నాగార్జున ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు ఇంటూరి శ్రీనివాసరావు కూటమి పార్టీ నాయకులతో కలిసి ఎంఎల్ఏ జన్మదిన కేక్‌ను కట్‌చేశారు. 500 మందికి ఎంపీడీవో తేళ్ల రవికుమార్ చేతుల మీదుగా మొక్కలను అందజేశారు. అలాగే నాగులుప్పలపాడులోని బస్టాండ్ సెంటర్‌లో రాపర్ల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు జన్మదిన వేడుకలు నిర్వహించారు.కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కాట్రగడ్డ చంద్రబాబు, మున్నంగి పున్నారెడ్డి, పోతవరం, మద్దిరాలపాడు గ్రామపార్టీ అధ్యక్షులు నార్నె శరత్,పెనుబోతు సునీల్, టీడీపీ నాయకులు ఈదర వెంకటకృష్ణారావు, బెల్లం వెంకటేశ్వర్లు, జాగర్లమూడి వేణుగోపాల్, మెట్టు సుబ్బయ్యనాయుడు, స్వర్ణ కిషోర్‌బాబు, ఉండ్రాళ్ల వెంకటేశ్వర్లు, కారుమంచి శ్రీకాంత్ పోలవరపు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే మండల పరిధిలోని మాచవరం గ్రామంలో జనసేన పార్టీ మండల అధ్యక్షుడు భూపతి మురళీ మోహన్, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పీకా బైరాగి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.కార్యక్రమంలో నాయకులు లింగా అంజిరెడ్డి, పీకా అశోక్, గుమ్మడి సాంబశివరావు, సంగటి ధనరాజ్, గట్టుపల్లి బుజ్జిబాబు, కోడూరి కోటయ్య, ఎడ్లూరి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.


సంతనూతలపాడులో దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, చెవిటి మిషిన్లు అందజేస్తున్న ఆరికట్ల సుమతి, మద్దినేని హరిబాబు

మద్దిపాడు మండలంలో..


మద్దిపాడులో కేకును కట్‌చేస్తున్న మండల అధ్యక్షుడు, నేతలు

మద్దిపాడు : ఎమ్మెల్యే విజయకుమార్ జన్మదిన వేడుకలను మద్దిపాడు టీడీపీ కార్యాలయంలోఆదివారం నాయకులు ,కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి బీఎన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, నియోజకవర్గ కోఆర్డినేటర్ మండవ జయంత్‌బాబు, నాయకులు రావిపాటి శ్రీనివాసరావు, దుగ్గినేని నరసింహారావు, గోరంట్ల చిరంజీవి,కాకర్ల విజయకుమార్, ముప్పా రవీంద్రబాబు, మార్నేని రాఘవేంద్రరావు, పోతినేని శ్రీనివాసరావు, నల్లూరి శ్రీనివాసరావు, కొర్రపాటి మాధవరావు, మందపల్లి శ్రీనివాసరావు,మార్నేని సుబ్బారావు, మండవ గోపీనాథ్, దేవబత్తిన ప్రసాద్, పాటిబండ్ల అజయ్ బాబు,చుండూరి రఘురామ్, చింతల శ్రీనివాసరావు, పుత్తూరు నాగేశ్వరరావు, గట్టినేని అయ్యన్న, చుంచు హరిబాబు , కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు : మండలకేంద్రం సంతనూతలపాడు టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేక్‌కట్ చేశారు. ఈసందర్భంగా రాష్ట్ర మహిళానాయకురాలు ఆరికట్ల సుమతి మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి రావులపల్లి వెంకట సురేష్‌బాబు, తెలుగు యువత అధ్యక్షుడు ముప్పరాజుశ్రీను, గుమ్మళంపాడు గ్రామ అధ్యక్షుడు బి.చంద్రశేఖర్, కె.గోపి, ఆర్.అంకారావు, బి.శంకర్, ఎన్.కృష్ణారావు, నారాయణరావు, రంగనాయకమ్మ, మీరయ్య, కనకయ్య, శ్రీరామ్మూర్తి, శ్రీనివాసరావు, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ

మండలంలోని పేర్నమిట్ట సమీపంలోని పీర్లమాన్యం 39వ డివిజన్‌లో ఆదివారం ఎమ్మెల్యే విజయ్‌కుమార్ పుట్టినరోజు సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు అధ్యక్షతన రాష్ట్ర మహిళా నాయకురాలు ఆరికట్లసుమతి దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, చెవిటి మెషిన్లు పంపిణీచేశారు. టీడీపీ నాయకులు అబ్బూరిశ్రీనివాసరావు, బి.చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, అమానుల్లా, నన్నేసాహెబ్, బాబు, కే.గోపి, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఎస్ఎన్‌పాడు ఇన్‌చార్జ్‌గా జానుబాబు

మద్దిపాడు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):బహుజన సమాజ్‌వాది పార్టీ సంతనూతలపాడు ఇన్‌చార్జిగా పైనం జాన్‌బాబును ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జాన్‌బాబు మాట్లాడుతూ కాన్షీరాం ఆశయాలు కొనసాగిస్తామని తెలిపారు. బహుజన సమాజ్‌వాది పార్టీ బలోపేతానికి కృషిచేస్తాని, అన్ని మండలాలకు గ్రామ కమిటీలను పూర్తిచేస్తామని అన్నారు.

వాణిజ్య పన్నులశాఖ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సుధాకరరావు


సుధాకరరావు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) : వాణిజ్య పన్నులశాఖ నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లాకు చెందిన కే సుధాకరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం జరిగిన నూతన కమిటీ ఎన్నికల్లో ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నామినేషన్‌దాఖలు చేశారు. అయితే అన్ని పదవులకు ఒక్కొక్కరు మాత్రమే కావడంతో రాష్ట్ర నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఒంగోలులోని వాణిజ్య పన్నులశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్(ఎస్‌టీ) ఒంగోలు-1 సర్కిల్‌లో ఏతవేగా పనిచేస్తున్న సుధాకరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బి. వెంకటేష్‌బాబు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఆర్. స్వామినాయుడు, ఉపాధ్యక్షుడిగా ఐదుగురు, కార్యదర్శులుగా ఐదుగురు, ఆర్గనైజింగ్ సెక్రటరి, కోశాధికారి పదవులను కూడా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాకు చెందిన సుధాకరరావు ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో వాణిజ్య పన్నులశాఖలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగు లు, సిబ్బంది ఆయనను సన్మానించారు. సభ్యులందరికీ సుధాకరరావు కృతజ్ఞతలు తెలిపారు

దిగజారుతున్న లోగ్రేడ్ పొగాకు ధరలు

ఒంగోలు(రూరల్),సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): పొగాకు లోగ్రేడ్ ధరలు రోజురోజుకు దిగజారి పోతున్నాయి. దీంతో నష్టాలు చవిచూడాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అతి కొద్దిమంది రైతులు దగ్గర హైగ్రేడ్ పొగాకు నిల్వలు ఉన్నాయి. ఇప్పటికే పొగాకు బోర్డు అనుమతిచ్చిన పొగాకును రైతులు వేలం కేంద్రాలలో అమ్మకాలు చేసుకున్నారు. ఇప్పుడు అదనపు పొగాకును రైతులు జరిమానాలతో వేలంకేంద్రాలలో అమ్మకాలు చేస్తున్నారు.

అయితే మేలు రకం కిలో రూ. 345నుంచి 346 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారు. ఎస్‌బీఎస్ పరిధిలో లోగ్రేడ్ పొగాకు ధర కిలో 110రూపాయల నుంచి 85 రూపాయల లోపున కొనుగోలు చేస్తున్నారు. ఎస్ఎల్ఎస్ పరిధిలో కిలో 100రూపాయలు నుంచి 89 లోపున కొనుగోలు చేస్తున్నారు.

అదీ ఎక్కువగా నోబిడ్ చేస్తున్నారు. దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని, లోగ్రేడ్‌కు కూడా ధరలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ఆర్ఐవో చొరవతో విద్యార్థినికి సర్టిఫికెట్లు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియెట్ సర్టిఫికెట్ల కోసం స్థానిక కలెక్టరేట్ ఎదుట తల్లితో కలిసి నిరసన తెలిపిన విద్యార్థినికి ఇంటర్మీడియెట్ బోర్డు ఆర్ఐవో కే ఆంజనేయులు చొరవతో కళాశాల యాజమాన్యం సర్టిఫికెట్లను అందజేసింది. ఈ విద్యార్థిని ఒంగోలులోని ఒక కళాశాలలో 2023-25లో ఇంటర్ చదివి పాసైంది. మొదటి సంవత్సరం పుస్తకాలు తీసుకోకపోయినా ఆ పుస్తకాలకు రూ. 6,500 చెల్లించమని డిమాండ్ చేస్తూ ఆమె సర్టిఫికెట్లు నిలిపివేశారు. తాను తీసుకోని పుస్తకాలకు ఫీజుఎందుకు కట్టాలంటూ విద్యార్థిని ప్రశ్నించింది. కళాశాల యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో శనివారం ఎస్ఎఫ్ఐ నాయకుల మద్దతుతో విద్యార్థిని నిరసనకు దిగారు. ఈవిషయం ఆర్ఐవో దృష్టికి వెళ్లడంతో ఆయన కళాశాల యాజమాన్యానికి ఫోన్‌చేసి సీరియస్‌గా హెచ్చరించారు. వెంటనే సర్టిఫికెట్లు ఇవ్వాలని ఆదేశించారు. దీంతో కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థినిని కళాశాలకు పిలిపించి ఆమె మార్కుల జాబితా, టీసీ, స్టడీ సర్టిఫికెట్లు అందజేశారు.

ఆర్టీసీలో అప్రంటీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు విద్య, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఆర్టీసీ డిపోల్లో అప్రంటీస్ శిక్షణలో చేరేందుకు ఐటీఐ పాసైన విద్యార్థులు వచ్చేనెల 4వతేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఒంగోలు ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ పాసైన అభ్యర్థులు తమ పదవ తరగతి, ఐటీఐ సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో అప్రంటిస్ షిప్ ఇండియా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ వెబ్‌సైట్‌లో అభ్యర్థులు తమమెయిల్ ఐడీతో లాగిన్‌అయ్యి అప్రంటీస్ షిప్ చేయదలిచిన జిల్లాను ఎంపిక చేసుకోవాలన్నారు. జిల్లాలో 54 ఖాళీలను భర్తీ చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని ఐటీఐ పాసైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9703165456 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

అనాథాశ్రమంలో నిత్యావసర సరుకుల పంపిణీ

సంతనూతలపాడు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.తక్కెళపాడుకు చెందిన టీడీపీ జిల్లా నాయకుడు కంచాల రాజు ఆదివారం ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ పుట్టినరోజును పురస్కరించుకుని ఒంగోలులోని బొమ్మరిల్లు అనాథ ఆశ్రమంలో పిల్లల మధ్యన కేక్ కట్‌చేశారు. అనంతరం వారికి నిత్యావసర సరుకులు, పండ్లను పంచిపెట్టారు ఈ కార్యక్రమంలో బొమ్మరిల్లు అనాథ ఆశ్రమం నిర్వాహకులు షేక్.ఖాశీం, నాయకులు, కే.లక్ష్మీ నారాయణ, రాజేష్, ఎస్.శ్రీను, ఎంఎల్. నారాయణ, చిరంజీవి, సుబ్బయ్య, రామకృష్ణ, విజయ్, చిన్నారులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ కేసులకు ప్రత్యేకంగా డీఎస్పీలను నియమించాలి

ఒంగోలు కలెక్టరేట్,సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఎస్సీ,ఎస్టీ కేసులకు ప్రత్యేకంగా డీఎస్పీలను నియమించేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాలసంఘాల జేఏసీ నాయకులు కోరారు. ఆదివారం ఒంగోలు వచ్చిన హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను జేఏసీ చైర్మన్ బిళ్లా వసంతరావు ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ,ఎస్టీ కేసుల్లోని నిందితులకు 41 నోటీసులను రద్దు చేసి రిమాండ్‌కు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని అందులో కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగార్జున, సురేష్, వినోద్,శేషయ్య, అనిల్, కృష్ణ తదితరులు ఉన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు ఆంజనేయులు మృతి


ఆంజనేయులు

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గోగినేని ఆంజనేయులు(80) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు.తెలుగుదేశంపార్టీ ఆవిర్భావం నుంచి ఆంజనేయులు పార్టీ పట్ల అంకిత భావంతో పనిచేశారు. గ్రామ పార్టీ అధ్యక్షుడిగా, సొసైటీ చైర్మన్‌గా,మండల పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.ఆయన మృతి పట్ల వివిధ గ్రామాల టీడీపీ నాయకులు తమ సంతాపం వ్యక్తం చేశారు. నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయామని గ్రామ పార్టీ అధ్యక్షుడు కనగాల శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు.

24న మద్దిపాడులో రైతు సదస్సు

మద్దిపాడు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి)మద్దిపాడులో :ఈ నెల 24న రైతు సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షుడు వడ్డే హనుమారెడ్డి తెలిపారు. ఆదివారం రైతుసంఘం నాయకులు మద్దిపాడు మండలంలో గుండ్లాపల్లి, మల్లవరం, దొడ్డవరం తెల్లబాడు కొలచనకోట, బసవన్నపాలెం, సీతారాంపురం గ్రామాల్లో పర్యటించారు. రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తొట్టెంపూడి వెంకట శేషయ్య, చెరుకూరి వాసు బాబు, రావి ఉమామహేశ్వర రావు, రావి నరసింహారావు, రైతులు, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

వీరాంజనేయ స్వామి ఆలయంలో శరన్నవరాత్రి పూజలు

ఒంగోలు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : దసరా ఉత్సవాలలో భాగం గా ఒంగోలు సంతపేటలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 22 నుంచి వచ్చే నెల 2 వరకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అలయ ప్రధాన పూజారి దుర్గేష్ ఆదిశేషు తెలిపారు. 22న రుద్రాభిషేకం, ఉదయం గణపతి పూజ, రక్షా కంకణధారణ, కలశ స్థాపన, లలితా సహస్ర నామార్చన పారాయణం, శ్రీచక్ర అర్చన సౌభాగ్య కుంకుమ పూజ, మధ్యాహ్నం మహా కర్పూర హారతి, మంత్రపుష్పం, రోజూ సాయంత్రం శ్రీ చక్రార్చన కుంకుమ పూజలుంటాయని తెలిపారు. 29న మూలా నక్షత్రం సరస్వతీపూజ, అక్షరాభ్యాసం, 30న దుర్గాష్టమి, అక్టోబరు 1వ తేదీన మహర్నవమి, 2న విజయదశమి రోజున సాయంత్రం శమీవృక్ష ఆయుధ పూజలు జరుగుతాయని తెలిపారు.

నేటి నుంచి సెయింట్ థెరిస్సా చర్చి జూబ్లీ వేడుకలు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని సెయింట్ థెరిస్సా చర్చి నవదిన, మహా జూబ్లీ వేడుకలు ఈనెల 22వ తేదీ నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు జరుగుతాయని చర్చి ఫాదర్ డీఎస్ పాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు, క్రైస్తవ గురువులతో దైవ సందేశాలు, దివ్య బలి పూజ జరుగుతాయని తెలిపారు. ఈ వేడుకలకు నెల్లూరు బిషప్ డాక్టర్ డి.మోజెస్, సహాయ బిషప్ పిల్లి ఆంటోనీ దాస్ ఆశీస్సులతో జరుగుతాయని తెలిపారు. క్రైస్తవులందరూ పాల్గొని వేడుకలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నేడు దామచర్ల ఆంజనేయులు వర్ధంతి

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి, స్వర్గీయ దామచర్ల ఆంజనేయులు 18వ వర్ధంతి సోమవారం ఒంగోలులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ఉదయం 7.30 గంటలకు బాపూజీ కాంప్లెక్స్ ఎదురుగల ఆంజనేయులు విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్, ఆంజనేయులు విగ్రహాలకు నివాళులు అర్పిస్తారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు.

టీడీపీ సీనియర్ నేత వెంకటప్రసాద్ మృతి


వెంకటప్రసాద్

కంభం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కంభం మండల టీడీపీ అధ్యక్షుడు తోట శ్రీనివాసులు సోదరుడు తోట వెంకట ప్రసాద్ (59) ఆదివారం ఒంగోలులో గుండెపోటుతో మరణించారు. టీడీపీ సీనియర్ నాయకుడు, టీడీపీ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే తోట వెంకట ప్రసాద్ ఒంగోలులో నివాసం ఉంటున్నారు. ఆదివారం ఉదయం 9గంటల సమయంలో గుండె పోటు రావడంతో కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలించారు. అప్పటికే ప్రసాద్ మరణించినట్లు డాక్టర్‌లు చెప్పడంతో అతని పార్థివదేహాన్ని స్వగ్రామం కంభానికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి వెంకట ప్రసాద్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. టీడీపీ నాయకులు ప్రసాద్‌కు ఘనంగా నివాళులర్పించారు.

మండల సమావేశానికి విధిగా హాజరు కావాలి

అధికారుల గైర్హాజరుపై ఎంపీపీ అసహనం


మాట్లాడుతున్న ఎంపీపీ

కంభం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆరు నెలలకు ఒకసారి జరిగే మండల సర్వసభ్య సమావేశాలకు అన్ని శాఖల అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కంభం మండల ఎంపిపి చేగిరెడ్డి తులశమ్మ కోరారు. ఎంపీడీవో వీరభద్రాచారి అధ్యక్షతన ఆదివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఉదయం 11గంటలైనా పలు శాఖల అధికారులు రాకపోవడంపై ఎంపీపీ అసహనం వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున కంభం చెరువు ఆయకట్టు కింద వరి పంటకు నీటిని వదలమని రైతులు విజ్ఞప్తి చేస్తున్నందున నీటిని వదలాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. చిన్న కంభం సర్పంచ్ రసూల్ మాట్లాడుతూ గోవిందాపురం గ్రామ సమీపంలో కాలువల ద్వారా నీరు వృథా పోతున్నదని అధికారులు అరికట్టాలన్నారు. గ్రామీణ నీటి పారుదల, పారిశుద్యం, పంచాయతీ రాజ్, గృహ నిర్మాణ శాఖ, శిశు సంక్షేమ శాఖ, పశు సంవర్ధక శాఖ తదితర శాఖలపై చర్చ జరిగింది. సమావేశంలో కంభం కోఆప్షన్ మెంబర్ సలీమ్, జడ్పీటీసీ సభ్యుడు కొత్తపల్లి జ్యోతి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఏవో అబ్దుల్ ఖాదర్ ఉదోన్నతిపై కనిగిరి ఎంపీడీవోగా బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆయన్ని సన్మానించారు.


దోర్నాల మండలం కడపరాజుపల్లిలో వాన నీటిలో మిరపమొక్కలు


పుల్లలచెరువులో అరటిలో నిలిచిన నీరు

పెంచేనా.. ముంచేనా..?

సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయని ఆశతో ఉన్న రైతులను ప్రస్తుతం తరచుగా ఏర్పడుతున్న అల్పపీడన ద్రోణుల కారణంగా కురుస్తున్న వర్షాలతో ఆందోళన కూడా మొదలైంది. వర్షాలతో పంటలు బాగా పెరుగుతాయని అనుకూల వాతావరణం ఏర్పడిందని భావించిన రైతులకు రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలను ఈ వర్షాలు పెంచేనా? లేక అధిక వర్షాలతో ముంచేనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 20వ తేదీ రాత్రి ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని పుల్లలచెరువులో అత్యధికంగా 60.4 మి.మీ, త్రిపురాంతకంలో 39.4 మి.మీ, పెద్దారవీడులో 38.6 మి.మీ, దోర్నాలలో 18.4మి.మీ, ఎర్రగొండపాలెంలో 16.6 మి.మీ వర్షం కురిసింది. వరుసగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు పలు పంట పొలాల్లో నీరు నిలిచిపోయింది. ఇంకా వర్షాలు కొనసాగితే పంటలు పెరిగేనా?.... మునిగేనా? అని రైతులు సందేహపడుతున్నారు.

- త్రిపురాంతకం, ఆంధ్రజ్యోతి

ఉరుములతో భారీ వర్షం

- ఉధృతంగా వాగులు, పొంగిన కాల్వలు
- చెరువులకు చేరిన వరద నీరు
- పంటలకు మేలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెద్దారవీడు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శనివారం అర్ధరాత్రి ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షం దాటికి కాల్వలలో నీళ్లు పారాయి. వర్షపునీటితో మండలంలోని చెరువులకు సగానికిపైగా నీరు చేరాయి. పిడుగులు, వర్షాల దాటికి ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టాలు జరగలేదు.

పంటలకు ప్రాణం

మండలంలో సాగు చేసిన మిరప, పత్తి, పొగాకు, ఇతర కూరగాయల పంటలకు శనివారం కురిసిన వర్షం ప్రాణం పోసినట్లయింది. ఇటీవల బోర్ల కింద డ్రిప్పులతో సాగు చేసిన మిరపకు ముఖ్యంగా ప్రయోజనం చేకూర్చినట్లయింది. అంతేగాక ఉద్యాన పంటలకు సైతం ఈ వర్షం మేలు చేసినట్లయింది.

నిలిచిన కరెంట్ సరఫరా

శనివారం అర్ధరాత్రి వర్షం ప్రారంభమైనప్పటికీ మండలంలోని సబ్‌స్టేషన్ల పరిధిలో ఎటువంటి ప్రమాదాలు తలెత్తకుండా ఉండేందుకు కరెంట్ సరఫరాను నిలిపివేశారు. దీంతో ప్రజలు కొంతమేర ఇబ్బంది పడ్డారు. అయినప్పటికీ ఎటువంటి ప్రమాదాలు చోటుచేసుకోకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

జీవం పోసుకున్న పైర్లు

పొదిలి : పదిరోజులుగా తరచూ కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలో సాగు చేసిన వివిధ పైర్లు జీవం పోసుకున్నాయి. ఇటీవల ఎండుముఖం పట్టిన పైర్లు జీవం పోసుకున్నాయని రైతులు చెప్తున్నారు.మండలంలో అత్యధికంగా కంది 7,600 హెక్టార్లు సాగు చేసినట్లు వ్యవసాయాధికారి డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అలాగే సజ్జ 160, పత్తి 10, పొగాకు 10, వరి 20హెక్టార్లలో సాగులో ఉన్నట్లు చెప్పారు. శుక్రవారం 55.4, శనివారం 7.6 వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.


ఎర్రబాలెం బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న గుండ్లకమ్మ వాగు


వర్షంతో నిండిన బద్వీటి చెర్లోపల్లి చెరువు

ప్రవహిస్తున్న సగిలేరు

గిద్దలూరు టౌన్ : నల్లమల అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు సగిలేరు ప్రవహిస్తున్నది. సగిలేరు ప్రవహిస్తుండడంతో గిద్దలూరు ప్రాంతంలో భూగర్భజలాలు పెరుగనున్నట్లు ఆశాభావం ప్రజల్లో కలిగింది. ఇటీవల సరైన వర్షపాతం నమోదు కాక సగిలేరు ప్రవాహం లేదు. గడిచిన కొద్ది రోజులుగా నల్లమలలో కురుస్తున్న వర్షానికి తోడు ఆదివారం తెల్లవారుజామున గిద్దలూరులో 27.7 ఎంఎం వర్షపాతం నమోదు కావడంతో సగిలేరు ప్రవహిస్తున్నది. చుట్టుపక్కల వాగులు, వంకలు, చెరువులకు నీరు చేరుతున్నది.

నల్లమలలో వానలు

- ఉధృతంగా జంపలేరు, గుండ్లకమ్మ వాగులు
- కంభం చెరువుకు భారీగా వరద

కంభం : నల్లమల్ల అటవీ ప్రాంతంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు అర్ధవీడు మండలం జంపలేరు వాగు, కంభం మండల పరిధిలోని గుండ్లకమ్మ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అర్ధవీడు మండలం బొల్లుపల్లి, వీరభద్రాపురం, పెద్ద కందుకూరు, తదితర గ్రామాల సమీపంలోని చప్టాలపై నుంచి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆయా గ్రామాల మధ్య సాయంత్రం వరకు రాకపోకలు నిలిచిపోయాయి.

రైతుల హర్షం

భారీ వర్షాలకు గుండ్లకమ్మ, జంపలేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఈ రెండు వాగుల నుంచి వచ్చే నీరు కంభం చెరువుకు చేరుతుండడంతో ఈ ప్రాంత రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కంభం చెరువులో 9అడుగుల మేరా నీరు ఉందని, వాగుల్లోకి నీరు చేరితే రెండు రోజుల్లో 12 అడుగులకు చేరవచ్చని ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస నాయక్ తెలిపారు.

పుల్లలచెరువు : మండల వ్యాప్తంగా శనివారం రాత్రి 60.4 మిల్లీ లీటర్ల వర్షపాతం నమోదయింది. దీంతో చెరువుల్లో భారీగా నీరు చేరింది. ప్రధానంగా పుల్లలచెరువు, గంగవరం, ముటుకుల, తెల్లగట్ల, కవలకుంట్లలో భారీ వర్షం కురిసింది. తెల్లగట్లలో చెరువుకు నీరు వేళ్తే సప్లై చానల్ తెగిపోవడంతో నీరు వృథాగా పోయింది. మండలంలో సాగులో ఉన్న కంది, మిర్చి, మొక్కజొన్న పైర్లకు ఈ వర్షం ఎంతో దోహదపడతందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాగులో ఉన్న పత్తికి పూత రాలిపోవడంతో, తీత దశలో ఉన్న పత్తికి కొంత మేరకు నష్టం కలిగించింది. కొన్నేళ్లుగా కరువుతో కుంగిపోతున్న రైతులకు వానలు ఎంతో ఉపయోగపడుతాయని అంటున్నారు.

రాచర్ల : మండలంలో 18.4శాతం వర్షపాతం నమోదయిందని ఏఎస్‌వో షేక్ మున్వర్ ఆదివారం తెలిపారు. నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయని కానీ మండలంలో వర్ష ప్రభావం పెద్దగా లేదన్నారు. శనివారం రాత్రి నల్లమలలో కురిసిన భారీ వానకు చెరువులు, వాగులకు నీరు చేరిందని తెలిపారు.

మార్కాపురం : గత రెండు రోజులుగా రాత్రి వేళల్లో కురిసిన వర్షంతో డివిజన్‌లో పంటలు జీవం పోసుకున్నాయి. అన్ని రకాల పంటలకు వర్షం మేలు చేకూర్చింది. గత కొన్ని రోజులుగా డివిజన్‌లోని పలు మండలాల్లో వేసవిని తలపించే విధంగా ఎండలు భగభగ మండాయి. ఖరీఫ్ సీజన్‌లో గతంతో పోల్చితే 50 శాతం మించి పైర్లు సాగు కాలేదు. విభిన్నమైన వాతావరణ పరిస్థితులు అందుకు కారణమయ్యాయి. చాలవరకు వర్షాధారంపై ఆధారపడే ఈ ప్రాంతంలో మెట్ట పైర్ల విస్తీర్ణం సైతం దాదాపు తగ్గిపోయింది. మిర్చి, పొగాకు వేసేందుకు రైతాంగం పెద్దగా ఆసక్తి చూపలేదు. ఖరీఫ్‌లో బాగానే సాగయ్యే వైట్‌బర్లీ పొగాకు సైతం ఈసారి తగ్గిపోయింది.


అర్ధవీడు మండలం బొల్లుపల్లి వద్ద చప్టాపై నుంచి ప్రవహిస్తున్న జంపలేరు వాగు


సభలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌రావు

ఐక్యతతో హక్కులను సాధించుకోవాలి

బీసీ సంక్షేమ సంఘ సభలో రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌రావు

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీసీలందరూ ఐక్యమత్యంగా, కలిసికట్టుగా హక్కులను సాధించుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్‌రావు అన్నారు. ఆదివారం గిద్దలూరు పట్టణంలోని స్ప్రింగ్‌బోర్డు పాఠశాల ఆవరణలో బీసీ సంక్షేమ సంఘం సభను నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర్‌రావు మాట్లాడుతూ బీసీలకు సబ్‌ప్లాన్, మంత్రిత్వశాఖ, చట్టసభల్లో రిజర్వేషన్ కల్పిస్తామని, ప్రధాని మోదీ చెప్పారని, అయినా ఇంతవరకు ఎటువంటి న్యాయం జరుగలేదన్నారు. కులగణన నేటికీ జరుగలేన్నారు. అత్యధికంగా ఓబీసీల సంఖ్య ఉన్నా చట్టసభల్లో మంత్రిత్వశాఖ, మహిళా రిజర్వేషన్‌ను ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు 33 శాతం రిజర్వేషన్ విషయంలో చంద్రబాబు చొరవచూపాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారికి రాష్ట్ర అధ్యక్షుడు నియామక పత్రాలు అందించారు. అంతకముందు శంకర్‌రావు మీడియాతో మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర మహిళా కార్యదర్శి జాడి శ్వేత, యువజన రాష్ట్ర అధ్యక్షులు సారేపల్లి మహేష్, మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, స్థానిక నాయకులు ఒ.వెంకటయ్య, డాక్టర్ జేవీ నారాయణ, జిల్లా బీసీ అధ్యక్షుడు బలగాని ఆంజనేయులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

గిద్దలూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సంజీవిని అనాథాశ్రమానికి యువ ప్రగతిపథం స్వచ్ఛంద సేవా సంస్థ నిత్యావసర వస్తువులు, పండ్లు అందచేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రతినిధులు రత్నం, పీరయ్య, తదితరులతోపాటు అనాథాశ్రమ నిర్వాహకులు రాజశేఖర్ పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

గిద్దలూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లా రవీంద్రనగర్‌కు చెందిన కాశింబీ అనే అనాథ కొది రోజులుగా గిద్దలూరులోని ఒక బస్‌షెల్టర్ సమీపంలో రోడ్డుపై నివాసం ఉంటూ అనారోగ్యంతో మృతి చెందింది. ఈమె మృతదేహాన్ని యోగా గురూజీ, సంఘ సేవకులు బీఎస్ నారాయణరెడ్డి ముస్లింలకు అప్పచెప్పి ముస్లిం సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పూలసుబ్బయ్య భవన్‌లో సీపీఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం పార్టీ జెండాను నాయకులు అందె నాసరయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు షేక్ కాశిం, కేశవ, హరిబాబు, శంకర్‌రావు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : సీపీఐ ఆవిర్భావ దిన్సోవం సందర్భంగా కార్యాలయ ఆవరణలో జెండాను సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బీ రామయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు టీసీహెచ్ చెన్నయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేవీ కిష్టగౌడ్, మండల కార్యదర్శి మన్నె సాంబశివరావు, సభ్యులు ఆవుల యోగయ్య, మొగిలి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్‌లకు 52 మంది తరలింపు

మార్కాపురం రూరల్, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): ఉచిత కంటి శిబిరంలో పరీక్షలు అనంతరం 52 మందిని ఆపరేషన్‌కు తరలించినట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని జమ్మనపల్లి సానమ్మ ఆలయం వద్ద ఆలయ నిర్వాహకులు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లా చినకాకాని శంకర నేత్రాలయం, అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి 52 మందికి శస్త్ర చికిత్స కోసం శంకర ఆసుపత్రికి బస్సులో తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తిప్పాయపాలెం పీహెచ్‌సీ వైద్యులు రాహుల్ నాయక్, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి టీడీపీ నేతల సాయం

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అర్బన్ కాలనీలో నివాసం ఉంటున్న కందుకూరి చెన్నకేశవులు ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు తమవంతు సహకారంగా రూ.18,500 చెన్నకేశవులు తండ్రి వెంకటేశ్వర్లుకు అందచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బోయిళ్ళపల్లి కిశోర్, పట్టణ పార్టీ అధ్యక్షులు సయ్యద్ షానేషావలి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దత్తా బాలీశ్వరయ్య, కౌన్సిలర్ లొక్కు రమేష్, టీడీపీ నాయకులు మండ్ల శ్రీనివాసులు, ఉలాపు బాలచెన్నయ్య ఉన్నారు.

దసరా ఉత్సవాలకు సర్వం సిద్ధం

నేటి నుంచి శరన్నవరాత్రి పూజలు

త్రిపురాంతకం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ దేవాలయం త్రిపురాంతకంలోని బాలా త్రిపురసుందరీదేవి ఆలయంలో ఈనెల 22వ తేదీ సోమవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఇందుకోసం ఆలయ కార్యనిర్వాహణాధికారి అనిల్‌కుమార్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 22వ తేదీన అమ్మవారిని బాలా త్రిపురసుందరీదేవిగా, 23న బ్రహ్మచారిణిగా, 24న చంద్రఘంటాదేవిగా, 25న కూష్మాండదుర్గగా, 26న శైలపుత్రీ దేవిగా, 27న స్కంధమాతగా, 28న కాత్యాయినిదేవిగా, 29న కాళరాత్రిగా, 30న మహాదుర్గదేవిగా, అక్టోబరు 1న శిద్ధిదాయానిదేవిగా అలంకరిస్తారు. 2వ తేదీ దసరా పండుగరోజు ఆలయంలో పలు పూజలు చేసిన తరువాత అమ్మవారిని సింహ వాహనంపై రాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు గ్రామోత్సవం నిర్వహిస్తారు.

గిద్దలూరు : దసరా శరన్నవరాత్రులు, వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు దేవాలయాలు సిద్ధమయ్యాయి. 22వ తేదీ సోమవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా నవరాత్రుల బుక్‌లెట్లను ఆలయ ప్రధాన పూజారి ప్రవీన్‌శాస్త్రి ఆధ్వర్యంలో దేవస్థాన కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. 22న సోమవారం రాజరాజేశ్వరిదేవి అలంకారం, 23న పార్వతిదేవి, 24న కామాక్షిదేవి, 25న గాయత్రిదేవి, 26న ధనలక్ష్మిదేవి, 27న మీనాక్షిదేవి, 28న అన్నపూర్ణదేవి, 29న సరస్వతిదేవి, 30న మహిషాసురమర్ధినిదేవి, అక్టోబరు 1న వారాహిదేవి, 2న విజయలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు


బాలా త్రిపురసుందరీ అమ్మవారు

భక్తులకు దర్శనమిస్తారని దేవస్థాన కమిటీ అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ, కార్యదర్శి తుమ్మలపెంట సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని షరాఫ్ బజార్‌లోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 22వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుంచి అక్టోబరు 3వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ ప్రతినిధులు తెలిపారు. 22న విష్ణుమూర్తి అవీతారం, 23న మత్స్యావతార, 24న కూర్మావతార, 25న వరాహ, 26న నరసింహ, 27న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి, 28న పరశురామ, 29న రామ, 30న కృష్ణావతార, అక్టోబరు 1న వామన, 2న వేంకటేశ్వర స్వామి, సాయంత్రం గ్రామోత్సవం, 3న వసంతోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వివిధ రకాల సేవా పూజలు, హోమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మార్కాపురం వన్‌టౌన్ : దసరా సందర్భంగా దేవీ శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహించేందుకు మార్కాపురం పట్టణంలో సర్వం సిద్ధం చేశారు. ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పందిళ్లను సిద్ధం చేశారు. లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2 వరకు రాజ్యలక్ష్మి అమ్మవారు పూజలు అందుకుంటారని ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అక్టోబరు 2న దసరా మండపం వద్ద శమీ పూజ, చెన్నకేశవస్వామికి పార్వేట నిర్వహిస్తారని తెలిపారు. 22న రాజ్యలక్ష్మిగా, 23న ఆదిలక్ష్మి, 24 ధనలక్ష్మి, 25 ధాన్యలక్ష్మి, 26న గజలక్ష్మి, 27న సంతానలక్ష్మి, 28న వీరవల్లి, 29 విద్యాలక్ష్మి, 30 వీరలక్ష్మి, అక్టోబరు 1 విజయలక్ష్మి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇస్తారని తెలిపారు. వాసవీ ఆలయంలో అమ్మవారు 22న వాసవీ కన్యకాపరమేశ్వరిగా, 23న సావిత్రి, 24 భవానీదేవి, 25 అన్నపూర్ణ, 26 మహాలక్ష్మీదేవి, 27 రాజరాజేశ్వరి దేవి, 28 గాయత్రీదేవి, 29 సరస్వతి దేవి, 30 మహిసాసుర మర్దిని, అక్టోబరు 1 గజలక్ష్మి, అక్టోబరు 2న కనక దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇస్తారని, 4వ తేదీ పులి వాహనంపై వాసవీమాత నగరోత్సవం నిర్వహిస్తారని కమిటీ అధ్యక్షుడు బొంతల పుల్లారావు, కార్యదర్శి వక్కలగడ్డ సురేశ్ కుమార్, కోశాధికారి చెక్కా మాలకొండ చిన్న నరసింహారావు తెలిపారు. జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు 22వ తేదీ శైలపుత్రి, 23న బ్రహ్మచారిని, 24న చంద్రఘంట, 25న కూష్మాండ దుర్గ, 26న మహాగౌరి, 27న స్కంధమాత, 28న కాత్యాయిని, 29 కాలరాత్రి, 30న మహిసాసుర మర్దిని, అక్టోబరు 1న సిద్దిదాయిని, 2న పార్వతీదేవి అలంకారాలలో భక్తులకు దర్శనం ఇస్తారని, ప్రతి రోజు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు. పట్టణంలోని సత్యనారాయణ స్వామి ఆలయం, నాగేంద్ర కనకదుర్గ ఆలయం, పట్టాభి, ప్రసన్న రామాలయాలలో శరన్నవరాత్రులు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాటు చేశారు

వీడని వర్షం

- లోతట్టు ప్రాంతాల్లో గృహాల్లోకి చేరిన నీరు
- పొంగిన వాగులు
- రాకపోకలకు అంతరాయం

దర్శి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దర్శి ప్రాంతంలో గత ఐదురోజులుగా వర్షం కురుస్తుంది. ఈ వర్షంతో రోడ్లు ఛిద్రమవ్వటంతో పాటు లోతట్టు ప్రాంతాలకు నీరు చేరుతుంది. పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద కుంటలా నీరు చేరింది. ప్రధానంగా దర్శి పట్టణంలోని వెలమవారివీధిలో గృహాల్లోకి నీరు చేరింది. గృహోపకరణాలు, వస్తువులు తడిసిపోయాయి. ఆ వీధిలో నీరు అలాగే నిల్వ ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రక్కనే ఉన్న జోమ్ కాలువ ఆక్రమణలకు గురికావటంతో కిందకు నీరు వెళ్లే వీలు లేక నివాసప్రాంతాల్లోకి చేరాయి. దీంతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

దర్శి-కురిచేడు రోడ్డులో ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఆవరణలోకి వర్షపునీరు చేరటంతో కుంటలా తయారైంది. దర్శి-అద్దంకి రోడ్డులోని ఎస్ఎస్‌పీ కార్యాలయాల వద్ద కుంటలా నీరు నిల్వ ఉంది. అక్కడ ఒక



దర్శి ఎస్ఎస్‌పీ కార్యాలయం వద్ద నిలిచిన వర్షపు నీరు

వైపు దర్శి ఎస్ఎస్‌పీ డివిజన్ కార్యాలయం, మరోవైపు దర్శి ఎస్ఎస్‌పీ సబ్ డివిజన్ కార్యాలయం ఉంది. రెండు కార్యాలయాల మధ్య కుంటలా వర్షపునీరు చేరింది. మధ్యలో ఉన్న రోడ్డు కూడా మునిగిపోవటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

ఇటీవల కాలంలో ఎన్నడూలేని విధంగా వరుసగా



దర్శిలోని వెలమవారి వీధిలో గృహంలోకి చేరిన వర్షపునీరు

ప్రతిరోజు వర్షాలు పడుతుండటంతో జనజీవనం అస్త వ్యస్తంగా మారింది. దర్శిలో 17వ తేది 38.4 మిల్లీ మీటర్లు, 18న 23.2మి.మీ., 19న 59.6 మి.మీ., 20 34.6మి.మీ., 21న 46.2మి.మీ వర్షపాతం నమోదైంది. ఆదివారం సాయంత్రం కూడా భారీ వర్షం కురిసింది. ఈ ఆరురోజుల్లో సుమారు 20 సెంటీమీటర్లు వర్షపాతం నమోదు కావటంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇప్పటివరకు కురిసిన వర్షాలకు మెట్ట పైర్లు జీవం పోసుకొని కళకళలాడుతున్నాయి. ఈవర్షం అధికమైతే దెబ్బతినే పరిస్థితి నెలకొంటుంది. కొద్దిరోజుల క్రితం సాగుచేసిన వైట్ బర్లీ పొగాకు ఇప్పుడిప్పుడే జీవం పోసుకుంటుంది. వర్షం ఇలాగే పడితే పొగమొక్కలు కుళ్లిపోయే ప్రమాదముంది. వర్షం ఆగకపోతే నష్టం జరిగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ముండ్లమూరులో కుండపోత

ముండ్లమూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు భారీ వర్షం కురిసింది. దీంతో



ముండ్లమూరు: వేముల - కమ్మవారిపాలెం మధ్య పొంగిప్రవహిస్తున్న ఈదర వాగు

మండలంలోని పలు వాగులు ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్నాయి. ఆదివారం ఉదయం మండలంలోని ముండ్లమూరు-వేంపాడు మధ్య ఉన్న చిలకలేరు వాగు పొంగి ప్రవహించింది. అద్దంకి - దర్శి ప్రధాన రహదారి కావటంతో పోలీసులు ఎలాంటి



పొంగి ప్రవహిస్తున్న ముండ్లమూరు - వేంపాడు మధ్య చిలకలేరు వాగు

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. దర్శి సీఐ వై.రామారావు దగ్గరుండి సిబ్బందికి సూచనలు చేస్తూ ద్విచక్ర వాహనాలను వాగులోకి దిగకుండా చేశారు. తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ ముండ్లమూరు సమీపంలో చిలకలేరు వాగు, మారెళ్ళ - జమ్మలమడక మధ్య ఉన్న ఈదర వాగును పరిశీలించారు. ఆయా గ్రామాల వీఆర్‌వోలను అప్రమత్తం చేశారు. మండలంలోని వేముల- కమ్మవారిపాలెం మధ్య చిలకలేరు వాగు, ముండ్లమూరు నుంచి తమ్మలూరు వెళ్ళే చిలకలేరు వాగు, పెద ఉల్లగల్లు రెడ్డినగర్ మధ్య ఉన్న వాగు ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్నాయి. మారెళ్ళ - జమ్మలమడక మధ్య వాగు పొంగి ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈదర గ్రామానికి ఆనుకొని ఉన్న వాగు సైతం పొంగి ప్రవహిస్తుంది. భారీ వర్షంతో వేములలో వరి పైరు నీట మునిగింది. మాగాణి భూములు చెరువులను తలపిస్తున్నాయి.



ముండ్లమూరు: భారీ వర్షానికి నీట మునిగిన వేములలోని వరి



మండల స్థాయి ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

క్రీడల్లో ప్రతిభచాటిన ఈదర విద్యార్థులు

ముండ్లమూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులో జరిగిన మండలస్థాయి ఆటల పోటీల్లో ఈదర జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈసందర్భంగా శనివారం సాయంత్రం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం నూనె వెంకటసుబ్బయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాద్‌బాబు, ఉపాధ్యాయులు అభినందించారు. అండర్ - 14 బాలుర వంద మీటర్ల పరుగు పందెంలో ఆర్.నాగచైతన్య, నాలుగు వందల మీటర్ల పరుగు పందెంలో టి.బాలచంద్రుడు మొదటి స్థానం సాధించారు. ఆరు వందల మీటర్ల పరుగు పందెంలో వి.పూర్ణచంద్రరరావు, లాంగ్ జంప్‌లో ఆర్.నాగచైతన్య ద్వితీయ స్థానం, షార్ట్ పుట్‌లో ఎం.నాని మొదటి స్థానంలో నిలిచారు. డిస్కస్ త్రోలో వి.భాను తేజ మొదటి, టి.బాల చందుద్వితీయ స్థానం సాధించారు. బాలికల విభాగంలో వంద మీటర్ల పరుగు పందెంలో ఎం.అనిత, డి.అమూల్య మొదటి రెండుస్థానాల్లో నిలిచారు. రెండు వందల మీటర్ల పరుగు పందెంలో కె.సుప్రియ, ఆరు వందల మీటర్ల పరుగు పందెంలో కె.ఏమియా, లాంగ్ జంప్‌లో కె.తులసి ద్వితీయ స్థానం సాధించారు.

అండర్ - 17 బాలుర విభాగం వంద మీటర్ల పరుగు పందెంలో కె.మారుతీరెడ్డి, రెండు వందల మీటర్లలో కె.యోన, నాలుగు వందల మీటర్లలో ఎం.వీరమణికంఠ, 1500 మీటర్లలో వి.నారాయణరెడ్డి ద్వితీయ స్థానం సాధించారు. షార్ట్‌పుట్‌లో పి.అంజనేయులు, డిస్కస్ త్రోలో పి.అంజనేయులు ద్వితీయ స్థానంలో నిలిచారు. జావిలిన్ త్రోలో పి.అంజనేయులు మొదటి స్థానం సాధించారు. బాలికల విభాగంలో రెండు వందల మీటర్ల పరుగు పందెంలో జి.సేవిత, షాట్‌పుట్‌లో ఎండీ స్వాతిక మొదటి స్థానం సాధించారు. అండర్ - 14 బాలుర విభాగం ఖోఖోలో మొదటి స్థానం, కబడ్డీ విభాగంలో ద్వితీయ స్థానం సాధించారు. బాలికల విభాగంలో కబడ్డీలో ప్రథమ స్థానం సాధించారు. అండర్ - 17 బాలుర విభాగంలో ఖోఖోలో మొదటి స్థానం, కబడ్డీలో ద్వితీయ స్థానం సాధించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ముండ్లమూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదర జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న జె.రామాంజనేయులు రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు కె.ప్రసాద్ తెలిపారు. ఈనెల 14న జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలు మినీ స్టేడియంలో జరిగిన పోటీల్లో ప్రతిభచూపి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. ఈనెల 22 నుంచి 25 వరకు ఎన్‌టీఆర్ జిల్లా గొల్లపూడిలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ప్రకాశం జిల్లా జట్టు తరుపున పాల్గొంటున్నాడు.

ఆర్థిక అసమానతలులేని సమాజమే సీపీఐ లక్ష్యం

కనిగిరి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆర్థిక అసమానతలు లేని సమాజమే లక్ష్యంగా సీపీఐ అనునిత్యం పోరాటం చేస్తుందని ఆపార్టీ జిల్లా కార్యవర్గసభ్యుడు వై.రవీంద్రబాబు అన్నారు. చండీఘడ్‌లో సీపీఐ జాతీయ మహాసభలు ప్రారంభం సందర్భంగా స్థానిక దర్శి చంచయ్య భవనం వద్ద ఆదివారం సీపీఐ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టు పార్టీ వందేళ్ళు పూర్తి చేసుకుని 25వ జాతీయ మహాసభలు నిర్వహించుకుంటుందన్నారు. దేశంలో మోదీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను తాకట్టు పెడుతూ ప్రైవేటు పెట్టుబడిదారులను ప్రోత్సహిస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వంలో జగన్ పేదలకు అండగా నిలవకుండా పెత్తందారులకు వత్తాసు పలికారన్నారు. దీంతో ప్రజలు వారిని తిరస్కరించారన్నారు. ప్రస్తుతం అదే పంథాను సీఎం చంద్రబాబు అవలంబిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, మోహన్, జీపీరా మారావు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పామూరు: స్థానిక జీవైఆర్ భవన్ వద్ద సీపీఐ జండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆపార్టీ నాయకుడు సయ్యద్ మౌలాలి మాట్లాడుతూ పంజాబ్ రాష్ట్రంలోని చండీఘడ్ ప్రాంతంలో ఈనెల 21 నుంచి 25 వరకు జాతీయ మహాసభలు జరుగుతున్న సందర్భంగా పార్టీ జెండాలను ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మోహన్‌రావు, ప్రభాకర్‌రావు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



కనిగిరిలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు వై.రవీంద్రబాబు

శరన్నవరాత్రి వేడుకలకు ఆలయాల ముస్తాబు

పామూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శరన్నవ రాత్రి వేడుకల సందర్భంగా స్థానిక వాసవీమాత, సత్యదేవుని, వల్లీ భుజంగేశ్వర, సాయి బాబ, మహాలక్ష్మి దేవస్థానాలను ముస్తాబుచేశారు. సోమవారం నుంచి శరన్నవ రాత్రి వేడుకలు ప్రారంభంకానున్నాయి. ఈసందర్భంగా వాసవీ మాత ఆలయం కమిటీ నిర్వాహకులు దేవస్థానాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఉత్సవాల సందర్భంగా దేవస్థానం వద్ద ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలో సోమవారం నుంచి శరన్నవ రాత్రి వేడుకలు నిర్వహించనున్నట్లు ధర్మకర్త కాకర్ల భైరవానంద స్వామి తెలిపారు. ప్రతిరోజు ఉదయం 7గంటల నుంచి గణపతిపూజ, మండపా రాధన, కలశ పూజ, అమ్మవారికి అభిషేకం, సామూహిక మంగళ హారతులు తదితర పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ముందస్తుగా దసరా వేడుకలు

పామూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ మార్క్స్ హైస్కూల్‌లో ఆదివారం ముందస్తుగా దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా జరుపుకొనే దసరా నవరాత్రులను గురించి హైస్కూల్ కరస్పాండెంట్ ఎం.జయకుమార్ వివరించారు. ఈసందర్భంగా పలువురు విద్యార్థినులు దేవతామూర్తుల అలంకరణ ధరించారు.

టీడీపీ నేత రవికి నివాళి

తాళ్లూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొర్రపాటివారిపాలెం గ్రామంలో టీడీపీలో కీలకంగా వ్యవహరిస్తూ అకాలమరణం చెందిన కొర్రపాటి రవి మృతదేహం వద్ద పలువురు నేతలు ఆదివారం నివాళులర్పించారు. రవి మృతదేహాన్ని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర నాటక అకాడమి కార్పొరేషన్ డైరెక్టర్ బి.ఓబుల్‌రెడ్డి, టీడీపీ నేతలు మానం రమేష్‌బాబు, గొల్లపూడి వేణుబాబు, షేక్ కాలేషావలి, శివనాగిరెడ్డి, లక్ష్మీనారాయణ, తిరుపతిస్వామి, విద్యాసాగర్, రామకోటిరెడ్డి, యల్లమందరావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సోమవరప్పాడు పరిధిలోని గుంటిగంగ సన్నిధిలోగల గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. గంగమ్మ తల్లిపై భక్తితో దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పెట్టి చల్లంగా కరుణించమని పూజించారు. తాళ్లూరు, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎన్.కామేశ్వరశర్మ భక్తులకు గోత్రనామ పూజలు చేశారు. పూజారులు ప్రకాశంతులు, విజయలక్ష్మి, బాలరాజు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, దేవదాయశాఖ ఈవో జి.వాసుబాబు, ఆర్‌ఏ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

శాప్ చైర్మన్‌ను కలిసిన డీఎస్సీకి ఎంపికైన క్రీడాకారులు



శాప్ చైర్మన్ రవినాయుడుతో డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు శివారెడ్డి, తదితరులు

ముండ్లమూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాప్ చైర్మన్ అనమనేని రవినాయుడును డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాలు సాధించిన అంతర్జాతీయ ఖోఖో క్రీడాకారుడు, మండలంలోని ఈదరకు చెందిన పోతిరెడ్డి శివారెడ్డితోపాటు మరికొందరు శనివారం విజయవాడలో కలిశారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్ రవినాయుడు క్రీడాకారుడు శివారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో పీడీ మేకల సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


క్రికెట్ బెట్టింగులకు బలవుతున్న యువత

దర్శి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగులతో యువత, విద్యార్థులు దారిమళ్లుతున్నారు. చెడు వ్యసనాలకు బానిసలై ఉజ్వల భవిష్యత్తును కొల్పోతున్నారు. అప్పులు తెచ్చి బెట్టింగులు పెడుతున్నారు. ఈక్రమంలో డబ్బులు కోల్పోయి కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా దర్శిలో బెట్టింగ్ కొనసాగుతోంది. గతంలో పోలీసు ఉన్నతాధికారులు జిల్లా వ్యాప్తంగా బెట్టింగులపై ఉక్కుపాదం మోపారు. అందులో భాగస్తులైనవారిపై కేసులు నమోదు చేశారు. దీంతో కొంతకాలం బెట్టింగుల ప్రభావం తగ్గింది. ఇటీవల కాలంలో మళ్లీ బెట్టింగులు అధికమయ్యాయి. తాజాగా ఆసియా కప్ క్రికెట్ టోర్నమెంట్స్ పోటీలు జరుగుతున్న నేపథ్యంలో జోరుగా క్రికెట్ బెట్టింగులు సాగుతున్నాయి. బహిరంగ ప్రదేశాలు, టీస్టాల్స్, హోటళ్లలో బెట్టింగ్ నిర్వాహకులు బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు సమాచారం.

కాగా, క్రికెట్ బెట్టింగ్‌లను నివారించేందుకు దర్శి పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. సీఐ వై.రామారావు ఆధ్వర్యంలో పోలీసులు అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు చేస్తున్నారు. యువత అధికంగా ఉండే ప్రాంతాలకు వెళ్లి క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడవద్దని సూచిస్తున్నారు. అనుమానితుల సెల్‌ఫోన్లు తనిఖీలు చేసి ఏమైనా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారా అని పరిశీలిస్తున్నారు. క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని యువతకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఎవరైనా బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నా, ఇందులో పాల్గొంటున్న వారి సమాచారం తెలిస్తే తమకు తెలపాలని సూచిస్తున్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

కనిగిరి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకరంగా విద్యుత్ తీగలు మారాయి. పట్టణంలో పలుచోట్ల దశాబ్దాలుగా పాత విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. ఇవి గృహాలకు దగ్గరగా ఉన్నాయి. దానికితోడు డిష్ కేబుల్ బండిల్స్ విద్యుత్ స్తంభాలకు చుట్టి ఉండటంతో తీగలు అల్లేసిన చెట్ల మాదిరిగా తయారయ్యాయి. పట్టణంలోని జవహర్‌లాల్‌వీధి, నీలకంఠం వారి వీధి, తీగెలగొంది, కరణం బజార్‌లలో చాలా చోట్ల ఇష్టానుసారంగా విద్యుత్ స్తంభాలు తీగలు చుట్టి ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్తంభాలకు అల్లేసినట్టుగా ఉన్న తీగలను మళ్లించటంతో పాటు నివాసాలకు ఆనుకుని ఉన్న స్తంభాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



జవహర్‌లాల్ వీధి మలుపు వద్ద విద్యుత్ స్తంభానికి చుట్టేసిన తీగలు

కనిగిరి అభివృద్ధికి సహకరించాలి

కనిగిరి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కనిగిరి అభివృద్ధికి సంపూర్ణ సహకారాన్ని అందించాలని కలెక్టర్ రాజాబాబును ఎంపీపీ దంతులూరి ప్రకాశం కోరారు. ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో ఆదివారం కలెక్టర్‌ను ఎంపీపీ మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. ఈసందర్భంగా కనిగిరిలో నెలకొన్న ప్రస్తావించినట్టు ఎంపీపీ పేర్కొన్నారు.



కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీపీ ప్రకాశం

అధ్వానంగా తలకొండపాడు - కనిగిరి రోడ్డు

పీసీపల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలకొండపాడు నుంచి కనిగిరి వెళ్లే రోడ్డు గుంతలు పడి అధ్వానంగా తయారైంది. తలకొండపాడు నుంచి విజయగోపాలపురం వరకు రోడ్డంతా పెద్దపెద్ద గుంతలు పడటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షం పడినప్పుడు రోడ్డంతా బురదమయమవడంతో ఆమార్గం గుండా ప్రయాణించాలంటే ప్రజలు హడలిపోతున్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతోపాటు వివిధ అవసరాల కోసం అడ్డరోడ్డు, కనిగిరి వెళ్లే ప్రజలు అవస్థలు పడుతున్నారు. గత కొన్నేళ్లుగా రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో దారుణంగా తయారైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని తలకొండపాడు, పెద్దన్నపల్లి, చిరుకూరివారిపల్లి, పాలేటిపల్లి, మర్రికుంటపల్లి తదితర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



గుంతలు పడి అధ్వానంగా ఉన్న తలకొండపాడు-కనిగిరి రోడ్డు






శ్రీ చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీబగళాముఖి అమ్మవారు

ఆలయాలకు ఉత్సవ శోభ

- దసరా నవరాత్రుళ్లకు విస్తృత ఏర్పాట్లు

బాపట్ల, పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆలయాలు దసరా ఉత్సవ శోభను సంతరించుకున్నాయి. నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానుండగా, అందుకు ఆలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలతో ఆలయాలను ముస్తాబు చేశారు. ఆలయాల వద్ద అమ్మవారి భారీ విద్యుత్ కటౌట్లు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. విద్యుత్ దీపాలతో ప్రత్యేక పందిళ్లను కూడా ఏర్పాటు చేశారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించనున్నారు. అమ్మవారి ప్రత్యేక అలంకారాలను నిత్యం భక్తులు దర్శించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. పిట్టలవానిపాలెం మండలం చందోలులో వేంచేసియున్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో సోమవారం నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు శ్రీ దేవిశరన్నవరాత్రుల మహోత్సవాలను అత్యంత వైభోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం అమ్మవారికి విశేష అలంకరణలు, నీరాజన మంత్ర పుష్పాలతో పూజలు జరుగుతాయన్నారు. చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని శ్రీగంగాంబికాసమేత ఆనందీశ్వరస్వామి వారి దేవస్థానంలో 49వ శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతాయని ఆలయ శాశ్వత ధర్మకర్త పొన్నపల్లి సత్యనారాయణ తెలిపారు.

సూర్యఘర్ జాప్యం



ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్

విద్యుత్ బిల్లుల భారం నుంచి ఉపశమనం కలుగుతున్నా.. ప్రభుత్వం సబ్సిడీ ఇస్తున్నా.. సూర్యఘర్ పథకంపై వినియోగదారుల్లో ఆసక్తి కానరావడంలేదు. సూర్యఘర్ పథకాన్ని విస్తృతంగా అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సూచిస్తున్నాయి. అయితే వినియోగదారులకు అవగాహన కల్పించి, సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. సూర్యఘర్ పథకం గురించి ప్రత్యేకంగా తెలుసుకుని, దరఖాస్తు చేసుకున్న వినియోగదారులను సైతం నిరుత్సాహ పరిచేలా అధికారుల తీరు ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఇప్పటికే వచ్చిన దరఖాస్తుల పరిశీలన.. ఆమోదం.. సోలార్ యూనిట్ల ఏర్పాటులో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటుంది. దీంతో మిగిలిన వారు కూడా సూర్యఘర్ పథకం ఏర్పాటుకు ముందుకు రావడంలేదు. మొత్తంమీద అధికారుల తీరు సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేలా ఉండకపోగా, ఆసక్తితో ముందుకు వచ్చే వారిని సైతం నిరుత్సాహపరిచేలా ఉన్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- పథకంపై అధికారుల నిర్లక్ష్యం
- ఆసక్తి చూపని వినియోగదారులు
- రాయితీ ఇస్తున్నా ప్రజల్లో కానరాని స్పందన
- 1,16,174 దరఖాస్తులకు 5,909 యూనిట్ల ఏర్పాటు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

విద్యుత్ తయారీలో వాడే బొగ్గు వినియోగాన్ని తగ్గించడం ద్వారా కాలుష్యాన్ని అదుపు చేయవచ్చని.. వినియోగదారులకు బిల్లుల భారం తగ్గేలా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సూర్యఘర్ యోజనను అమలు చేస్తున్నాయి. ఈ పథకం కింద సోలార్ యూనిట్లకు కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున రాయితీ ప్రకటించింది. ఈ పథకాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. సూర్యఘర్ పథకంతో విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించుకోవచ్చని ప్రచారం చేస్తోంది. సూర్యఘర్ యోజన లక్ష్యాలు ఘనంగా ఉన్నా అమలు శూన్యంగా ఉంది. సోలార్ యూనిట్లను ఇళ్లపై ఏర్పాటు చేసుకునే దిశగా వినియోగదారులను చైతన్య పరచడానికి అధికారులు తీసుకుంటున్న చర్యలు శూన్యంగా కనిపిస్తున్నాయి. విద్యుత్ సిబ్బంది వినియోగదారులను కలిసి మొబైల్‌లో పేరు నమోదు చేసి ఓటీపీ ఎంటర్ చేసి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో సూర్యఘర్‌పై ప్రజల నుంచి (మిగతా 6లో)

- పల్నాడు జిల్లాలో సూర్యఘర్‌కు 83,612 దరఖాస్తులు రాగా 83,518 దరఖాస్తులను విద్యుత్ శాఖ ఆమోదించింది. వీటి సామర్థ్యం 2,06,048 కిలోవాట్లుగా అంచనా వేసింది. 13,855 యూనిట్ల ఏర్పాటుకు ఏజన్సీలకు అనుమతి ఇవ్వగా ఇప్పటి వరకు 915 మాత్రమే ఏర్పాటు చేశారు.
- బాపట్ల జిల్లాలో 20,651 దరఖాస్తులకు 20,612 ఆమోదించారు. వీటి సామర్థ్యం 60,371 కిలోవాట్లుగా అంచనా వేశారు. ఏజన్సీలకు 6,719 యూనిట్ల ఏర్పాటుకు అనుమతి ఇవ్వగా ఇప్పటివరకు 2,248 మాత్రమే ఏర్పాటు చేశారు.
- గుంటూరు జిల్లాలో 12,044 దరఖాస్తులను ఆమోదించగా వీటి సామర్థ్యం 37,113 కిలోవాట్లుగా నిర్ధారించారు. యూనిట్ల అమర్చేందుకు 5,519 అనుమతి ఇవ్వగా ఇప్పటికి 2,786 మాత్రమే ఏర్పాటు చేశారు.

సూర్యఘర్‌తో లబ్ధి..

ఉదాహరణకు వినియోగదారుడు 120 యూనిట్ల విద్యుత్ వాడితే సుమారు రూ.1,000 బిల్లు వస్తుంది. అదే సూర్యఘర్ యూనిట్ ఏర్పాటు చేసుకుంటే రూ.338 మాత్రమే బిల్లు వస్తుంది. ఈ ప్రకారం ఏడాదికి రూ.8 వేలు వరకు ఆదా అవుతుంది.వంద చదరపు అడుగుల స్థలంలో 120 యూనిట్లు ఉత్పత్తి చేసే కిలోవాట్ సామర్థ్యం ఉన్న సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చు. ఇందుకు రూ.60 వేలు ఖర్చయితే 50 శాతాన్ని ప్రభుత్వం రాయితీగా ఇస్తోంది. మిగిలిన మొత్తం బ్యాంకుల నుంచి రుణంగా పొందొచ్చు. వినియోగం పోను మిగులు విద్యుత్ ద్వారా ఆదాయం పొందే అవకాశం కూడా వినియోగదారుడికి ప్రభుత్వం కల్పించింది.



6

సహజసిద్ధ అందాల నెలవంక.. సూర్యలంక!

- బీచ్ ఫెస్టివల్‌కు ముస్తాబవుతున్న తీరం
- మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే..పర్యాటకం పరుగులు

రేషన్‌కూ.. ఏటీఎంలు

- పౌరసరఫరాల శాఖ కసరత్తు
- వేలిముద్ర ప్రామాణీకరణతో పంపిణీ

చీరాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకుల పంపిణీలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు పౌరసరఫరాల శాఖ కసరత్తు చేస్తున్నది. దేశంలోనే ప్రప్రథమంగా ఒడిస్సా రాష్ట్రంలో ప్రారంభించిన రేషన్ ఏటీఎం యంత్రాల ద్వారా సరుకుల పంపిణీని చేపట్టేందుకు అడుగులు వేస్తోన్నది. పైలట్ ప్రాజెక్టుగా త్వరలో జిల్లాలోని కొన్ని రేషన్ దుకాణాల్లో ఏర్పాటు చేసి వాటి పనితీరు ఆధారంగా విస్తరించాలని భావిస్తోన్నది. ఈ రేషన్ ఏటీఎం నుంచి సరుకులు తీసుకోవాలంటే ఖచ్చితంగా కార్డులోని కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరు యంత్రం వద్దకు వెళ్లి వివరాలు నమోదు చేసి వేలిముద్రని ప్రామాణీకరణ చేయాల్సి ఉంటుంది. అప్పుడే యంత్రం నుంచి సరుకులు విడుదల అవుతాయి. అయితే ఇందుకోసం కాస్తంత విశాలమైన రేషన్ దుకా ణం ఉండాలి. అలానే బ్రాడ్‌బ్యాండ్ సదుపా యం వంటివి కలిగి ఉండాలి. డీలర్ ఆ యంత్రంలో సరుకులు అయిపోతూనే ఫిల్లింగ్ చేయాల్సి ఉంటుం ది. 25 అడుగుల పొడవు, 35 అడుగుల వెడల్పు ఉన్న రేషన్ దుకాణా లు అయితే ఈ యంత్రాల ఏర్పాటుకు సరిపోతాయి. పైలట్ ప్రాజెక్టుగా కొన్ని యంత్రాలు సమకూర్చుకుని ఎంపిక చేసిన షాపులలో ఏర్పాటు చేసి వాటి పనితీరుని పరీక్షించా లని ఆ శాఖ భావిస్తున్నది. ఇవి 24 గం టలు అందుబాటులో ఉండటం వల్ల కార్డు దారులు ఏ సమయంలోనైనా వెళ్లి సరుకులు తీసుకునే వెసులుబాటు ఉంటుంది.

అక్రమాలకు చెక్ చెప్పేలా..

ప్రస్తుతం రేషన్ పంపిణీ నెలలో కొన్ని రోజుల పాటు మాత్రమే జరుగుతున్నది. అది కూడా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు, తిరిగి సాయంత్రం నాలుగు నుంచి రాత్రి 8 గంటల వరకు సరుకులను డీలర్లు పంపిణీ చేస్తున్నారు. కొన్ని షాపుల్లో స్టాకు త్వరితగతిన అయిపోతుండటంతో నోస్టాక్ బోర్డులు పెడుతున్నారు. దాంతో వేరే దుకాణానికి వెళితే మీ కార్డు ఇక్కడ కాదు అని తిప్పి పంపేస్తున్నారు. కొందరైతే ఈ-పోస్ యంత్రాలను కార్డుదారుల ఇళ్ల వద్దకే తీసుకెళ్లి వేలిముద్రలను ప్రామాణీకరణ చేసి సరుకుల బదులు నగదు చేతిలో పెట్టి వాటిని బ్లాక్ మార్కెటింగ్‌కు తరలిస్తున్నారు. రేషన్ ఏటీఎంల ద్వారా కొంతమేరకు అక్రమాలకు చెక్ పెట్టొచ్చని పౌరసరఫరాల శాఖ భావిస్తున్నది.



రేషన్ ఏటీఎం

ఎయిర్‌బెలూన్లు తెరుచుకున్నా..

తిరుపతికి చెందిన ముగ్గురు మృతి

కుక్కను తప్పించే యత్నంలో అదుపుతప్పిన కారు

కుమార్తె పిండ ప్రదానానికి పిఠాపురం వెళ్తుండగా ఘటన

మార్టూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏటా కుమార్తెకు తిరుపతిలోనే కపిలేశ్వరం వద్ద శాంతి కార్యక్రమాలు చేస్తుంటారు. అయితే ఈ ఏడాది మహాలయ అమావాస్యను పురస్కరించుకుని కాకినాడ జిల్లా పిఠాపురంలోని కోటిలింగాల క్షేత్రంలో కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. దీంతో ఆదివారం కారులో బయల్దేరిన వారి పాలిట ఓ కుక్క రూపంలో మృత్యువు ముంచుకు వచ్చింది. కారులో ఎయిర్‌బెలూన్లు తెరుచుకున్నా వారి ప్రాణాలను కాపాడలేదు. మార్టూరు మండలం, కోలలపూడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా ఇద్దరు దంపతులు గాయప డ్డారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. తిరుపతికి చెందిన దామర్ల లక్ష్మయ్య(75) కుమార్తె గీత 15 ఏళ్ల క్రితం మృతి చెందారు. ఏటా ఆమెను స్మరించుకుంటూ తిరుపతిలోనే కపిలేశ్వరం వద్ద శాంతి కార్యక్రమాలు నిర్వహించేవారు. అయితే ఈ ఏడాది పిఠాపు రంలోని కోటిలింగాల క్షేత్రంలో శాంతి కార్యక్రమం నిర్వహిం చేందు కు భార్య వెంకటసుబ్బమ్మ(65), మనుమడు హేమంత్(25)తో పాటు కుమారుడు గణేష్, పద్మజ కారులో పిఠాపురం వెళ్తున్నారు. ఈ క్రమంలో మార్టూరు మండలం కోలలపూడి వద్ద ఓ కుక్క అడ్డం రావడంతో కారు అదుపుతప్పి దూసుకువెళ్లి జాతీయ రహదారి అంచులో ఉన్న సిమెంట్ దిమ్మెను ఢీకొట్టింది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న హేమంత్‌తో పాటు లక్ష్మయ్య, వెంకటసుబ్బమ్మలు మృతి చెందారు. కారులో ఎయిర్ బెలూన్లు తెరుచుకున్నా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. గణేష్, పద్మజలకు గాయాలయ్యాయి. ప్ర మాదం విషయం తెలియగానే మృతుల బంధువులు చీరాల, వేటపాలెం, వినుకొండల నుంచి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలివచ్చారు.పోస్టు మార్టం అనంతరం మృతదేహాలను తిరుపతికి తరలించారు.



కారులో లక్ష్మయ్య,వెంకటసుబ్బమ్మ మృతదేహాలు



ప్రాణాలతో బయటపడిన దామర్ల గణేష్‌బాబు, పద్మజ దంపతులు

భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- అధికారులకు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ సూచన

బాపట్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణశాఖ హెచ్చరికలతో జిల్లాలోని అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్‌రూమ్‌లు, టీవీ ఏర్పాటు చేయాలన్నారు. భారీ వర్షాలకు ఆస్తి, ప్రాణనష్టం కలగకుండా చూడాలన్నారు. ప్రజలు వాగులు, వంకలు, చెరువులు, కెనల్ వద్దకు వెళ్లకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఎలాంటి నష్టం లేకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా అధికారులంతా జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉండాలన్నారు. కిందిస్థాయి సిబ్బంది ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నియోజకవర్గాలు, మండల ప్రత్యేకాధికారులు తమ పరిధిలోని అన్నిశాఖల అధికారుల నుంచి వర్షాలు, వరదల పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. రోడ్లకు సంబంధించి ఎక్కడైనా నష్టం వాటిల్లితే వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి విధులకు సిబ్బందిని నియమించాలని ఆర్డీవోను ఆదేశించారు. అంటువ్యాధులు వ్యాపించకుండా పారిశుధ్యంపై చర్యలు తీసుకోవాలని డీపీవోకు సూచించారు. ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో మందులతో పాటు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. అవసరమైన అన్ని ప్రాంతాలకు తాగునీటిని సరఫరా చేయాలన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా బీచ్ ఫెస్టివల్

- ఏర్పాట్ల పరిశీలనలో కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

బాపట్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సూర్యలంక సముద్రతీరంలో మూడు రోజులు జరిగే బీచ్ ఫెస్టివల్ వేడుకలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, అధికారులతో కలిసి తీరంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం కలెక్టర్ పరిశీలించారు. ఆ తర్వాత కలెక్టరేట్‌లో టూరిజం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీచ్ ఫెస్టివల్ ప్రచార ప్రణాళికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బీచ్‌ఫెస్టివల్‌కు సంబంధించి విజయవాడ, విశాఖ, తిరుపతి, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలన్నారు. హరితా బీచ్ రిసార్ట్స్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలన్నారు.

- బీచ్‌ఫెస్టివల్ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. ఫెస్టివల్ నిర్వాహణకు విధులు కేటాయించిన అధికారులతో కలిసి ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో డ్వామా పీడీ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డీపీవో ప్రభాకరరావు, డీఆర్‌డీఏ పీడీ లవన్న, ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్‌నాయుడు, డీఎస్పీ జి.రామాంజనేయులు, పర్యాటకశాఖాధికారి నాగిరెడ్డి, టూరిజం అథారిటీ సీఎంసీవో పద్మారాణి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎస్‌ఈ ఈశ్వరయ్య, రవాణాశాఖాధికారి పరంధామరెడ్డి, తహసీల్దార్ షేక్.సలీమా, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబిరెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.



బీచ్‌ఫెస్టివల్ ఏర్పాట్లను పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే వేగేశన

భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ సమీక్ష

బీచ్ ఫెస్టివల్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 27న విచ్చేయుచున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదివారం సమీక్షించారు. తీరంలో సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్, స్టాల్స్, ఎగ్జిబిషన్ స్థలాలను పరిశీలించి పోలీసులకు పలు సూచనలు చేశారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ పార్కింగ్ ప్రదేశాలను కూడా సిద్ధంగా ఉంచాలని ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు జి.నారాయణ, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సూర్యలంకరోడ్డులో రూట్‌మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్, సిబ్బంది

కృష్ణమ్మ చెంతన కిటకిట


పిండ ప్రదానాలకు పోటెత్తిన జనం

అమరావతిలో మహాలయ అమావాస్య సందడి

అమరావతి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆదివారం మహాలయ అమావాస్య. ఈ రోజున పితృ దేవతలకు పిండప్రదానం చేస్తే వారికి ముక్తి కలిగి ఆత్మశాంతిస్తుం దని ప్రజల నమ్మకం. పోటెత్తిన జనంతో కృష్ణానదీ తీరం కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా జనం అమరావతి చేరుకుని అమరేశ్వరస్వామి ఆలయ సన్నిధి లోని కృష్ణానది పుష్కరఘాట్ వద్ద పితృదేవతలకు పిండ ప్రదానం చేశారు. ఘాట్‌లో మెట్లు సగానికిపైగా నీటిలో మునిగి ఉండటంతో పిండ ప్రదానాలకు స్థలం చాలక నదీతీరం కిక్కిరిసిపోయింది.



పిండ ప్రదానాల జనంతో కిక్కిరిసిన పుష్కరఘాట్



ఇంద్రకీలాద్రికి దసరా శోభ

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

- ఈఏడాది 20 లక్షలమంది భక్తులు వస్తారని అంచనా
- 29న దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి స్నపనాది క్రతువు నిర్వహిస్తారు. తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిస్తారు. ఉదయం 8-8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది దేశం నలుమూలల నుంచి ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల కోసం స్లాట్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల వరకు కల్పిస్తారు. ఈ ఏడాది భక్తుల కోసం 20 లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా ఇంద్రకీలాద్రి విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా వెలుగుతోంది. 29వ తేదీ మూలానక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపులు

శరన్నవరాత్రులు ముగిసే వరకు అమలు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై సోమవారం నుంచి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల కారణంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

- హైదరాబాద్-విజయవాడ-హైదరాబాద్-విశాఖపట్నం మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగి హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి వాహనాలు చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి నల్లకుంట వద్ద దిగి హైదరాబాద్ మార్గంలోకి వెళ్లాలి.
- హైదరాబాద్ - మచిలీపట్నం-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగాలి. కేసరపల్లి మీదుగా మచిలీపట్నం చేరుకోవాలి. ఇటు నుంచి వెళ్లే వాహనాలు కేసరపల్లి వద్ద నుంచి చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కాలి.
- హైదరాబాద్-చెన్నై-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా గుంటూరు చేరుకుని అక్కడి నుంచి చెన్నై వెళ్లాలి. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.
- చెన్నై-విశాఖపట్నం-చెన్నై మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఒంగోలు, త్రోవగుంట, చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ బైపాస్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి చెన్నై వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.

నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, కంకణపూజ, కంకణధారణ తదితర పూజలు నిర్వహించనున్నారు. భ్రమరాంబికాదేవి అమ్మవారు సోమవారం శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ నిర్వహించనున్నారు.

ఉత్తరాంధ్రకు వాయు‘గండం’

- పిడుగులతో భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక
- బెజవాడలో 13 సెంటీమీటర్ల వర్షం.. నేడు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్రకు వాయుగుండం పొంచి ఉంది. ఈ నెల 26న వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం 27న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు ఎక్కువగా ఉంటుందని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోమవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీంతో సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్రలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 25న తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. మూడు రోజుల వ్యవధిలో ఏర్పడనున్న రెండు అల్పపీడనాల ప్రభావంతో ఈనెల 24 నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు, కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. విజయవాడ సింగ్‌నగర్‌లో 13, చిత్తూరు జిల్లాలోని కాగితలో 8.3, ఏలూరు జిల్లా కాకర్లమూడిలో 8, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 6.9, చిత్తూరులోని యాదమర్రిలో 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, ఒకట్రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని నిపుణుడొకరు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణ చేసిన అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను జ్ఞాపికగా అందజేశారు.

నేటి నుంచి విశాఖలో 28వ జాతీయ ఈ గవర్నెన్స్ కాన్ఫరెన్స్

- ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుంది
- కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి

విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌ను ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి వి.శ్రీనివాస్ వెల్లడించారు. విశాఖలో ఆదివారం మాట్లాడుతూ.. వికసిత్ భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో సదస్సు ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తారన్నారు. ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుందని, ప్రస్తుతం 738 రకాలు సేవలు అందిస్తున్నారని, దీనిని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా అభివర్ణించారు. విశాఖ డిక్లరేషన్‌లో దీనిని భాగం చేసి దేశమంతా అమలు చేసేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారన్నారు. అత్యుత్తమ కార్యక్రమాలు నిర్వహించిన వారికి ఈ గవర్నెన్స్- 2025 అవార్డులు అందిస్తామన్నారు.

కూటమి నేతలపై అనుచిత పోస్టులు

- వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు



వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో అంజాద్ ఖాన్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. కదిరి పట్టణానికి చెంది న కౌలేపల్లి అంజాద్‌ఖాన్ అలియాస్ మెగా అంజాద్ వైసీపీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తుండేవాడు. రెండ్రోజుల క్రితం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు.

27లోపు డిమాండ్లు పరిష్కరించాలి

- లేదంటే పెన్షన్ పంపిణీని నిలిపేస్తాం
- ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ

పెనమలూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27 లోపు తమ డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్చలకు పిలవని పక్షంలో అక్టోబరు 1 నుంచి పెన్షన్ పంపిణీని నిలుపుదల చేసేందుకు వెనుకాడబోమని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ హెచ్చరించింది. పోరంకిలో ఆదివారం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బగ్గా జగదీష్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కలెక్టర్లకు, ఇతర అధికారులకు జేఏసీ తరఫున నోటీసులు అందజేస్తామన్నా రు. 26, 27 తేదీల్లో ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న అఫిషియల్ వాట్సాప్ గ్రూపుల నుంచి ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా వైదొలుగుతారన్నారు. 28న రాయలసీమ వేదికగా కర్నూలు జిల్లాలో ప్రాంతీయ సమావేశం ఏర్పాటుచేసి తదుపరి కార్యాచరణను విడుదల చేస్తామని తెలిపారు.

తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలకు రేపు అంకురార్పణ

- ఎల్లుండి ధ్వజారోహణంతో ఉత్సవాలు ఆరంభం

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలను ప్రారంభించడానికి మంగళవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలో సేనాధిపతిని అలంకరించి విశేష సమర్పణ గావిస్తారు. అనంతరం తిరుచ్చిపై ఆశీనులు చేస్తారు. రాత్రి ఏడు గంటలకు ఆలయం నుంచి బయల్దేరి నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత ఆలయానికి చేరుకున్న అనంతరం రంగనాయకమండపంలో ఆస్థానం జరుగుతుంది. యాగశాలలో అర్చకస్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ(బీజవాపం) కార్యక్రమం నిర్వహిస్తారు. 24వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయి.

తప్పుడు వార్తలను నమ్మకండి

- కపిలతీర్థంలో ఎలాంటి తొక్కిసలాట జరగలేదు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొక్కిసలాట జరిగిందని, కపిలతీర్థంలో ఏర్పాట్లు చేయలేదని సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు వార్తలను భక్తులు నమ్మవద్దంటూ టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. 'మహాలయ అమావాస్య సందర్భంగా తిరుపతి కపిలతీర్థం ఆలయం బయట ప్రైవేట్ వ్యక్తులు పితృతర్పణాల కార్యక్రమం చేసుకోవడం ఆనవాయితీ. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌ను టీటీడీ ఏర్పాట్లు చేసింది. రద్దీ నేపథ్యంలో భద్రతాపరంగా పటిష్ఠ చర్యలు తీసుకున్నాం. ఎస్పీ వాహనం, పోలీస్ వాహనం రావడంతో తొక్కిసలాట జరిగినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తిరుమలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా ఇక్కడ తొక్కిసలాట అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కొంతమంది టీటీడీని లక్ష్యం చేసుకుని దుష్ప్రచారం చేయడం సరికాదు. టీటీడీ ప్రతిష్ఠను పలుచన చేయడాలని చూడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. ఇలాంటి వార్తలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అంటూ టీటీడీ తన సోషల్ మీడియా ద్వారా పేర్కొంది.

విజ్ఞాన్ వర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు విద్య, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్ మాట్లాడుతూ ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశ్వనాథన్ ఆనంద్, హరికృష్ణ, హంపి, హరిదాసన్, ప్రగ్యానంద లాంటి ప్రతిభావంతులు దేశానికి ఎనలేని కీర్తి తెచ్చారని అశోక్ కొనియాడారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మొదటగా ఒక ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ లాల్‌తమునా, చీఫ్ ఆర్బిటర్ అనంత రామన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.సురేష్, చీఫ్ అడ్వయిజర్ కేవీవీ శర్మ, సెక్రటరీ కే.జగదీష్, గుంటూరు చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రవీంద్ర రాజు, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సూర్యలంక సముద్రతీరంలో స్నానాలు ఆచరిస్తున్న పర్యాటకులు, భక్తులు



సహజసిద్ధ అందాల నెలవంక సూర్యలంక

- బీచ్ ఫెస్టివల్‌కు ముస్తాబవుతున్న తీరం
- మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే..పర్యాటకం పరుగులు
- బీచ్ క్రీడలు, వినోదాన్ని విస్తరిస్తే..ఆంధ్ర గోవానే..
- పర్యాటక అభివృద్ధికి ఎన్నో వసతులిచ్చిన ప్రకృతి..

బాపట్ల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎగసి పడే సముద్రపు అలల ఘోషను వింటూ.. ఇసుక తిన్నెలపై గెంతులేయడానికి వయస్సుతో సంబంధం లేకుండా అందరూ ఇష్టపడుతారు. స్వచ్ఛమైన సముద్రపు గాలిని శ్వాసిస్తూ.. తీరం వెంబడి షికారు కొట్టే అనుభవం ఎంతో మధురమైంది. ఆరోగ్య దృష్ట్యా ఎంతో ప్రాధాన్యం ఉంది. దీంతో తీరం అందాలను ఆస్వాదిం చేందుకు.. ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపుతారు. ఆధునిక యుగంలో బీచ్ టూరిజం దినదినాభివృద్ధి చెందుతోంది. మహా నగరాల్లో వాయు, శబ్ద కాలుష్యానికి దూరంగా విశ్రాంతి సమయాన్ని సముద్ర తీరాన గడపాలనే ఉబలాటం ప్రజల్లో పెరిగింది.

రాష్ట్రంలో బీచ్ టూరిజం

రాష్ట్రవ్యాప్తంగా 12 ప్రాంతాల్లో బీచ్ టూరిజం అభివృద్ధి చెందుతోంది. బారువ, కళింగపట్నం, భీమునిపట్నం, రుషికొండ, విశాఖ, గంగవరం, అల్లవరం, మంగినపూడి, సూర్యలంక, ఓడరేవు, కొత్తపట్నం, మైపాడు వంటి ప్రాంతాలు బీచ్ టూరిజానికి ప్ర





ఇసుక తెన్నుల్లో పర్యాటకుల సందడి



అందాల లంక..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రసిద్ధి చెందిన పర్యాటక కేంద్రం సూర్యలంక బీచ్. ఇది గుంటూరు జిల్లా కేంద్రానికి 48 కిలోమీటర్లు.. బాపట్ల జిల్లా కేంద్రం, పట్టణం నుంచి 8కిలోమీటర్ల దూరంలో ఉంది. బాపట్ల వరకు రైలు సదుపాయం ఉంది. వంద కిలోమీటర్ల దూరంలో గన్నవరం విమానాశ్రయం అందుబాటులో ఉంది. సూర్యలంక తీరంలో బంగాళాఖాతం అర్ధ చంద్రాకారంలో ఆకర్షిస్తుంది. ఇక్కడి పరిసరాలు పర్యాటకులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని, కలుగజేస్తాయి. పర్యాటకులు సముద్రస్నానానికి ఇష్టపడుతారు. సూర్యలంక తీర ప్రాంతం విశాలంగా, అందంగా, పరిశుభ్రంగా ఉంటుంది.

పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సౌకర్యాలు

ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ సందర్శకుల సౌకర్యం కోసం హరితా బీచ్ రిసార్ట్స్‌ను ఏర్పాటు చేసింది. ఇక్కడ 30కాటేజీలు ఉన్నాయి. ఈ కాటేజీలో ఉన్నవారికి రాత్రిపూట సముద్రపు అలల హోరు, మేను తాకే చల్లని గాలి.. వింత అనుభూతినిస్తాయి. ఇక్కడ సందర్శకులకు రెస్టారెంట్ సౌకర్యాన్ని కూడా కల్పించారు. అల్పాహారం, శాఖాహారం, మాంసాహారం ఈ రెస్టారెంట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పర్యాటకుల కోసం జిమ్, మసాజ్ సెంటర్‌లు ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తోంది.

బీచ్ క్రీడలకు అనుకూలం

బీచ్ వాలీబాల్ లాంటి క్రీడలకు సూర్యలంక సముద్ర తీరం అనువుగా ఉంటుంది. సముద్రంలో చేపలు పట్టేందుకు మత్స్యకారులు పడవలపై వెళ్లడం, రావడం వంటి దృశ్యాలు కంటికి ఎంతో విందుగా ఉంటాయి. సూర్యలంకలో సూర్యోదయం దృశ్యం పర్యాటకులకు మరువలేని అనుభూతినిస్తుంది. శని, ఆదివారాలలో బీచ్ రిసార్ట్స్ పర్యాటకులతో సందడిగా ఉంటుంది. వాటర్ స్కూటరింగ్, సర్ఫింగ్‌కు ఇక్కడ సౌకర్యాలు కల్పిస్తే.. సూర్యలంక బీచ్ ఎక్కువ సంఖ్యలో సందర్శకులను ఆకర్షించగలదు. తాగునీరు, విద్యుత్, మురుగునీటి పారుదల, పరిశుభ్రత వంటి మౌలిక సదుపాయాలతో పాటు.. టెలిఫోన్ వంటి కమ్యూనికేషన్ సౌకర్యాలు సూర్యలంకలో అందుబాటులో ఉన్నాయి. ఇండోర్‌గేమ్స్, ఎంటర్‌టైన్‌మెంట్, బార్, యోగా, ఆయుర్వేదిక్ నేచరోపతి సూర్యలంకలో ఏర్పాటు చేయగలిగితే ఆంధ్రా గోవా కావడంలో ఎటువంటి సందేహం లేదు.

బీచ్ ఫెస్టివల్‌కు ముస్తాబు

ఇంతటి ప్రాముఖ్యత కలిగిన సూర్యలంక సముద్రతీరంలో ప్రపంచపర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 26, 27, 28 తేదీల్లో బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ పర్యవేక్షణలో అధికారులు, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సారథ్యంలో కూటమి శ్రేణులు ఏర్పాట్లను నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

మహిళా సాధికారత చేతల్లో చూపాలి



మాట్లాడుతున్న శ్రీనివాసులు

పొదిలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారత మాటల్లోకాదు చేతుల్లో చూపాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు చెప్పారు. ఆదివారం సాయిబాలాజీ కల్యాణమండపంలో జరిగిన జిల్లా మహిళా ఉపాధ్యాయ చైతన్య సదస్సు జిల్లా అధ్యక్షురాలు ఉమామహేశ్వరి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారతపై నాటి నుంచి నేటి వరకు పాలకులు ఇచ్చిన హామీలు నెరవేరడం లేదన్నారు. ఉపాధ్యాయులు, యూటీఎఫ్ కార్యకర్తలు పాఠశాలలకు వెళ్లినప్పుడు కుల, మత భేదం లేకుండా మంచి బోధన అందించాలని కోరారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం 11వ పీఆర్సీ, డీఏ బకాయిలు, సరెండర్ లీవ్‌లు, ఏపీజీఎల్ఐ, జడ్పీపీఎఫ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు గ్రాట్యుటీ బకాయిల విడుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా చిన్నబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్‌హై, ప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, గౌరవ అధ్యక్షుడు రవి, రామిరెడ్డి, చిన్నస్వామి, జిల్లా కార్యదర్శి బాలవెంకటేశ్వర్లు, బుజ్జిబాబు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రైవేటు డిగ్రీ కళాశాలలు మూసివేత

ఒంగోలు విద్య, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయనందుకు నిరసనగా సోమవారం నుంచి ప్రైవేటు డిగ్రీ కళాశాలలను మూసివేయాలని కళాశాలల యాజమాన్యాలు నిర్ణయించాయి. ఈ మేరకు ఏపీ ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాల సంఘం ఉన్నత విద్యామండలి చైర్మన్ మధుమూర్తికి, ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డీవీఆర్ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబులకు వినతిపత్రాలను అందజేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకపోతే కళాశాలలను నిరవధికంగా మూసివేస్తామని అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కే గుండారెడ్డి, రాష్ట్రప్రధాన కార్యదర్శి పి.పెద్దిరాజు, జిల్లా అధ్యక్షుడు రాంబాబులు తెలిపారు. ఏకేయూ పరిధిలోని 88 ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు గత 15నెలలుగా ఫీజురీయింబర్స్‌మెంట్ సుమారు రూ.100 కోట్ల బకాయి ఉంది. వీటి పరిధిలోని కళాశాలల్లో సుమారు 27వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకపోవడంతో అధ్యాపకులకు జీతాలు కళాశాలల నిర్వహణ భారంగా మారిందన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు ఆంజనేయులు మృతి

నాగులుప్పలపాడు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గోగినేని ఆంజనేయులు(80) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు.తెలుగుదేశంపార్టీ ఆవిర్భావం నుంచి ఆంజనేయులు పార్టీ పట్ల అంకిత భావంతో పనిచేశారు. గ్రామ పార్టీ అధ్యక్షుడిగా, సొసైటీ చైర్మన్‌గా,మండల పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.ఆయన మృతి పట్ల వివిధ గ్రామాల టీడీపీ నాయకులు తమ సంతాపం వ్యక్తం చేశారు. నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయామని గ్రామ పార్టీ అధ్యక్షుడు కనగాల శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు.

సూర్యఘర్.. జాప్యం

(5వ పేజీ తరువాయి)

ఆశించిన స్థాయిలో ఆదరణ కానరావడంలేదు. ఇప్పటి వరకు పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో సూర్యఘర్ పథకానికి సంబంధించి 1,16,174 దరఖాస్తులను విద్యుత్ అధికారులు ఆమోదించారు. ఇందులో ఇప్పటి వరకు మూడు జిల్లాల్లో కలిపి 5,909 యూనిట్లు మాత్రమే ఏర్పాటు చేశారంటే అధికారుల నిర్లక్ష్యం ఏవిధంగా ఉందో తెలుసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితం, డ్వాక్రా సంఘ సభ్యులకు ప్రాధాన్యం ఇచ్చినా ఫలితం అంతంత మాత్రంగానే ఉంది. డాబా ఇళ్లు లేకపోయినా.. ఖాళీ స్థలాల్లోనూ సోలారు ప్యానల్స్ ఏర్పాటు చేసుకోండని కోరుతున్నా వినియోగదారులు ముందుకు రావడంలేదు.

ప్రభుత్వ కార్యాలయాల్లోనూ అంతంతే..

ప్రభుత్వ కార్యాలయాల్లోనూ సోలార్ ప్యానల్స్ ఏర్పాటుపై ఇప్పటికే సర్వే నిర్వహించారు. అయితే సౌరశక్తి యూనిట్ల ఏర్పాటు నామమాత్రంగా కూడా లేదు. ఆయా కార్యాలయాల్లో సోలార్ యూనిట్లు ఏర్పాటులో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలున్నాయి.

అవీ..ఇవీ..

శింగరకొండలో దశ సహస్ర కదళీఫలార్చన

అద్దంకి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అమవాస్య సందర్భంగా ఆదివారం పది వేల అరటిపండ్లతో దశసహస్ర కదళీఫలార్చన నిర్వహించారు. ఉదయం నిత్యపూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేదపండితులు హరి శంకరావధాని, ప్రధాన పూజారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పూజ నిర్వహించి, అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.



అరటి పండ్లతో అలంకరణతో ప్రసన్నాంజనేయస్వామి

పర్యావరణ పరిరక్షణకు వాకర్స్ కృషి

● వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శివరామప్రసాద్



ప్రశంసాపత్రాలు అందిస్తున్న గవర్నర్ శివరామప్రసాద్

చీరాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు వాకర్స్ విశేషంగా కృషి చేయాలని వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 203 గవర్నర్ పెద్ది శివరామప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం అసోసియేషన్ సేవా కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అలాగే నెలవారీ రిపోర్టులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్లాస్టిక్ రహిత చీరాలగా సభ్యులు కృషి చేయాలని కోరారు. అలాగే సంస్థకు శ్రీనివాసరావు, ఇస్సర్ల స్మృతి చెరో రూ.10 వేలు ఫండ్ అందజేశారు. వారికి అధికారులు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ప్రెసిడెంట్ సీతారామయ్య, 2026 డిస్ట్రిక్ట్ గవర్నర్ బలరామయ్య, మురళీ మోహన్‌రావు, శ్రీమన్నారాయణ, రమణయ్య, పోలుదాసు రామకృష్ణ, గురు ప్రసాద్, డా.బాబురవు, సుభాషిణీ, వలివేటి మురళీకృష్ణ, రమేష్, నిత్యానంద లాల్ వాకింగ్ సభ్యులు పాల్గొన్నారు.

నాగులచెరువు శుభ్రం

ఇంకొల్లు, సెప్టెంబరు 21, (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు నాగులచెరువులోని నీరు ఇటీవల కలుషితమై చేపలు మృతి చెంది దుర్వాసన వస్తోంది. దీంతో పంచాయతీ అధికారులు పటిక చల్లి కొంతమేరకు నీటిని శుభ్రపరిచే దిశగా చర్యలు చేపట్టారు. అయినా పూర్తి స్థాయిలో చెరువులో నీరుశుభ్రం కాకపోవడంతో దక్షిణం వైపు ఉన్న చెరువులో నీటిని బయటకు పంపే పనులు ఆదివారం అధికారులు చేపట్టారు. దీంతో తాత్కాలికంగా గ్రామానికి నీటి సరఫరా సమస్య తలెత్తకుండా ఉత్తరం వైపు ఉన్న చెరువు నీటిని సరఫరా జరిగేలా చేస్తున్నట్లు పంచాయితీ కార్యదర్శి అడ్డగడ్డ వెంకటేశ్వర్లు తెలిపారు. దక్షిణం వైపు చెరువులోని నీటిని పూర్తిస్థాయిలో బయటకు పంపి చెరువులో ఉన్న పేరుడును తొలగించిన అనంతరం కొత్త సాగర్ జలాలతో చెరువు నింపుతామన్నారు. కొన్నేళ్లుగా చెరువు నీరును బయటకు పంపే తూము పూడిపోవడంతో ఆదివారం నీటిని బయటకు పంపేందుకు ఎక్స్‌కవేటర్‌తో పనులు చేట్టి నీటిని బయటకు పంపే ప్రయత్నం చేశారు.



కలుషిత నీటిని బయటకు పంపేందుకు కట్ట తవ్వుతున్న ఎక్స్‌కవేటర్

ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన

మార్టూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతుసంఘం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక వ్యవసాయమార్కెట్ యార్డులో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఏవో లావణ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి లాంఫాం నుంచి, దర్శి నుండి పలువురు శాస్త్రవేత్తలు విచ్చేస్తున్నారని, మండలంలోని రైతులు ఈ సమావేశానికి హాజరుకావాలని లావణ్య తన ప్రకటనలో కోరారు.

మొక్కలతో స్వచ్ఛమైన వాతావరణం



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

చీరాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు పెంపకంతో కాలుష్యంలేని స్వచ్ఛమైన వాతావరణం అందుతుందని సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ చీరాల కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో ట్రీ ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు మొక్కలు నాటి నీళ్ల పోశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జగదీష్‌బాబు, ఎన్ఎస్ఎస్ కో- ఆర్డినేటర్ డా.డి.జ్యోతిస్వరూప్, కన్వీనర్ ఎస్కే మీరావలి, విద్యార్థులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రులకు మంత్రి రవికుమార్‌కు ఆహ్వానం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అద్దంకిలోని శ్రీ చక్ర సహిత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి 54వ శరన్నవరాత్రులకు హాజరు కాలని కోరుతూ ఆదివారం దేవస్థానం పాలకవర్గం సభ్యులు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి ఆ హ్వాన పత్రికను ఆ యనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పాలకవర్గం అధ్యక్షుడు ఊటుకూరి రామకోటేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు లక్ష్మీ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి అరవపల్లి హనుమంతరావు, ఉపాధ్యాక్షుడు గార్లపాటి శ్రీనివాసరావు, చుండూరి మురళీ సుధాకరరావు, కరిచేటి వెంకటసుబ్బారావు, తదితరులు ఉన్నారు.

కుసుమకుమారిని విధులలోకి తీసుకోవాలి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం డిపో కండక్టర్ కుసుమకుమారిని విదులలోకి తీసుకోవాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యం. కుమార్, పి. తిరుపతిరెడ్డి లు డిమాండ్ చేశారు. డ్యూటీలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను చిన్న వీడియోలో లేవనెత్తడంతో చర్యలు తీసుకోవడం తగదన్నారు.

శరన్నవరాత్రులకు సన్నద్ధం

● ముస్తాబైన పలు ఆలయాలు ● అద్దంకి వాసవీ అమ్మవారి ఆలయంలో నవరాత్రి పుస్తకాల ఆవిష్కరణ

అద్దంకి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు పలు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. పట్టణంలోని చక్రసహిత వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో సోమవారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. శరన్నవరాత్రుల ఉత్సవాల ఆహ్వాన పుస్తకాన్ని ఆదివారం కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఊటుకూరి రామకోటేశ్వరరావు, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని లక్ష్మీశ్రీనివాసరావు, చుండూరి మురళీసుధాకర్, గార్లపాటి శ్రీనివాసరావు, కృష్ణసుభాన్, భోజనపల్లి సత్యనారాయణ, కురిచేటి వెంకటసుబ్బారావు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు. సోమవారం ఉదయం గుండ్లకమ్మ నది నుంచి 108 మహిళలతో కళశాలతో జలాన్ని తీసుకొని దేవాలయం కు తీసుకు వస్తారన్నారు. అక్టోబరు 2వ తేదీ వరకు శరన్నవ రాత్రుల ఉత్సవాలు జరుగుతాయన్నారు. 4వ తేదీ అద్దంకి పట్టణంలో అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తారన్నారు. శరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా అద్దంకి పట్టణంలోని పాతబస్టాండ్ నుంచి అమ్మవారి దేవాలయం వరకు విద్యుత్ దీపాలతో స్వాగత ద్వారాలు, దేవతామూర్తుల ఫోటోలు ఏర్పాటు చేశారు.

చినగంజాం : నేటి నుంచి నిర్వహించే దసరా శరన్నవరాత్రులకు మండల పరిధిలోని ఆలయాలను ముస్తాబు చేస్తున్నారు. చినగంజాంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి మందిరం, భవానీపురం, రైల్వే సెంటర్‌లోని విజయ కనకదుర్గాభవాని అమ్మవారి దేవస్థానం, సోపిరాల గ్రామంలోని లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానం, కడవకుదురు గ్రామంలోని గంగా పార్వతి సమేత గోఖర్ణేశ్వరస్వామి దేవాలయం, సంతరావూరు, గొనసపూడి, రాజుబంగారుపాలెం, పెదగంజాం, చింతగుంపల్లి, పల్లెపాలెం తదితర గ్రామాల్లో సోమవారం నుండి అక్టోబరు 2 వరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజు ప్రత్యేక అలంకరణలు, కుంకుమార్చనలు, కోలటాలు, భజనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. దేవాలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఒక్కో రోజు ఒక్కో అలంకారంతో అమ్మవార్లు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

శ్రీమహాలక్ష్మమ్మ అమ్మకు పసుపు పూజ

వేటపాలెం (చీరాల) : వేటపాలెం మండలం అనుమల్లిపేట శ్రీమహాలక్ష్మమ్మ చెట్టువద్ద భక్తులు ఘనంగా పసుపు పూజా కార్యక్రమం నిర్వహించారు. శ్రీ బతుకమ్మతల్లి ఉత్సవాలు సందర్భంగా నిర్వహించిన పూజల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. వివిధ రకాల పూలతో అలంకరించి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో రాజ్యలక్ష్మీ, అనంత లక్ష్మీ, తులసీ, భారతీ, పార్వతీ, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబైన ఆలయాలు

పర్చూరు : నేటి నుంచి నిర్వహించనున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు అవుతున్నాయి. ఆలయాలను శుభ్రపరిచి, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరిస్తున్నారు. మండలంలోని చెరుకూరు శ్రీ త్రివిక్రమ అగస్తేశ్వర ఆలయం, పర్చూరులోని శ్రీఅద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయం, శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి, అడుసుమల్లి, నాగులపాలెం, ఉప్పుటూరు, వీరన్నపాలెం, నూతలపాడు తదితర గ్రామాల్లోని ఆలయాలను వేడుకలకు సిద్ధం చేస్తున్నారు.

విద్యుత్‌దీపాలతో ఆలయాలు ముస్తాబు

పంగులూరు: శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని పలు ఆలయాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. పంగులూరులో స్వయంభూగా వెలసిన శ్రీ పార్వతీ సమేత శ్రీభీమలింగేశ్వరస్వామి ఆలయంలో 22న సోమవారం నుంచి అక్టోబరు 2 వరకు శ్రీదేవీ శరన్నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి విఘ్నేశ్వరపూజ, స్వామి వారికి పంచామృత విశేషద్రవ్యములతో అభిషేక కార్యక్రమం, అమ్మవారికి ఖడ్గమాలార్చన అష్టోత్తరము జరుగుతుందని అర్చకస్వామి చందలూరి సునీల్ తెలిపారు.సాయంత్రం 6గంటల నుండి లలిత సహస్ర నామం పారాయణం, కుంకుమార్చనపూజ నిర్వహించి మంగళహారతి తీర్థప్రసాద వినియోగం నిర్వహించనున్నట్లు తెలిపారు.



అద్దంకిలో శరన్నవరాత్రి ఆహ్వాన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సభ్యులు



విద్యుత్ దీపాల వెలుగుల్లో పర్చూరులోని వాసవీ అమ్మవారి ఆలయం

నేటి నుంచి భావనారాయణస్వామి బ్రహ్మోత్సవాలు

చినగంజాం సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : స్థానిక భూసమేత భావనారాయణస్వామి దేవస్థాన 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 22వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు దేవదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఉదయం 7.30 గంటలకు శ్రీవారికి, అమ్మవార్లకు స్నపన, రాత్రి 7గంటలకు అంకురారోపణతో కార్యక్రమం ప్రారంభం కానుంది. 23న ఉదయం 8 గంటలకు అగ్నిప్రతిష్ఠాపన, నిత్యహోమం, 9గంటలకు గ్రామ బలిహరణ, 9.30 గంటలకు ధ్వజారోహణ, 10 గంటలకు హనుమాన్ చాలీసా పారాయణం, రాత్రి 7గంటలకు శేష వాహనంపై గ్రామోత్సవం, కోలాట ప్రదర్శన నిర్వహించనున్నారు. ప్రతిరోజు వివిధ పూజలతో పాటు, సాయంత్రం వాహన సేవ నిర్వహించనున్నారు. 24న హనుమద్వాహనం, 25న గజవాహనంపై శ్రీవారి గ్రామోత్సవం, రాత్రి 8 గంటలకు ఎదుర్కోల, శ్రీవారి కళ్యాణం నిర్వహించ నున్నారు. 26న సాయంత్రం 4గంటలకు రథోత్సవం, 27న వసంతోత్సవం, అశ్వ వాహనంపై శ్రీవారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం చక్రస్నానం, 28న స్వామి వారి పల్లకి ఉత్సవం, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. రాత్రి 7 గంటలకు శ్రీవారి ఊంజల్ సేవ, ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ సేవాదళ్ సభ్యులు తెలిపారు.



విశేష అలంకరణలో స్వామివారు

పారిశ్రామిక రంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

ఎన్‌టీఆర్ ఆటోనగర్ పారిశ్రామికవేత్తల సర్వసభ్య సమావేశం

ఈపూరుపాలెం(చీరాల), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక రంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ఈపూరుపాలెం ఎన్టీఆర్ ఆటోనగర్ అసోసియేషన్ స్థలాల కొనుగోలు దారులు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని కమిటీ ప్రతినిధులు పిలుపు నిచ్చారు. ఆదివారం అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో ఆటోనగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటో నగర్‌లో ఇండస్ట్రీయల్స్ ఏర్పాటుతో వేల మందికి ఉపాధి అవకాశాలు అందుతాయని వివరించారు. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు కొనుగోలుకు, వినియోగ సమయంలో విద్యుత్ రాయితీలు, బ్యాంకు రుణాలు వంటివి సులభతరం చేసినట్లు చెప్పారు. ఏపీఐఐసీ స్పష్టమైన మార్గాలతో నిర్వహణ సాగిస్తున్నట్లు వివరించారు. అలాగే అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షులుగా రామరాజు, సెక్రటరీగా శ్యాంప్రసాద్, ఉపాధ్యాక్షులు గోవింద్, కోశాధికారిగా శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా హనుమంతురావు, తదితర సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో రెండు రాష్ట్రాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.



సమావేశంలో ఆటోనగర్ కమిటీ ప్రతినిధులు

అధ్వానంగా పర్చూరు- నాగులపాలెం రహదారి

పర్చూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఉన్న పర్చూరు-నాగులుపాలెం రోడ్డు అధ్వానంగా తయారైంది. పెద్ద పెద్ద గుంతలతో ఈ రోడ్డు నిండి ఉంది. ఈ రోడ్డు అభివృద్ధి తమ పని కాదని వివిధ శాఖల అధికారులు వ్యవహరిస్తున్నారు. పర్చూరు ఆర్‌టీసీ బస్టాండ్‌కు సమీపంలోని ఈ రోడ్డులో నిత్యం ప్రభుత్వ వాహనాలు ప్రయాణిస్తునే ఉంటాయి. కొత్త రోడ్డు సంగతి పక్కన పెడితే కనీసం గుంతలు అభివృద్ధి చేస్తున్న దాఖలాలు కూడా కనిపించడం లేదు. దీంతో గుంతల్లో నీరు నిండుతోంది. ఇది గుర్తించలేని వాహన దారులు ప్రమాదాల బారిన పడాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్డు మరమ్మతులు చేయించాలని వాహన దారులు, ప్రజలు కోరుతున్నారు.



గోతులతో నిండిన రహదారి

శిలాఫలకం పునర్నిర్మించక పోవడంపై ఫిర్యాదు

అద్దంకి, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేలమూరిపాడు ఎస్సీ కాలనీ లో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్డు ప్రారంభోత్సవం సందర్భంగా 2017 సంవత్సరంగా నాటి ఎమ్మెల్యే రవికుమార్ ఆవిష్కరించిన శిలాఫలకం 6నెలల క్రితం సీసీ డ్రైన్ నిర్మాణ సమయంలో ధ్వంసమైంది. అప్పట్లోనే ఎస్సీ కాలనీ వాసులు ప్రశ్నించగా డ్రైన్ల నిర్మాణం చేసే కాంట్రాక్టర్‌తో ధ్వంసమైన శిలాఫలకం పునర్నిర్మాణం చేయిస్తామని అంగీకరించారు. అయితే సైడ్‌డ్రైన్లు నిర్మాణ పనులు పూర్తయినా ఇంకా నిర్మించలేదని, కాలనీవాసులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయమై మండలస్థాయి అధికారులకు ఫిర్యాదు చేయగా తొలుత పునఃనిర్మాణం చేయిస్తామని చెప్పి, ప్రస్తుతం పొంతన లేకుండా వ్యవహరిస్తున్నారని మాజీ నీటి సంఘం అధ్యక్షుడు ఉప్పుటూరి అంజయ్య ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ధ్వంసమైన శిలాఫలకం స్థానంలో కొత్తది ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఎస్సీ కాలనీ వాసులు కోరుతున్నారు. అంతర్గత విబేధాలతోనే పునఃనిర్మాణం చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.



ధ్వంసమైన శిలాఫలకం

కామేపల్లిలో వృద్ధుడు అదృశ్యం

సంతమాగులూరు సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కామేపల్లి గ్రామానికి చెందిన కొణిదెన కొండలు అదృశ్యం కావడంతో స్థానిక పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశారు, శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్ల వద్ద వెతికిన ఆచూకీ తెలియకపోవటంతో, ఆదివారము స్థానిక పోలీస్ స్టేషన్లో కొడుకు బ్రహ్మలు పిర్యాదు చేసాడు. అతని యొక్క ఆచూకీ తెలిసినవారు స్థానిక ఎస్సై నెంబర్ 9121102168 కు ఫోన్ చేసి ఆచూకీ తెలపాలని కోరారు.

నేడు మంత్రి రవికుమార్ పర్యటన

అద్దంకిటౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌యం డోలా సువర్ణ పద్మావతి ఉద్యోగ విరమణ కార్యక్రమం పాఠశాల ఆవరణలో మధ్యాహ్నం 1.30కి జరుగుతుందని, కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామితో కలిసి పాల్గొనున్నారు. అనంతరం బాలుర ఉన్నత పాఠశాల, గోరకాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేయనున్నారు.

సీఐటీయూ నూతన కమిటీ ఎన్నిక

అద్దంకిటౌన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఐటీయూ నూతన కమిటిని అద్దంకిలోని సుందరయ్య భవనంలో ఆదివారం ఎన్నుకున్నారు. తంగిరాల వెంకటేశ్వర్లు కన్వీనర్‌గా తిరుపతిరెడ్డి కో కన్వీనర్‌గా, సామియేలు, ఆదాం, శారద, కోటేశ్వరమ్మ భాషా తదితరులుతో కూడిన 12 మంది సభ్యులతో మహాసభ నూతన కమిటిని ఎన్నుకుంది. మహాసభకు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కే.ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

భారీ వర్షాలతో పొంగిపొర్లుతున్న వాగులు

చెరువులను తలపిస్తున్న నేలవంతెనలు

బల్లికురవ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలుగ్రామాలలో గత మూడు రోజులనుండి కురుస్తున్న భారీ వర్షాలతో పలు వాగులు, చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. రోడ్లన్నీ జలమయమయ్యాయి. చెన్నుపల్లి కొండాయపాలెం గ్రామాల మధ్య ఉన్న నేలవంతెనపై పెద్దఎత్తున వర్షపునీరు వాగులా ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలుకు కూడా తీవ్ర ఇబ్బంది ఎదురయ్యింది. చెన్నుపల్లి చెరువు నుండి అలుగు ద్వారా నీరు రావడంతో బల్లికురవ వేర్లచెరువులో ఉన్న చేపలు పైకి ఎగబాగడంతో పొలాలుపై చేపలు వచ్చాయని తెలిసి పలు గ్రామాల ప్రజలు కర్రలు తీసుకొని చేపలను పట్టుకున్నారు. కొందరైతే వలలను వేసి పెద్ద పెద్ద చేపలను పట్టుకుపోయారు. వాతావరణం చల్లబడటంతో ఎటు చూసినా నీరు కనిపించడంతో పంట భూములు కళకళ లాడుతున్నాయి. అలానే గ్రామాల్లో ఉన్న సాగునీటి చెరువులు నీటితో కళకళ లాడుతున్నాయి.



చెన్నుపల్లి కొండాయపాలెం వద్ద నేలచప్టాపై ప్రవహిస్తున్న నీరు

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

● సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసిన మంత్రి రవికుమార్
● ఏడాదిలో రాష్ట్ర వ్యాప్తంగా రూ.400 కోట్ల సాయం

అద్దంకి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి నియోజక వర్గంలో పలు గ్రామాలకు చెందిన 120 మంది అనారోగ్యంతో బాధపడుతూ కార్పోరేట్ వైద్యశాలలో వైద్యం చేయించుకోగా, సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను ఆదివారం చిలకలూరిపేట లో మం త్రి రవికుమార్ అందజేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాది కాలంలోనే రా ష్ట్ర వ్యాప్తంగా సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 400 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం అందించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల టీడీపీ నేతలు పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న మంత్రి రవికుమార్

అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో అన్నదానం

అద్దంకి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో అమవాస్య సందర్భంగా ఆదివారం స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో అన్నదానం చేశారు. ఆకుల సత్యనారాయణ, స్వరాజ్యలక్ష్మి కుటుంబసభ్యుల సహకారంతో అన్నదానం చేశారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు వాసు గురుస్వామి, పెద్దన్న గురుస్వామి, తిరుపతిరెడ్డి గురుస్వామి, అమరా శ్రీను, మంగమూరి సతీష్, మంచిళ్ల సుబ్రహ్మణ్యం, కురిచేటి వెంకటసుబ్బారావు(చిన్ని), వడ్డవల్లి పూర్ణచంద్రరావు, ఉండవల్లి శ్రీను, వేదాంత్, తవ్వా రవికుమార్, తేలుకుట్ల శ్రీకాంత్, పెదలంక హనుమంతరావు, ఉడత్తు ఆదినారాయణ, శిఖాకొల్లి కారుణ్య తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

అపరిచిత కాల్స్‌తో సైబర్ మోసాలు

ఇంకొల్లు, సెప్టెంబరు 21,(ఆంధ్రజ్యోతి) : అపరిచిత కాల్స్‌కు స్పందించి, సైబర్ మోసాలకు లోనవద్దని ఇంకొల్లు ఎస్సై సురేష్ అన్నారు. ఇటీవల పెరిగిన సైబర్ మోసాలపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఓ వీడియో ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కలిగించారు. తెలియని నంబర్ల నుంచి కానీ, తెలియని వ్యక్తుల నుండి వాట్సాప్‌కాల్స్ ద్వారా వచ్చే బెదిరింపులకు భయపడవద్ద న్నారు. వారి మాయమాటల్లో పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మీ ఆధార్ నంబరుకానీ, బ్యాంకుఖాతా వివరాలు, ఓటీపీ నంబర్లు ఎవరికీ తెలియజేయకూడదన్నారు. మీకు అనుమానిత నంబర్ల నుంచి కాల్స్ వస్తే 1903 నంబరుకు కాల్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరాలు పెరిగిన నేపథ్యంలో ప్రజలు చైతన్యవంతులై పక్కవారిని కూడా చైతన్య పరచాలన్నారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన కంటైనర్

పంగులూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో కంటైనర్ డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఈ ఘటన ఆదివారం మండలంలోని జాగర్లమూడివారిపాలెంవద్ద 16వ నెంబరు జాతీయరహదారిపై చోటుచేసుకుంది. బోయపాలెం నుంచి పొగాకు లోడుతో చెన్నై బయలుదేరిన కంటైనర్ జేపీ.పాలెం ఫ్లైఓవర్ సమీపంలో అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. కంటైనర్ పూర్తిగా అవతలిరోడ్డుపైకి వెళ్ళకుండా డివైడర్‌పై నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో మార్టూరుకు చెందిన కంటైనర్‌డ్రైవర్ సత్తివేలుకు స్వల్ప గాయాలుకాగా హైవే అంబులెన్స్ సిబ్బంది అతనిని చికిత్స నిమిత్తం మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సిబ్బంది చర్యలు చేపట్టారు.



జాతీయరహదారిపై డివైడర్ పైకి దూసుకెళ్లిన కంటైనర్

గురజాడ సాహిత్యం అతిమధురం

చీరాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సాహిత్య చరిత్రలో గురుజాడ రచనలు అతిమధురమని లైబ్రేరియన్ అంగలకుర్తి ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానికశాఖ గ్రంథాలయంలో గురజాడ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డా.బీరం సుందరరావు, శ్రీరామ్ కోటేశ్వరరావు, బత్తుల పాపారావు, ప్రసాద్, తిరుపతమ్మ పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న ప్రతినిధులు

రోడ్డు వేశారు.. కాలువలు మరిచారు




- కావలి పట్టణంలో సీసీ రోడ్లు,
- కాలువల్లేక నిలిచిన వర్షపు నీరు
- ఇందిరమ్మ కాలనీ వాసుల అవస్థలు

వివరాలు 7లో..








నెల్లూరు: విద్యుత్ దీపాలంకరణలో ఇరుకళల పరమేశ్వరి ఆలయం

నెల్లూరు నగరంలో విద్యుద్దీప శోభతో కన్యకాపరమేశ్వరి, రాజరాజేశ్వరి అమ్మవార్ల ఆలయాలు



విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్న స్టోన్‌హౌస్‌పేట ప్రధాన రహదారి

నేటి నుంచి

శరన్నవరాత్రి ఉత్సవాలు

- జిల్లాలోని అమ్మవారి ఆలయాలు ముస్తాబు
- భక్తుల రద్దీ ఉన్న దేవాలయాల్లో ప్రత్యేక క్యూలైన్లు
- పారిశుధ్యానికి ప్రాధాన్యం : డీసీ

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో శరన్నవరాత్రుల ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. ఈ ఉత్సవాలు సోమవారం (నేటి) నుంచి అక్టోబరు 2 వరకు జరగనున్నాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉన్న దుర్గాదేవీ ఆలయాలు, మహాలక్ష్మీ ఆలయాలు, రామ మందిరాల్లో నవరాత్రి శోభ వెల్లివిరుస్తోంది. దసరా ఉత్సవాలను 9 అలంకారాలు, 9 నైవేద్యాలు, 9 రంగులు, 9 మంత్రాలతో నిర్వహించనున్నారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలోని ఆలయాల్లోనూ, ప్రైవేటు ఆలయాల్లోనూ ఈ ఉత్సవాలు పోటాపోటీగా నిర్వహించనున్నారు. నగరంలోని రాజరాజేశ్వరి ఆలయం, గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి, వాసవీ కన్యకాపరమేశ్వరి, జొన్నవాడ కామాక్షితాయి, కావలి కళుగోళమ్మ, నర్రవాడ వెంగమాంబ ఆలయాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు శోభాయమానంగా ప్రారంభం కానున్నాయి. దసరా వేడుకల కోసం ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలతోనూ రంగులతోనూ తీర్చిదిద్దారు. నవరాత్రి నోములకు మహిళలు ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ సందర్భంగా బొమ్మల కొలువులు ఏర్పాటు చేయనున్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

దసరా ఉత్సవాల సందర్భంగా దేవదాయశాఖ పరిధిలోని ఆలయాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నాం. ఈ మేరకు ఆయా ఈవోలకు సూచనలిచ్చాం. సామాన్య భక్తులకు దర్శనం కల్పించడం, ఉచిత ప్రసాదం, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నాం. భక్తులు రద్దీ ఉండే నగరంలోని రాజరాజేశ్వరి ఆలయం, జొన్నవాడ కామాక్షితాయి ఆలయం, ఇతర ఆలయాల్లో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశాం. రాజరాజేశ్వరి ఆలయంలో ఉచిత ధర్మదర్శనం కోసం రెండు క్యూలైన్లు రూ.50, రూ.300 ప్రత్యేక దర్శనం క్యూలైన్లు ఏర్పాటు చేశాం. రూరల్ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అంతరాలయ ప్రవేశాన్ని రద్దు చేశాం. అక్టోబరు 2న అమ్మవారి నగరోత్సవం వైభవంగా నిర్వహిస్తాం. 3న భారీ అన్నదానం చేస్తాం. భక్తులంతా దసరా ఉత్సవాల్లో పాల్గొనాలి.

– కే జనార్దన్‌రెడ్డి, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్

జైల్లో చేతివాటం

- ఖైదీని బ్లాక్ మార్చేందుకు నగదు డిమాండ్
- ఫోన్‌పేలో డబ్బు వేయించుకున్న అధికారి, సిబ్బంది
- డిప్యూటీ జైలర్, చీఫ్ హెడ్ వార్డర్ సస్పెన్షన్

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): నెల్లూరు కేంద్ర కారాగారంలో అధికారులు, సిబ్బంది చేతివాటం రోజురోజుకు పెరిగిపోతోంది. ఇటీవల ఓ ఉన్నతాధికారి ఫోన్ సంభాషణలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం తెలిసిందే. సెంట్రల్ జైలును రౌడీషీటర్లు మధ్యస్థాలకు అడ్డాగా మార్చుకున్నారంటూ రౌడీషీటర్ శ్రీకాంత్ విషయంలో స్పష్టమైంది. ఈ క్రమంలో నెల్లూరు సెంట్రల్ జైలులో శిక్ష పడిన ఖైదీని బ్లాక్ మార్చేందుకు ఇద్దరు అధికారులు ఫోన్‌పే ద్వారా నగదు వేయించుకున్నారని ఆ ఖైదీ ఇచ్చిన ఫిర్యాదుతో జైలు ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. విచారణలో ఫోన్‌పే ద్వారా నగదు బదిలీ జరిగిన విషయం నిజమేనని తేలడంతో చీఫ్ హెడ్ వార్డెర్ ఐ. హనుమంతరెడ్డి, డిప్యూటీ జైలర్ ఎం. విజయకుమార్‌ను జైళ్లశాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.



సోమశిలకు 40వేల క్యూసెక్కుల వరద

అనంతసాగరం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి ఆదివారం సాయంత్రం 40 వేల క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. జలాశయంలో 73.321 టీ ఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువకు మూడు క్రస్ట్‌గేట్ల ద్వారా 35 వేలు, పవర్ టన్నెల్ ద్వారా 2,600, ఉత్తర కాలువకు 350, కండలేరుకు 10,450 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లో వర్షాలు కురుస్తుండటంతో ఇన్‌ఫ్లో పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆరేళ్లుగా ఎదురుచూపులు 8

- విడుదల కాని పెళ్లి కానుక నిధులు

నేటి నుంచి తగ్గనున్న ధరలు

ప్రజలకు ముందే వచ్చిన దసరా, దీపావళి

సామాన్యులకు ఊరట !



నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) : ఏ వస్తువు కొన్నా జీఎస్టీ పేరుతో పన్నులు బాధేస్తుంటే... ఏమీ చేయలేక, ఎవరికీ చెప్పుకోలేని ప్రజలు ఇప్పటి వరకు సతమతమయ్యేవారు. ఉప్పుపప్పు నిప్పు.. ఇలా ఒకటేమిటీ .. గుండుసూది కొన్నా కూడా పన్నులు బాదేశారు. ప్రతినెలా మార్కెట్‌లో వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయేకానీ, తగ్గటం లేదు. ధరల పెరుగుదలతో సతమతమవుతున్న ప్రజలకు జీఎస్టీ రేట్లు తగ్గుతాయనే అంశం కొంత ఊరటనిచ్చింది. దేశవ్యాప్తంగా సోమవారం (నేటి) నుంచి అమల్లోకి రానున్న జీఎస్టీ రేట్ల తగ్గుదల సామాన్యులకు ఉపశమనం కలిగిస్తోంది. దీంతో తమకు దసరా, దీపావళి పండుగలు ముందే వచ్చాయని వారు సంబరపడుతున్నారు.

జీఎస్టీ తగ్గిస్తే వ్యాపారంలో మార్పులు

ప్రస్తుతం జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రభావంతో ధరలు తగ్గాయో లేదో కానీ, వ్యాపారంలో మార్పులు మాత్రం రానున్నాయి. గతంలో వ్యాపారాలు ఒక క్రమబద్ధంగా నడిచేవి. హోల్‌సేల్, రిటైల్ మార్కెట్‌లు ఉండేవి. ప్రస్తుతం సూపర్ మార్కెట్‌లు రావడంతో ధరల తేడాలు వచ్చాయి. హోల్‌సేల్ మార్కెట్ రేట్లకు రిటైల్ మార్కెటు ధరల్లో చాలా వ్యత్యాసం ఉంది.

– దాసా లక్ష్మీనారాయణ, జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ అధ్యక్షుడు

వ్యాపారుల హర్షం

కందుకూరు : తగ్గించిన జీఎస్టీ దేశవ్యాప్తంగా సోమవారం నుంచి అమల్లోకి వస్తున్న సందర్భంగా పట్టణంలోని వ్యాపారులు, బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కాగా సోమవారం సాయంత్రం పామూరు రోడ్డులోని రిలయన్స్ సూపర్ మార్కెట్ వద్ద ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్, సీఎం నారా చంద్రబాబు చిత్ర పటాలకు పాలభిషేకం నిర్వహించనున్నట్లు వ్యాపారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, పట్టణంలోని వ్యాపారులు పాల్గొనాలని బీజేపీ నియోజవకర్గ సమన్వయకర్త ఘట్టమేని హరిబాబు, పట్టణ శాఖ అధ్యక్షుడు మన్నేపల్లి వరప్రసాదావు కోరారు.

జీఎస్టీ తగ్గింపు ఇలా..

వస్తువు పేరు	ప్రస్తుతం	కొత్తది
సబ్బులు, టాయిలెట్ సోప్	18	5
మొబైల్ ఫోన్లు	28	18
వంట సామగ్రి	12	5
ఫ్రిజ్, వాషింగ్ మిషన్, ఎయిర్‌కూలర్	28	18
సిగరెట్లు, కూల్ డ్రింక్స్	18-28	40
రేస్‌క్లబ్, కేసినో సేవలు	18-28	40
విద్యార్థి పుస్తకాలు, బ్యాగులు	12	0
వ్యవసాయ యంత్రాలు, డ్రిప్, స్ప్రింక్లర్లు	12	5
దుస్తులు, ఫ్యాబ్రిక్, చిన్న ప్యాచ్ వస్తువులు	12	5
గోధుమ, ఆటా, మైదా	5	0
పన్నీర్, పిజ్జా, బ్రెడ్	5	0
వెన్న, నెయ్యి, తదితరాలు	12	5

ధరలు తగ్గే వస్తువులివే..!

కొత్త జీఎస్టీ రేట్లతో వస్తువుల ధరలు తగ్గనున్నాయి. సబ్బులు, టూత్ పేస్టులు, పాలు, డెయిరీ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఔషధాలు, ఆటోమొబైల్స్, వాషింగ్ పౌడర్లపై జీఎస్టీ తగ్గనుంది. చిన్నకార్లపై పన్ను కొంత తగ్గించగా, ఎలక్ట్రిక్ వాహనాలపై మరింత పన్ను రాయితీ అందనుంది. పిల్లల వస్తువులు, స్కూల్ బ్యాగ్స్‌పై తక్కువ శాతం జీఎస్టీ విధించారు. గృహోపకరణాల వంటి వాటిపై కూడా పన్ను తగ్గనుంది. ఉదాహరణకు నిత్యం వినియోగించే సబ్బులపై ప్రస్తుతం 18శాతం జీఎస్టీ ఉంది. ఇప్పుడు 12శాతానికి తగ్గుతుంది. రూ.50విలువైన సబ్బుపై జీఎస్టీ తగ్గుదల వలన రూ. 2 నుంచి రూ.3 వరకు తగ్గే అవకాశం ఉంది. మధ్య తరగతివారు చిన్న కార్లను వినియోగించుకోడానికి ఎక్కువగా ఇష్టపడుతుంటారు. చిన్న కార్లపై ఇప్పటి వరకు 22 శాతం జీఎస్టీ ఉంది. దీని వల్ల రూ.7లక్షల కారుపై సుమారు రూ.35వేల వరకు తగ్గే అవకాశం ఉంది. పాలు, కూరగాయలు భద్రపరచుకునే ఫ్రిజ్‌లపై 18శాతంగా ఉన్న జీఎస్టీ 12శాతానికి తగ్గించారు. దీంతో రూ.20వేల ఫ్రిజ్‌పై రూ. 1200 వరకు తగ్గే అవకాశం ఉంది. మైక్రోవేవ్ ఓవెన్‌పై 18శాతం జీఎస్టీ ఉంటే అది 12 శాతానికి తగ్గింది. దీంతో రూ. 10వేలు ఉన్న ఓవెన్‌పై రూ. 600 తగ్గవచ్చు. వాషింగ్ మిషన్‌పై వున్న 18శాతం జీఎస్టీ 12 శాతానికి తగ్గటంతో రూ. 15వేల విలువైన వాషింగ్ మిషన్‌పై రూ. 900 తగ్గవచ్చు.





వైద్యశాల ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న బాధితులు (ఇన్‌సర్ట్) పసికందు మృతదేహం

కాన్పుకు వస్తే...

పసిగుడ్డు ప్రాణం తీశాడు !

- వైద్యుడి నిర్లక్ష్యంపై కుటుంబ సభ్యుల ఆగ్రహం
- న్యాయం చేయాలంటూ బైఠాయింపు
- ఆసుపత్రి గేటుకు తాళం వేసేందుకు యత్నం
- బాధితులు, పోలీసుల మధ్య వాగ్వివాదం
- ఉదయగిరిలో ఉద్రిక్తత

ఉదయగిరి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి కాన్పు కోసం వస్తే వైద్యుడు నిర్లక్ష్యంగా వ్యవహరించి, పసికందు ప్రాణాలు తీశాడని కుటుంబ సభ్యులు, బంధువులు వైద్యశాల వద్ద ఆదివారం అగ్రహం వ్యక్తం చేశారు. సేకరించిన వివరాల మేరకు.. సీతారామపురం మండలం బసినేనిపల్లి ఏసీనగర్ కాలనీకి చెందిన ముళ్లపాటి మంజులకు, వైఎస్ఆర్ జిల్లా బద్వేల్‌కు చెందిన గొడుగునూరి చంద్రశేఖర్‌తో ఏడాది క్రితం వివాహమైంది. మంజుల గర్భదాల్చడంతో తల్లి సునీత 20 రోజుల క్రితం బద్వేల్ నుంచి బసినేనిపల్లికి తీసుకువచ్చింది. శనివారం ఆమెకు నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులతో కలిసి 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గైనకాలజిస్టు ఠాగూర్ ఆమెకు పరీక్షలు చేశారు. సాధారణ కాన్పు చేస్తానని కుటుంబ సభ్యులకు తెలిపాడు. ఇబ్బందికరంగా ఉంటే తాము ఎక్కడికైనా వెళతామని, రెఫర్ చేయమని కుటుంబ సభ్యులు అడిగారు. 'అవసరం లేదు, కాన్పు చేస్తా'నని వారికి వైద్యుడు భరోసా ఇచ్చారు. అర్ధరాత్రి సమయంలో మంజులకు నొప్పులు అధికమై ఉమ్మనీరు బయటకు వచ్చింది. దీంతో సిబ్బంది కాన్పు కోసం గదిలోకి తీసుకెళ్లారు. వైద్యశాలలోనే ఓ గదిలో ఉన్న వైద్యుడికి సమాచారం ఇచ్చేందుకు వారు ప్రయత్నించగా ఆయన స్పందించలేదు. దీంతో సిబ్బందే కాన్పు చేయడంతో గర్భిణి మగబిడ్డకు జన్మనిచ్చింది. పుట్టిన బిడ్డ శ్వాస తీసుకోవడం ఇబ్బందికరంగా ఉండడంతో వైద్యశాలలో పనిచేసే శానిటరీ వర్కర్ డాక్టర్ గదికి వెళ్లి తలుపులు కొట్టగా, వైద్యుడు వచ్చి బిడ్డను పరీక్షించి మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించాలని చెప్పాడు. 108 వాహనానికి సమాచారం అందించగా, వారు వైద్యశాల వద్దకు చేరుకున్నారు. అనంతరం బిడ్డను పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. వైద్యుడి నిర్లక్ష్యంతోనే తమ బిడ్డ చనిపోయాడని కుటుంబసభ్యులు తీవ్ర వాగ్వివాదనకు దిగారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి వైద్యశాలకు చేరుకుని వివరాల సేకరించారు.

వైద్యశాల వద్ద ఉద్రిక్తత

పసికందు మృతి విషయం తెలుసుకున్న మంజుల కుటుంబ సభ్యులు, బంధువులు ఆదివారం ఉదయం వైద్యశాలకు భారీసంఖ్యలో చేరుకున్నారు. పొత్తిళ్లలో బిడ్డను చంపినవాడు ఏడంటూ బూతు పురాణం అందుకున్నారు. వైద్యుడిపై తీవ్రస్థాయిలో అగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితిని గమనించిన సీఐ వెంకటరావు, ఎస్ఐలు ఇంద్రసేనారెడ్డి, శివకృష్ణారెడ్డి సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒకదశలో వైద్యశాల గేటుకు తాళం వేసేందుకు ప్రయత్నించగా పోలీసులు, బాధితుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకొంది. అనంతరం అక్కడే బైఠాయించి వైద్యుడికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బిడ్డ తండ్రి చంద్రశేఖర్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. బిడ్డ మృతదేహానికి పోస్టుమార్టం కోసం వైద్యుల బృందాన్ని పిలిపించే ప్రయత్నం చేస్తున్నారు.

బతికించే ప్రయత్నం చేశా...

కాన్పు అనంతరం బిడ్డ శ్వాస తీసుకోవడం కష్టంగా ఉండడంతో సీపీఆర్ చేసి బతికించే ప్రయత్నం చేశా. అయినా ప్రయోజనం లేకపోవడంతో కుటుంబ సభ్యులను పిలిచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించాలని సూచించా. వైద్యశాలలో పని ఒత్తిడి అధికమైంది. మా నిర్లక్ష్యం వల్ల ఇది జరగలేదు.

– ఠాగూర్, గైనకాలిజిస్టు

ధాన్యం ధరల్లో దగా

- కనీస 'మద్దతు'కు తూట్లు
- పుట్టి రూ.15 వేలకు కొనుగోలు
- ఎకరాకి రూ.16,520 నష్టం

నెల్లూరురూరల్/జలదంకి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఎడగారు సీజన్‌లో దళారులు, మిల్లర్ల దోపిడీ మొదలైంది. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను గద్దల్లా తన్నుకుపోతున్నారు. కనీస మద్దతు ధరకు తూట్లు పొడుస్తూ పుట్టి ధాన్యంపై ఏకంగా రూ. 4,720లు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. వర్షాన్ని అడ్డంపెట్టుకుని ధాన్యం రంగు మారిందని చెబుతూ ఎకరాకు దిగుబడి వచ్చే మూడున్నర పుట్టి ధాన్యంపై ఏకంగా రూ.16,520లు దోచుకుంటున్నారు. అన్నదాతలను ఆదుకోవాల్సిన జిల్లా యంత్రాంగం చోద్యం చూస్తున్నది.

ఈసారి జిల్లాలో సాగునీరు పుష్కలంగా ఉం డటంతో ఎడగారులో పూర్తి విస్తీర్ణమంతా రైతులు వరి సాగుచేశారు. నెల్లూరు రూరల్లో కనుపూరుకాలువ, జాఫర్‌సాహెబ్, సర్వేపల్లి, కృష్ణపట్నం, లేబూరు, కోడూరు కాలువలతోపాటు వివిధ చెరువుల కింద ఆయకట్టు రైతులు కేఎన్ఎం 1638 రకాన్ని అత్యధికంగా సాగు చేశారు. రెండో ప్రాధాన్యత పంటగా ఎంటీయూ 1010 పండించారు. ప్రస్తుతం వరిపైరు కోతకు సిద్ధమైంది. రంగంలోకి దిగిన మిల్లర్లు, దళారులు పొలాల్లోని పంటను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఆదివారం నెల్లూరు పడమర పల్లెలో కేఎన్ఎం ధాన్యం పుట్టి రూ. 15 వేలకు కొనుగోలు చేసిన మిల్లర్లు, ఎంటీ యూ రకాన్ని రూ. 13,500లకే కొన్నారు.

కొనుగోలు కేంద్రాలేవి..?

ఎడగారు సీజన్‌కు కనీస మద్దతు ధరను ప్రకటించిన అధికారులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై స్పష్టతనివ్వలేదు. ఏగ్రేడ్ కిందకు వచ్చే కేఎన్ఎం పుట్టి రూ. 19,720లుగా లెక్కకట్టారు. అటు ఎంటీయూ 1010 రకం ఏ గ్రేడ్ కిందకు వచ్చినా, దీన్ని అధికారికంగా ప్రభుత్వం కొనుగోలు చేయదని తేల్చారు. ఇప్పటి వరకు ఎక్కడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులు, మిల్లర్లు చెప్పిందే ధర కావడంతో రైతులు దోపిడీకి గురవుతున్నారు. ఈ క్రమంలో ఎకరాపై రూ.16,520లు నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మినిమం సపోర్టు ప్రైస్ (ఎంఎస్పీ) లెక్క ప్రకారం కేఎన్ఎం ధాన్యం పుట్టి రూ. 19,720లకు కొనుగోలు చేయాల్సి ఉండగా, రూ.15 వేల కు కొంటున్నారు. ఈ లెక్కన పుట్టి పై రూ. 4,720లు రైతులు నష్టపోతున్నారు. కాగా, బర్లీపొగాకు, టమోటో, ఉల్లి, మిర్చి, మామి డి తదితర పంటలకు ధరలు తగ్గినప్పుడు ప్రభుత్వం ఎంతో కొంత స్పందించేదని, 20రోజులుగా ధాన్యం ధరలు తగ్గుతున్నా పాలకులు స్పందించిన సందర్భాలు లేవని రైతులు వాపోతున్నారు. ఎమ్మెల్యేలకు జిల్లాలో పరిశ్రమల కోసం రైతుల నుంచి భూసేకరణలో ఉన్న ఉత్సాహం రైతులకు మద్దతు ధర ఇప్పించడంలో లేదన్నారు.

కలెక్టర్ స్పందించాలి..

నూతన కలెక్టర్ హిమాన్షు శుక్లా ధాన్యం ధరల పతనంపై స్పందించాలని రైతులు కోరుతున్నారు. ప్రతీ రోజు వర్షాలు పడి వడ్లరాశులు తడుస్తుండడంతో రైతులు పడుతున్న ఇబ్బందుల పై చర్యలు చేపట్టాలి. డ్రయ్యర్ యంత్రాలు అందుబాటులో ఉంచి, టార్పాలిన్ పట్టలను అందచేయాలి. జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్ష జరిపి మద్దతు ధర దక్కేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	138
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	272

కోడిగుడ్ల ధర (100): 560

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.10588
వెండి కిలో ధర	రూ. 135100
వెండి ఒక గ్రాము	రూ.138.10

బోగోలులో కుండపోత వర్షం

బిట్రగుంట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కుండపోతగా వర్షం కురిసింది. సీఎల్‌పురంలో వరిపైరు నేలకు ఒరిగింది. చేతికి అందాల్సిన ధాన్యం నేలపాలు అవుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతలు పూర్తి కావస్తున్నా ఇంతవరకు సీఎంఆర్ ప్రారంభించక పోవడం రైతులకు శాపంగా మారిందంటున్నారు. చెంచులక్ష్మీపురం పరిసర ప్రాంతాలలోనే ఇంకా 50 ఎకరాలకు పైగా వరి కోతలు జరగాల్సి ఉందని స్థానిక రైతులు తెలిపారు.

బీఎంఆర్ ట్రస్ట్ వైద్యశిబిరం

అల్లూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కపల్లిలో ఆదివారం బీఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నరాల సంబంధిత సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సోమశిల కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ నేతృత్వంలో నెల్లూరులో ప్రముఖ నరాల సంబంధిత వైద్య నిపుణులు బిందుమీనన్ ఫౌండేషన్ సౌజన్యంతో శిబిరం ఏర్పాటుచేసి స్థానికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాటి రంజిత్, ఉప సర్పంచ్ పాపనబోయిన జగన్మోహన్, పంచాయతీ కార్యదర్శి తెనాలి మురళీకృష్ణ, రవ్వా హరికుమార్, వట్టూరు మస్తానయ్య, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల పని గంటల పెంపు దారుణం

ఉలవపాడు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కార్మికుల పని గంటలు రోజుకు 8 నుంచి 13 కు పెంచుతూ శాసనసభలో తీర్మానం చేయడం అన్యాయమని సీఐటీయూ జిల్లా నాయకులు జీవీబీ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని ఒక్క కలం పోటుతో రద్దు చేయడం దారుణమన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

కందుకూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరమని కందుకూరు శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో 36 మంది లబ్ధిదారులకు రూ.20.57 లక్షల విలువ గల చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ పరిధిలో లేని వ్యాధులకు కూడా చికిత్స చేయించుకునేందుకు ప్రభుత్వం చేయూత అందిస్తుందన్నారు. ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ ధ్యేయమన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే ఇంటూరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, గుడ్లూరు, లింగసముద్రం, కందుకూరు, వలేటివారిపాలెం మండల పార్టీ అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, పూరిమిట్ల గురునాథం, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, మాదాల లక్ష్మీనరసింహం, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగమ్మకు పాల పొంగళ్లు

లింగసముద్రం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మారెడ్డిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ దేవత ఆలయంలో పాల పొంగళ్ల వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఆలయం నిర్మించి 41 రోజులైన సందర్భంగా గ్రామస్తులు ఈ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు పాలతో గంగమ్మ తల్లికి అభిషేకం చేశారు. వర్షాలు విరివిగా కురవాలని, పాడిపంటలు సమృద్ధిగా కలగాలని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ఎదుట ఉన్న పోతురాజు విగ్రహానికి కూడా భక్తులు పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బందోబస్తు నిర్వహించిన ఎస్ఐ ఎం నారాయణ, సిబ్బందిని ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు సత్కరించారు.

రోడ్డు వేశారు.... కాలువల నిర్మాణం మరిచారు !

కావలి,సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం కొత్త శివాలయం నుంచి ఇందిరమ్మ కాలనీలకు వెళ్లే మార్గంలో సీసీ రోడ్డు నిర్మించటాన్ని అందరూ అభినందిస్తున్నారు. అయితే ఆ రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించక పోవటంతో వర్షపునీరు నిలిచి కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం కావలిలో కురిసిన ఓ మోస్తరు వర్షానికి ఆ సీసీ రోడ్డు వెంబడి వర్షపు నీరు నిలవటమే కాక కాలనీ వాసుల రాకపోకలకు ఇబ్బందికరంగా తయారైంది. వాస్తవంగా వెంగళరావునగర్ కొత్త శివాలయం నుంచి ఇందిరమ్మ కాలనీలకు వెళ్లే రోడ్డు మార్గంలో బీఈడీ కాలేజీ మీదుగా వచ్చే వర్షపునీరు దిగువకు వచ్చి తుఫాన్‌నగర్, బాలక్రిష్ణారెడ్డి నగర్ మీదుగా మండాటి చెరువులో కలుస్తాయి. అయితే ఆ నీరు వచ్చే మార్గంలో సీసీ రోడ్డు వేశారు కాని దానికి రెండు పక్కలా కాలువలు నిర్మించక పోవటంతో వర్షపునీరు పారుదలకు ఆటంకం ఏర్పడి ఆ ప్రాంతం జలమయం అవుతోంది. అలాగే పడమర వైపు నుంచి తూర్పు వైపునకు వర్షపునీరు వచ్చేందుకు రోడ్డుకు అక్కడక్కడ వేసిన తూములు కూడా వాటి సామర్థ్యం చాలకపోవటంతో నీరు తూర్పు వైపునకు సక్రమంగా రావటంలేదు. అధికారులు వెంటనే ఆ రోడ్డుకు రెండు వైపులా కాలువలు నిర్మించి కాలనీలో నీరు నిల్వకుండా చూడాలని కాలనీ వాసులు కోరుతున్నారు.




ఇందిరమ్మ కాలనీలో రోడ్డు పక్కన, నివాసాల మధ్య నిలిచిన వర్షపు నీరు

ఘనంగా గురజాడ జయంతి

కావలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యో తి): సాహిత్యప్రక్రియలను వ్యవహార భాష ఆవశ్యకతను తెలుగు వారికి తెలియచెప్పిన మహోన్నతుడు గుర జాడ అప్పారావు అని తెలుగు ధ్యాన పీఠం అధ్యక్షుడు డాక్టర్ జిల్లా శ్రీనివా సరావు, లోక్‌అదాలత్ సభ్యుడు ఎం. మాలకొండారెడ్డి అన్నారు. ఆదివారం కావలి పట్టణంలో ఎస్‌బీఐ పక్కను న్న క్లాత్‌మర్చంట్స్ అసోసియేషన్ కల్యా ణ మండపంలో గురజాడ జయంతి కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యమంలో రాపూరు సుబ్బారావు, మహిళలు పాల్గొన్నారు.



గురుజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాలకొండారెడ్డి, శ్రీనివాసరావు తదితరులు

కందుకూరులో...

కందుకూరు, సెప్టంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సిద్దార్థ స్కూల్లో ఆదివారం గురజాడ వేంకట అప్పారావు జయంతి సభను ఆదివారం నిర్వహించారు. గురజాడ జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ మాల్యాద్రి మాట్లాడుతూ కన్యాశుల్కం వంటి దురాచారాన్ని రూపుమాపి మహిళల జీవితాలలో వెలుగులు నింపిన మహనీయుడు గురజాడ అని కొనియాడారు. ఆయన రాసిన దిద్దుబాటు కథ, పూర్ణమ్మ గేయం, దేశభక్తి గేయాలు తెలుగు భాషకు తలమానికాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి టీవీవీ కృష్ణకుమార్, మండల కార్యదర్శి శరత్‌బాబు, స్కూల్ కరస్పాండెంట్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే మైదానంలో ఓపెన్ జిమ్ ప్రారంభం

బిట్రగుంట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వ్యాయామం, క్రీడలతో ఆరోగ్యంగా ఉండవచ్చని బిట్రగుంట రైల్వే పీడబ్ల్యూఐ రాజ్ కుమార్ అన్నారు. బిట్రగుంట రైల్వే ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో బచ్చు అమరా ట్రస్ట్ వ్యవస్థాపకుడు బచ్చు కృష్ణకుమార్, సంధ్య దంపతుల దాతృత్వంతో ఏర్పాటు చేసిన ఓపెన్ మినీ జిమ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ సభ్యుల కోరిక మేరకు మినీ జిమ్, చిన్నారులు ఆడుకునే జారుడు బండ, అప్ అండ్‌డౌన్ స్టాండ్స్ నిర్మాణానికి ఆర్థిక సహాయం చేసినందుకు అమరా ట్రస్ట్ సభ్యులు డాక్టర్ ఆనందసాగర్‌ను సన్మానించారు. జిమ్ కోసం కృషి చేసిన రైల్వే లోకో పైలెట్ పీ జీవన్‌కుమార్, వాకర్స్ అధ్యక్షుడు బీ బర్నాడ్, కోశాధికారి ఎం శ్రీనివాసులును వాకర్స్ త్రైక్వోండో మాస్టర్ రవిగన్ అభినందించారు. రైల్వే ఎంప్లాయీస్ సంఘ బిట్రగుంట సెక్రటరీ రాజశేఖర్ పాల్గొన్నారు.



జిమ్‌ను ప్రారంభిస్తున్న రాజ్‌కుమార్

నేటి నుంచి నవరాత్రి ఉత్సవాల ప్రారంభం



కలిగిరి, సెప్టెంబరు21(ఆంధ్యరజ్యోతి): మండలంలోని తెల్లపాడు గ్రామంలోని భద్ర కాళీ అమ్మవారి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 22 నుండి అక్టోబరు 2 వరకు వైభవంగా జరుగుతాయని ఆలయ ధర్మకర్త జూపల్లి వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. దేవస్థానం అర్చకులు రమణదీక్షితులు ఆధ్వర్యంలో జరిగే ఉత్సవాల మొదటిరోజు అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తారన్నారు. భక్తులు తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

ఎమ్మెల్యే ఇంటూరికి ఆహ్వానం

కుందుకూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో జరిగే దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కమిటీ సభ్యులు ఆదివారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవీ నవరాత్రులు భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతికి ప్రతీకని, అమ్మవారి ఆశీర్వాదం పట్టణ ప్రజలకు ఉండాలని ఆకాంక్షించారు.

శివాలయం, విష్ణాలయంలో నేటి నుంచి 'నవరాత్రులు'

కావలి,సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలోని పాతూరు శ్రీదుర్గాభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి (శివాలయం), విష్ణాలయంలో సోమవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఈవో రాధాక్రిష్ణ, అర్చకులు తెలిపారు. వారు ఆదివారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిని వేరు వేరుగా కలిసి నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానించారు. తప్పక పాల్గొంటానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డిని ఆహ్వానిస్తున్న ఆలయ ఈవో, పూజారులు తదితరులు

ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకుల భేటీ

ఏపీఎస్ ఆర్టీసీ కావలి డిపో ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షునిగా ఎన్నికైన దేవరకొండ శ్రీనివాసులు ఆదివారం యూనియన్ నాయకులతో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్మికులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి నాయకులు కృషిచేయాలని ఎమ్మెల్యే కోరారు. యూనియన్‌కు, నాయకులకు అండగా ఉంటానని చెప్పారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర

అల్లూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని మండల విద్యాశాఖాధికారి రవీంద్ర అన్నారు. అపస్మా ఆధ్వర్యంలో మండలంలోని నార్తుమోపూరు పరిధిలోని ఇందుపూరు కాలువ వద్ద డిఎస్ఆర్ ట్రస్ట్ వేదికపై నిర్వహించిన నియోజకవర్గంలోని అన్‌ఎయిడెడ్ ప్రైవేటు పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయుల అభినందన సభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో 24 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఎంవి సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, ట్రెజరర్ పి కృష్ణారావు, జిల్లా కార్యదర్శి ఎస్ రామ్మోహన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కె శివకుమార్, మొహమ్మద్ మజహర్, జె గోపాలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న అపస్మా సభ్యులు

హోంశాఖ మంత్రి అనితను సత్కరించిన టీడీపీ నేతలు

కందుకూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను ఆదివారం తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, నాయకులు, కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్ప గుచ్ఛం, శాలువాతో మంత్రిని సత్కరించారు. కార్యక్రమంలో మండల తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం నవీన్, టంగుటూరు మండలం ఐటీడీపీ ప్రధాన కార్యదర్శి పొనుగోటి చక్రవర్తి, ఏసుపోగు యోహాను, చాట్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



హోం మంత్రి అనితను సన్మానిస్తున్న మోషే, నాయకులు

కబడ్డీ ఛాంపియన్ ఆత్మకూరు ఎస్ఆర్‌జే టీమ్



కబడ్డీ పోటీల్లో ఛాంపియన్‌గా నిలిచిన ఎస్ఆర్‌జే డిగ్రీ కళాశాల జట్టు

ఆత్మకూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డాక్టర్ ఎస్ఆర్‌జె డిగ్రీ కళాశాలలో గత రెండురోజుల నుంచి జరుగుతున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల కబడ్డీ పోటీల్లో ఎస్ఆర్‌జె డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఛాంపియన్‌గా నిలిచారు. నెల్లూరుకు చెందిన జెనెక్స్ కళాశాల రన్నర్‌గా నిలిచింది. అదేవిధంగా చెస్ పోటీల్లో సూళ్లూరుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల టీమ్ ఛాంపియన్‌గా నిలిచింది. రన్నర్‌గా రావూస్ కళాశాల టీమ్. అనంతరం బహుమతి ప్రదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వరకుమారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సీహెచ్ వెంకటేశ్వర్లు, యూనివర్శిటీ పరిశీలకులు డా. పి ప్రసాద్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు మధుసూదన్‌రెడ్డి, రమణయ్య, వెంగళరావు, సతీష్, రవీంద్ర, అంకమ్మ, సుప్రియ, వివిధ కళాశాలల పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

'ఉపాధి' ఉద్యోగులపై పీడీ మండిపాటు

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న దుత్తలూరు ఉపాధి హామీ కార్యాలయ ఉద్యోగులు, సిబ్బందిపై డ్వామా పీడీ గంగాభవాని మండిపడినట్లు తెలిసింది. ఇటీవల కార్యాలయంలో ఈసీ, టీఏలు తీవ్ర వాగ్వివాదానికి దిగి బూతులు తిట్టుకోవడాన్ని మరవకముందే శుక్రవారం కార్యాలయ తలుపులు తెరిచిన ఉద్యోగులు, సిబ్బంది శనివారం వరకు పట్టించుకోకపోవడంపై వివిధ పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీంతో పీడీ ఉద్యోగికి ఫోన్ చేసి తీవ్రస్థాయిలో మందలించినట్లు సమాచారం. ఇకపై ఇలాంటి తప్పిదాలు చోటుచేసుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది.

అధ్వానంగా దత్తాత్రేయస్వామి గుడి రోడ్డు



ఎస్సీ కాలనీ వద్ద బురదమయమైన రహదారి

లింగసముద్రం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని మొగిలిచెర్ల ఎస్సీ కాలనీ నుండి దత్తాత్రేయస్వామి గుడికి వెళ్లే రోడ్డు బురదమయమైంది. నడవడానికి కూడా వీలు లేకుండా అధ్వాన్నంగా మారింది. దీంతో గుడికి వెళ్లలేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సీ కాలనీ నుండి సుమారు రెండు ఫర్లాంగుల మేర ఉన్న ఈ మట్టి రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉంటోంది. బురదమయం కావడంతో గుడికి కాలినడకన, ద్విచక్ర వాహనాల్లో వెళ్లే భక్తులు ఇబ్బందిపడుతున్నారు. 2 కి.మీ పొడవున తారు రోడ్డుపై మెటల్ లేచిపోవడంతో అసౌకర్యంగా మారింది. కొందరు వ్యక్తులు రోడ్డు పగులగొట్టి పైపులు వేసుకున్నారు. పైప్లకు నీరు పెట్టుకొని తర్వాత అలాగే వదిలేశారు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు, భక్తులు కోరుతున్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు



శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన సంగమేశ్వరాలయం



దసరా ఉత్సవాలకు ముస్తాబైన మానసాదేవి ఆలయం

● నేటినుంచి ప్రారంభం

సంగం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న కామాక్షిదేవి సమేత సంగమేశ్వరాలయంలో సోమవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా సంగమేశ్వరాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా కామాక్షిదేవి అమ్మవారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. సోమవారం ఉదయం కలశ స్థాపన, సాయంత్రం బాలా త్రిపుర సుందరిదేవి అలంకారం, 23న గాయత్రీ దేవి, 24న అన్నపూర్ణాదేవి, 25న కాత్యాయని దేవి, 26న లక్ష్మీదేవి, 27న సంతానలక్ష్మి, 28న చండిదేవి, 29న సరస్వతీదేవి, 30న దుర్గాదేవి, అక్టోబరు 1న మహిషాసురమర్ధిని, 2న రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అదేవిధంగా ఆలయంలో ప్రతిరోజు ప్రత్యేక పూజలు, పూలంగిసేవ, పల్లకీసేవ జరుగుతాయని భక్తులు అధికసంఖ్యలోపాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కార్యనిర్వాహణాధికారి రఘురామయ్య తెలిపారు.

●వరికుంటపాడు (ఉదయగిరి రూరల్) : మండలంలోని తూర్పురొంపిదొడ్లలో ఉన్న మానసాదేవి అమ్మవారి ఆలయంలో సోమవారం నుంచి దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చల్లా వంశస్థుల ఆధ్వర్యంలో నిర్వహించే మహోత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారు శైలిపుత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. అలాగే 23న బ్రహ్మచారిణి, 24న చంద్రఘంట, 25న కూష్మాండదుర్గ, 26న స్కందమాత, 27న కాత్యాయని, 28న కాళరాత్రి, 29న సరస్వతిదేవి, 30న మహాగౌరి అలంకరణ చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే అక్టోబరు 1వ తేదీన సిద్ధిరాత్రి, 2న మానసాదేవిగా భక్తులకు దర్శనం ఇస్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి ముస్తాబు చేశారు.



ఉదయగిరి పట్టణంలో కొలువైన సంతానలక్ష్మీ అమ్మవారు

●**ఉదయగిరి:** పట్టణంలోని పార్వతీ పరమేశ్వర, సంతానలక్ష్మీ ఆలయాలు, స్థానిక బాలాజీ నగర్‌లో సోమవారం నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు దసరా మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆదివారం నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. 11 రోజులపాటు రోజుకో అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇస్తారన్నారు. ఉదయం, సాయంత్రం విశేష పూజలు జరుగుతాయన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్న దాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

●**సీతారామపురం :** మండలంలోని ఘటిక సిద్దేశ్వర క్షేత్రం, సీతారామపురంలోని నారాయణంపేట దుర్గాదేవి ఆలయం, సీతారామపురంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా న్విహించనున్నట్లు ఆలయ కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. 22న సిద్ధేశ్వరీదేవి, 23న బాలాత్రిపుర సుందరీదేవి, 24న గాయత్రీదేవి, 25న అన్నపూర్ణాదేవి, 26న మహాలక్ష్మీదేవి, 27న కాత్యాయనీదేవి, 28న లలితా త్రిపురసుందరీ దేవి, 29న సరస్వతీదేవి, 30న మహాదుర్గాదేవి, 1న మహిషాసురమర్దిని, 2న రాజరాజేశ్వరీదేవి అలంకారాలలో ఇష్టకామేశ్వరీదేవి, దుర్గాదేవి, శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు

సంగం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన నాగారపమ్మదేవి ఆలయంలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్నానది జలాలు, క్షీర, సకల ద్రవ్య, పంచామృతాలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



నాగారపమ్మదేవిని దర్శించుకుంటున్న భక్తులు

బీజేపీ నేతల రక్తదానం




దుత్తలూరులో రక్తదానం చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో దేశ ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని చేపడుతున్న సేవా పక్వాడ్ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో బీజేపీ నాయకులు, యువత అధికసంఖ్యలో పాల్గొని రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు లెక్కల వెంగళరెడ్డి, మేకపాటి మాల్యాద్రినాయుడు, చుండి హరి గోపాల్ రెడ్డి, అందె రామయ్య, శివపార్వతి, మూలె బాలకృష్ణారెడ్డి, కదిరి రంగారావు, పెసల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఒరిగిన విద్యుత్ స్తంభం

● పొంచి ఉన్న ప్రమాదం



ఒరిగిన విద్యుత్ స్తంభం

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు సెంటర్ సమీపాన నందిపాడు మార్గంలో 565 జాతీయ రహదారి పక్కనే ఉన్న పొలాల్లో 11 కేవీ విద్యుత్ స్తంభం ఒరిగిపోయి కూలే దశలో ఉంది. గాలులకు స్తంభం నేలకొరిగితే ప్రమాదాలు సంభవించే అవకాశముందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. స్తంభానికి సమీపంలోనే విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణం అని, ఇప్పటికైనా అధికారులు స్పందించి స్తంభాన్ని మార్చాలని రైతులు కోరుతున్నారు.



ఇంద్రకీలాద్రికి దసరా శోభ

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

- ఈఏడాది 20 లక్షలమంది భక్తులు వస్తారని అంచనా
- 29న దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి స్నపనాది క్రతువు నిర్వహిస్తారు. తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిస్తారు. ఉదయం 8-8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది దేశం నలుమూలల నుంచి ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల కోసం స్లాట్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల వరకు కల్పిస్తారు. ఈ ఏడాది భక్తుల కోసం 20 లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా ఇంద్రకీలాద్రి విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా వెలుగుతోంది. 29వ తేదీ మూలానక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపులు

శరన్నవరాత్రులు ముగిసే వరకు అమలు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై సోమవారం నుంచి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల కారణంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

- హైదరాబాద్-విజయవాడ-హైదరాబాద్-విశాఖపట్నం మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగి హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి వాహనాలు చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి నల్లకుంట వద్ద దిగి హైదరాబాద్ మార్గంలోకి వెళ్లాలి.
- హైదరాబాద్ - మచిలీపట్నం-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగాలి. కేసరపల్లి మీదుగా మచిలీపట్నం చేరుకోవాలి. ఇటు నుంచి వెళ్లే వాహనాలు కేసరపల్లి వద్ద నుంచి చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కాలి.
- హైదరాబాద్-చెన్నై-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా గుంటూరు చేరుకుని అక్కడి నుంచి చెన్నై వెళ్లాలి. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.
- చెన్నై-విశాఖపట్నం-చెన్నై మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఒంగోలు, త్రోవగుంట, చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ బైపాస్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి చెన్నై వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.

నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, కంకణపూజ, కంకణధారణ తదితర పూజలు నిర్వహించనున్నారు. భ్రమరాంబికాదేవి అమ్మవారు సోమవారం శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ నిర్వహించనున్నారు.

ఉత్తరాంధ్రకు వాయు'గండం'

- పిడుగులతో భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక
- బెజవాడలో 13 సెంటీమీటర్ల వర్షం.. నేడు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్రకు వాయుగుండం పొంచి ఉంది. ఈ నెల 26న వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం 27న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు ఎక్కువగా ఉంటుందని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోమవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీంతో సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్రలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 25న తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. మూడు రోజుల వ్యవధిలో ఏర్పడనున్న రెండు అల్పపీడనాల ప్రభావంతో ఈనెల 24 నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు, కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. విజయవాడ సింగ్‌నగర్‌లో 13, చిత్తూరు జిల్లాలోని కాగితలో 8.3, ఏలూరు జిల్లా కాకర్లమూడిలో 8, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 6.9, చిత్తూరులోని యాదమర్రిలో 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, ఒకట్రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని నిపుణుడొకరు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణ చేసిన అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫోటోను జ్ఞాపికగా అందజేశారు.

నేటి నుంచి విశాఖలో 28వ జాతీయ ఈ గవర్నెన్స్ కాన్ఫరెన్స్

- ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుంది
- కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి

విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌ను ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి వి.శ్రీనివాస్ వెల్లడించారు. విశాఖలో ఆదివారం మాట్లాడుతూ.. వికసిత్ భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో సదస్సు ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తారన్నారు. ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుందని, ప్రస్తు తం 738 రకాలు సేవలు అందిస్తున్నారని, దీనిని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా అభివర్ణించారు. విశాఖ డిక్లరేషన్‌లో దీనిని భాగం చేసి దేశమంతా అమలు చేసేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారన్నారు. అత్యుత్తమ కార్యక్రమాలు నిర్వహించిన వారికి ఈ గవర్నెన్స్- 2025 అవార్డులు అందిస్తామన్నారు.

కూటమి నేతలపై అనుచిత పోస్టులు

- వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు



వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో అంజాద్ ఖాన్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. కదిరి పట్టణానికి చెంది న కౌలేపల్లి అంజాద్‌ఖాన్ అలియాస్ మెగా అంజాద్ వైసీపీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తుండేవాడు. రెండ్రోజుల క్రితం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు.

27లోపు డిమాండ్లు పరిష్కరించాలి

- లేదంటే పెన్షన్ పంపిణీని నిలిపేస్తాం
- ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ

పెనమలూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27 లోపు తమ డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్చలకు పిలవని పక్షంలో అక్టోబరు 1 నుంచి పెన్షన్ పంపిణీని నిలుపుదల చేసేందుకు వెనుకాడబోమని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ హెచ్చరించింది. పోరంకిలో ఆదివారం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బగ్గా జగదీష్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కలెక్టర్లకు, ఇతర అధికారులకు జేఏసీ తరఫున నోటీసులు అందజేస్తామన్నా రు. 26, 27 తేదీల్లో ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న అఫిషియల్ వాట్సాప్ గ్రూపుల నుంచి ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా వైదొలుగుతారన్నారు. 28న రాయలసీమ వేదికగా కర్నూలు జిల్లాలో ప్రాంతీయ సమావేశం ఏర్పాటుచేసి తదుపరి కార్యాచరణను విడుదల చేస్తామని తెలిపారు.

తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలకు రేపు అంకురార్పణ

- ఎల్లుండి ధ్వజారోహణంతో ఉత్సవాలు ఆరంభం

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలను ప్రారంభించడానికి మంగళవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలో సేనాధిపతిని అలంకరించి విశేష సమర్పణ గావిస్తారు. అనంతరం తిరుచ్చిపై ఆశీనులు చేస్తారు. రాత్రి ఏడు గంటలకు ఆలయం నుంచి బయల్దేరి నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత ఆలయానికి చేరుకున్న అనంతరం రంగనాయకమండపంలో ఆస్థానం జరుగుతుంది. యాగశాలలో అర్చకస్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ(బీజవాపం) కార్యక్రమం నిర్వహిస్తారు. 24వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయి.

తప్పుడు వార్తలను నమ్మకండి

- కపిలతీర్థంలో ఎలాంటి తొక్కిసలాట జరగలేదు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొక్కిసలాట జరిగిందని, కపిలతీర్థంలో ఏర్పాట్లు చేయలేదని సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు వార్తలను భక్తులు నమ్మవద్దంటూ టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. 'మహాలయ అమావాస్య సందర్భంగా తిరుపతి కపిలతీర్థం ఆలయం బయట ప్రైవేట్ వ్యక్తులు పితృతర్పణాల కార్యక్రమం చేసుకోవడం ఆనవాయితీ. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌ను టీటీడీ ఏర్పాట్లు చేసింది. రద్దీ నేపథ్యంలో భద్రతాపరంగా పటిష్ట చర్యలు తీసుకున్నాం. ఎస్పీ వాహనం, పోలీస్ వాహనం రావడంతో తొక్కిసలాట జరిగినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తిరుమలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా ఇక్కడ తొక్కిసలాట అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కొంతమంది టీటీడీని లక్ష్యం చేసుకుని దుష్ప్రచారం చేయడం సరికాదు. టీటీడీ ప్రతిష్ఠను పలుచన చేయడాలని చూడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. ఇలాంటి వార్తలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అంటూ టీటీడీ తన సోషల్ మీడియా ద్వారా పేర్కొంది.

విజ్ఞాన్ వర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు విద్య, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్ మాట్లాడుతూ ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశ్వనాథన్ ఆనంద్, హరికృష్ణ, హంపి, హరిదాసన్, ప్రజ్ఞానంద లాంటి ప్రతిభావంతులు దేశానికి ఎనలేని కీర్తి తెచ్చారని అశోక్ కొనియాడారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మొదటగా ఒక ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ లాల్‌త మునా, చీఫ్ ఆర్బిటర్ అనంత రామన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.సురేష్, చీఫ్ అడ్వయిజర్ కేవీవీ శర్మ, సెక్రటరీ కే.జగదీష్, గుంటూరు చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రవీంద్రరాజు, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'సీతయ్యోరి' వీధి బడి..చూస్తే గుండె తడి !

- ఎందరో ప్రముఖులు అక్షరాలు దిద్దుకున్న బ(గు)డి
- శిథిలావస్థలో 'చదువుల' ఆలయం



కోవూరులోని 'సీతయ్యోరు' వీధిబడి

కోవూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యానికి పూర్వమెప్పుడో సీతయ్య స్థాపించిన వీధిబడి ఎందరో విద్యార్థుల్ని మేధావులుగా తీర్చిదిద్దింది. ప్రముఖులుగా వారు ఎదగడానికి మేథో విజ్ఞాన భాండాగారమై నిలిచింది. 'సీతయ్యోరి' బడిగా అందరూ ఎంతో ఆత్మీయంగా పిలుచుకొనే ఈ వీధి బడి.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాలగా మారింది. ఈ పాఠశాలలో చదివిన విద్యార్థులు ప్రముఖులుగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిని సొంతం చేసుకున్నారు. ఇరువురు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా, హైకోర్టు న్యాయమూర్తులుగా సేవలందించారు. ప్రముఖ హృద్రోగ నిపుణులుగా, క్యాన్సర్ వ్యాధి నివారణ వైద్యులుగా అంతర్జాతీయస్థాయిలో గుర్తింపును, గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. ఇక్కడ అక్షరాలు దిద్దిన పలువురు చలనచిత్ర రంగంలో కూడా అప్పట్లోనే సంచలనాలు సృష్టించారు. ఎంతోమంది విద్యార్థుల్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్ళిన నాటి 'సీతయ్యోరు' వీధిబడి నేడు దయనీయ స్థితికి చేరుకుంది. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. 'ఏకోపాధ్యాయిని' పాఠశాలగా మారింది. ఒకే ఒక ఉపాధ్యాయురాలు ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్నారు. పాఠశాల తరగతి గదిలో చిత్రించిన దేశభక్తుల ఫొటోలు అందర్నీ ఆకట్టుకుంటున్నాయి. ప్రశాంతతకు మారుపేరుగా నిలిచే ఈ పాఠశాలను అభివృద్ధి చేయాలని పలువురు విద్యావేత్తలు, తల్లిదండ్రులు కోరుతున్నారు. బ్రిటీషు ప్రభుత్వ హయాంలోనే విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చిన ఈ చదువుల దేవాలయం ఓ చారిత్రక అవశేషంగా కాలగర్భంలో కలిసిపోకుండా రక్షించుకోవలసిన చారిత్రక అవసరం ప్రభుత్వం, విద్యాశాఖాధికారులపైన ఎంతో ఉంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ దిశగా స్పందించాలని, చేయూత అందించాలని పట్టణవాసులు కోరుతున్నారు.



చిన్నారికి బోధిస్తున్న ఉపాధ్యాయిని

ప్లాస్టిక్‌ను వీడి గుడ్డ సంచులు వాడండి

- టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ని వీడండి.. గుడ్డ సంచులు వాడాలని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం శివాజీ యూత్ ఫౌండేషన్, జానవార్ధి సేవా సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన గుడ్డ సంచులను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాజీ యూత్ ఫౌండేషన్ ఫౌండర్, సీఈవో డాక్టర్ మోపూరు భాస్కర్‌నాయుడు 25 ఏళ్లుగా ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ యువతకి స్ఫూర్తిదాయకంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ రూరల్ సెల్ అధ్యక్షురాలు చీకవోలు శాంతి, టీడీపీ నేత జలదంకి సుధాకర్, వెలమ యువత ఫౌండేషన్ తేజ నాయుడు, స్వాన్ ఓఆర్‌జీ భానుతేజరెడ్డి, అవెన్యూస్ సీనియర్ సెకండరీ స్కూల్ కరస్పాండెంట్ పెనుబల్లి కృష్ణచైతన్య, చీకవోలు శ్రీనివాసులు, దూడల సుధీర్, 28వ డివిజన్ ఇన్‌చార్జి చెక్కా సునీల్, పామూరు సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ విశ్వాసంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

- పాల్కన్ సిటీ మాజీ డిప్యూటీ మేయర్



జ్యోతి వెలిగిస్తున్న ఏడుకొండలు, యానాది హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు కార్యదర్శి పొట్లూరి శ్రీనివాసులు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గిరిజన యువత ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అమెరికాలోని పాల్కన్ సిటీ మాజీ డిప్యూటీ మేయర్ చలంచర్ల ఏడుకొండలు అన్నారు. నగరంలోని గిరిజన భవన్‌లో గిరిపుత్ర ఫౌండేషన్, యానాది హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం గిరిజన యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ కసితో, పట్టుదలతో చదివితే అనుకున్నది సాధించగలమన్నారు. యానాది హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు కార్యదర్శి పొట్లూరి శ్రీనివాసులు మాట్లాడుతూ ఏడుకొండలు అమెరికా నుంచి వచ్చి గిరిజన యువత అభివృద్ధి కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. గిరిజన యువత విద్య, క్రీడలు, రాకీయరంగాలలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో జయభారత్ వైద్యశాల జనరల్ మేనేజర్ మారెళ్ల గురుప్రసాద్, యాకసిరి వెంకటేశ్వర్లు, బాపట్ల వెంకటపతి, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర నూతన కమిటీ ఎన్నిక

ఒంగోలు కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా బేబీరాణి, కారుసాల సుబ్బరావమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒంగోలులో జరిగిన యూనియన్ రాష్ట్ర మహాసభల్లో చివరి రోజైన ఆదివారం 89 మందితో రాష్ట్ర కమిటీని, 33 మందితో ఆఫీసు బేరర్లను ఎన్నుకున్నారు.

ఆరేళ్లుగా ఎదురుచూపులు

- విడుదల కాని పెళ్లికానుక నిధులు
- వైసీపీ హయాంలోనే మంగళం
- ఇంకా దృష్టి సారించని ప్రభుత్వం
- అసలు పథకం ఉన్నట్లా.. లేదా..?

- సంగం గ్రామానికి చెందిన జే. చవడయ్య నిరుపేద కుటుంబం. 2020 ఏప్రిల్‌లో ఆయన తన కుమార్తెకు వివాహం చేశారు. సుమారు రూ. మూడు నుంచి రూ. నాలుగు లక్షల వరకు ఖర్చయింది. సుమారు రూ. రెండు లక్షలు అప్పు చేసి పెళ్లి చేశాడు. పెళ్లికానుకకు దరఖాస్తు చేసుకున్నారు. బ్యాంకు ఖాతాకు నేరుగా నగదు జమ అవుతుందని అధికారులు చెప్పారు. అదిగో...ఇదిగో... అంటూ కాలయాపన చేశారు. నాలుగేళ్లు ఎదురుచూశాం. మంజూరు కాలేదు. ఇంతలో ఎన్నికలు వచ్చాయి. వైసీపీ ఓడిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పెళ్లికానుకపై ఆశలు పెట్టుకున్నాం. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా పెళ్లి కానుక లేదు. ఎదురు చూస్తున్నామని బాధితుడు వాపోయాడు.
- వంగల్లు గ్రామానికి చెందిన వెంకటరమణయ్యది నిరుపేద దళిత కుటుంబం. ముగ్గురు ఆడపిల్లలు. 2024 ఆగస్టులో పెద్ద కుమార్తెకు విడవలూరు మండలంలో ఓ యువకుడికి ఇచ్చి వివాహం చేశాడు. కూటమి ప్రభుత్వంలో పెళ్లి కానుక వస్తుందని ఆశతో కొంత అప్పు చేసి పెళ్లి చేశాడు. ఏడాది దాటింది. అయినా ఇంత వరకు ఆ ఊసే లేదు. వడ్డీ పెరిగిపోతుంది. పెళ్లికానుక వస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నాం. ఈ పరిస్థితి ఏ ఒక్క చవడయ్య, వెంకటరమణయ్యలదే కాదు. జిల్లాలో వందల మంది ఆడబిడ్డ తల్లిదండ్రులది.



సంగం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఒకరు కాదు ఇద్దరు కాదు వందల మంది పెళ్లికానుక కోసం వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్నారు. ఏ ఒక్కరికీ కానుక అందలేదు. గత ప్రభుత్వంలోనే దాదాపు మూడు వేలకు పైగా అర్హులు దరఖాస్తు చేసుకున్నారు. అదిగో... ఇదిగో.. అంటూ కాలయాపన చేశారు. కానీ ఒక్కరికీ మంజూరు కాలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పథకంపై కదలిక వచ్చింది. కానీ చెల్లింపులు మాత్రం జరగడంలేదు. దీంతో కానుక కోసం పేదింటి తల్లిదండ్రులు ఆశగా ఎదురుచూపులు పేదిళ్లలో పిల్లల వివాహం తల్లిదండ్రులకు ఆర్థిక భారం. చేతిలో రూ. లక్షలాది రూపాయలు ఉండాల్సిందే. స్తోమత ఉన్నవారికి పర్వాలేకున్నా, సామాన్య, మధ్య తరగతి వారికి రుణం తప్పదు. కొందరైతే ఉన్న ఆస్తిని విక్రయించి పిల్లల పెళ్లిళ్లు చేస్తుంటారు. అటువంటి వారి కోసం టీడీపీ ప్రభుత్వం హయాంలో చంద్రన్న పెళ్లి కానుక పథకాన్ని ప్రకటించారు. అమలు చేసే బాధ్యతను వెలుగు డీఆర్‌డీఏ శాఖకు అప్పగించారు. వివాహమైన కొద్దిరోజులకే నగదు మొత్తాన్ని అందించే ఏర్పాట్లు చేసేవారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక పథకాన్ని పట్టించుకోలేదు. దరఖాస్తు చేసుకున్నా నిధులు ఇవ్వడం లేదు. దరఖాస్తుదారుల సంఖ్య వందల్లో చేరింది. ప్రోత్సాహకం చెల్లించకపోవడంతో కొన్నేళ్లుగా కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య తగ్గిపోయింది. గత టీడీపీ ప్రభుత్వంలో బీసీ అయితే రూ. 35వే లు, బీసీ అయి ఉండి కులాంతర వివాహం చేసుకుంటే రూ. 50వేలు, ఎస్సీలకు రూ. 40వే లు, వధువు ఎస్సీ అయి ఉండి కులాంతర వి వాహం చేసుకుంటే రూ. 75వేలు, ఎస్టీలకు రూ. 75వేలు పెళ్లి కానుకగా అందించేవారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 2019 వరకూ ఎప్పటికప్పుడు సక్రమంగా చెల్లింపులు జరిగాయి. వైసీపీ వచ్చాక పథకం పడకేసింది.

● పథకాలన్నీ పునరుద్ధరిస్తాం...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వైసీపీ నిలిపేసిన గత టీడీపీ హయాంలో అమలులో ఉన్న పథకాలన్నింటీ పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో ప్రకటించారు. ఆ మేరకు అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వంలో పెళ్లి కానుకలో కదలిక వచ్చింది. వెబ్‌సైట్ కూడ ఇచ్చారు. చాలామంది దరఖాస్తు చేసుకున్నారు. నిధులు మంజూరు కాలేదు. ప్రస్తుతం వెబ్‌సైట్ కూడ నిలిపేశారు. దీంతో ఈ పథకం ఉందా లేదా...? అనే సందేహం వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి పెళ్లికానుక అమలు చేస్తారా లేదా తెలపాలని పలువురు కోరుతున్నారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

కోటబొమ్మాళి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలంలోని కొత్తమ్మతల్లి ఉత్సవాలు ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా నాలుగు రోజులు పాటు జరగనున్న బాలికలు, పురుషుల రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు స్థానిక ప్రభుత్వ పాఠశాల మైదానంలో ఆదివారం సాయంత్రం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. కబడ్డీ సంఘం జిల్లా అధ్యక్షుడు వై.వెంకన్న చౌదరి, టెక్కలి ఆర్‌డీవో ఎం.కృష్ణమూర్తి పోటీలను ప్రారంభించారు. తొలుత ప్రకాశం, నెల్లూరు బాలికల జట్లు, అనంతపురం, విజయనగరం పురుషుల జట్ల మధ్య కబడ్డీ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో మొత్తం 12 బాలికల కబడ్డీ జట్లు, 21 పురుషుల జట్లు పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, జడ్పీ సీఈవో ఎల్.వి.ఎస్.శ్రీధర్‌రాజా, తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీవో ఫణీంద్రకుమార్, నెహ్రూ యూత్ కోఆర్డినేటర్ వెంకట్ ఉజ్వల్, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఎ.చిరంజీవరావు, డీఎస్పీ లక్ష్మణరావు, జిల్లా కబడ్డీ ఆర్గనైజేషన్ సెక్రటరీ ఆర్.అప్పలస్వామి పాల్గొన్నారు

స్వచ్ఛత అంటే ఇదేనా..!?



ప్రాంగణం చుట్టూరా ఏపుగా పెరిగిన పిచ్చి చెట్లు

వరికుంటపాడు(ఉదయగిరిరూరల్), (ఆంధ్రజ్యోతి): వరికుంటపాడు మండలం కాంచెరువు గ్రామ సచివాలయ ప్రాంగణం చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, నిరుపయోగ సామగ్రితో సహా ఉద్యోగులు ఉండే గదుల్లోను అపరిశుభ్రత విలయతాండవం చేస్తోంది. విలువైన సామగ్రిని సైతం భద్రపరచకుండా ఓ గదిలో చిందరవందరగా పడేయడంతో అవి తుప్పు పట్టి నాశనమవుతున్నాయి. ఇదే స్వచ్ఛత అంటూ ప్రజలు ఉద్యోగులను నిలదీస్తున్నారు.